## నివాళులు



తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ కి
గానకళ నివాళులర్పిస్తున్నది.


63వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 63 డిసెంబర్ 2024 సంచిక - 7




# త్యాగరాజస్వామిపై ప్రత్యేక సంచిక

63వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

వ్యవస్థాపకులు **కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు **డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు **మునుగంటి వెంకట్రావు**

**30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721**

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

**సంపుటి - 63** **డిసెంబర్ 2024** **సంచిక - 7**

**సంపాదకవర్గం :**

శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి. వర్ధని
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీ ఎమ్. వి. సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**

శ్రీ ఎం.ఎస్. శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్. అచ్యుత రామయ్య
శ్రీమతి నూలి వెంకట లక్ష్మిదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, M.A., (Music)
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎమ్.వై. శేషురాణి, గుంటూరు

## ఈ సంచికలో....

| | | | పేజిలలో |
|---|---|---|---|
| 1. | గతానికి స్వాగతం... త్యాగయ్య- వాగ్గేయకారత్వం. | - శ్రీ మల్లాది సూరిబాబు | 3 |
| 2. | సుధాతరంగం...త్యాగయ్య భక్త్యావేశం. | - శ్రీ మోదుమూడి సుధాకర్ | 4 |
| 3. | త్యాగయ్య-ప్రహ్లాద భక్తి విజయం. | - వేమూరి రామలక్ష్మిగారు | 7 |
| 4. | మూలాధారజ నాదమెరుగుట ముదమగు మోక్షమురా.... | - కీ.శే. కె.వి.ఎస్.ఎమ్.గీర్వాణీరావు గారు | 14 |
| 5. | శ్రీ.కె.వి.ఎస్.ఎమ్.గీర్వాణీరావు గారి పరిచయం. | - శ్రీ ఏ.ఎస్.రాజారావు. | 24 |
| 6. | త్యాగరాజును గురించి-ఇతరులు చేసిన స్తుతి-వ్రాసిన రచనలు. | - శ్రీ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి. | 25 |
| 7. | గాయక సార్వభౌములు శ్రీ పారుపల్లివారు. | - శ్రీ యనమండ్ర వెంకటకృష్ణయ్య. | 35 |
| 8. | కృతి రత్నావళి-5 | | 42 |
| 9. | సంగీతసభల కార్యకలాపములు | - విహారి. | 44 |
| 10. | సునాద వినోదిని - సమావేశం సంగతులు. | - శ్రీ ములుకుట్ల వెంకటనారాయణ. | 50 |

## ముఖచిత్రం

1. వాగ్గేయకారులు శ్రీరామ భక్తి సంపన్నులు శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధన సందర్భంగా (పుష్యబహుళ పంచమి) గానకళ ప్రత్యేక సంచిక. (ఫోటో సౌజన్యం సరస్వతీగాన సభ కాకినాడ).
2. ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసులు పద్మవిభూషణ ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ కి "గానకళ" నివాళులు అర్పిస్తున్నది.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

**ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.**

గతానికి స్వాగతం

# త్యాగయ్య - వాగ్గేయకారత్వం



- మల్లాది సూరిబాబు

సరళమైన మాటలకు, నాదసుధా రసాన్ని మేళవించి, సంగీతార్చనతో రామచంద్రుని పరవశింపజేసి, పునీతుడైన వాగ్గేయకారుడు, త్యాగరాజు. బాగా గమనించి వినండి!

త్యాగరాజు కృతులు ఒకదానిలా మరొకటి యుండక – ఏదో కొత్త నుడికారమో, వైవిధ్యమైన నడకో కనిపిస్తుంది. అప్పటికప్పుడు ఆశువుగా మనసులో పుట్టిన భావ పరంపరతో సమానంగా, అక్షరాలన్నీపదాలై, గంభీరమైన మాటలై ఆయన గొంతులో ప్రతిధ్వనించి పరవశింపజేశాయి. దీనికి ప్రధాన కారణం త్యాగయ్యకున్న అపారమైన గానవిద్యాపాండిత్యమే. రామచంద్రుడి గుణ గణాలను కీర్తించడానికే ఆ బ్రహ్మ త్యాగయ్యను సృష్టించాడనిపిస్తుంది అంటుండేవారు పాణిగారు.

'పలుకు పలుకునకు తేనియలొలుకు వంటి మాటల్లో తేనె రసం, మాటలదో లేక పాటదో చెప్పలేని ఒక సంగీత రసాయినం అని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు ఓ సందర్భంలో చెప్తూ... 'దొరకునా యిటువంటి సేవ', 'ప్రక్కల నిలబడి కొలిచే ముచ్చట', 'నీదయచే రామ' మొదలైన కృతులలో ఉండే ధాతుమాతు మాధుర్యాన్ని భావగాంభీర్యాన్ని వర్ణించడం మనవల్ల అయ్యేదేనా? ఆ మాటలను మనవాళ్ళు అంత అందంగా పాడుతున్నారా? అన్నారు. ఇవాళ సంగీతం ఉపాధిగా మారింది. సంగీత కచేరీల్లో కూడా మార్పు వచ్చింది. అభిరుచులు మారిపోయాయి.

నిజంగా చెప్పాలంటే, త్యాగయ్యగారి హృదయవేదనలోని అర్థంగానీ, ఆందోళనగానీ గాయకులు పాడే విధానంలో ఆవిష్కృతమౌతోందా? అంటే సమాధానం దొరకదు.

గురుభక్తి బాగా పేరుకుపోయిన త్యాగయ్యగారి శిష్య ప్రశిష్య పరంపర ఆయన కీర్తనలన్నీ ప్రచారమయ్యేందుకు చేసిన భగీరథ ప్రయత్నం మాత్రం మిగిలింది. ఇది అసామాన్యం, అద్వితీయం.

కానీ, సాహిత్యాన్ని ఒక్క రవ్వ స్థిమితంగా చూస్తూ, ఆలోచిస్తే, చిందర వందరగా పాడేసే గమకాలతో నిండిపోయి, అసలేం పాడుతున్నారో తెలియని స్థితికి దిగిపోయారా? అనిపిస్తుంది.

సాహిత్యం అర్థం కాదనే భావంతో బొత్తిగా పాడి పాడిగా పాడేసినా ఆ పాటకు సంగీత గౌరవం ఉండదు.

రెండూ సమాన స్థాయిలో ఉండాలి. గమకశుద్ధంగా ఉంటేనే రాగానికి గౌరవం. మాటలు అర్థమయ్యేలా గమకాల్ని ఒడుపుగా పాడగలిగితే చాలు. ఎవరికి వారే తెలుసుకోవలసిన విషయమిది.


సుధా తరంగమ్

# తన జీవితకాలంలో తొంభైఆరుకోట్ల రామనామం పూర్తిచేసి,శ్రీరామ సాక్షాత్కారాన్ని పొందిన వేళ, భక్త్యావేశంతో-



- మోదుమూడి సుధాకర్

9885183988. విజయవాడ




"ఇనకులమందు ఇంపుగా బుట్టిన, ఇలలోన సీతానాయకుని, నే కనుగొంటిని... భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు కొలువ, పవమానసుతుడు పాదములు బట్ట, ధీరులైన సుగ్రీవ ప్రముఖులు వినుతిసేయ, సీతానాయకుని నేను కనుగొంటిని !

శ్రీరాముని నేడు".. అంటూ బిలహరి రాగంలో గళమెత్తి పాడిన త్యాగయ్య ధన్యజీవి. రాముడు అంత తేలికగా త్యాగయ్యకి దర్శనం ఇవ్వలేదు. ఎన్నో పరీక్షలు పెట్టాడు. మరెన్నో కష్టనిష్టూరాలకు గురిచేశాడు. నిత్యం త్యాగయ్య జీవనసరళిని గమనించాడు. అయితే త్యాగయ్య అన్నింటిలోనూ నెగ్గారు. ఆయనకు ఉదయం లేచింది మొదలు నిద్రాసమయం వరకూ

3వ పేజి తరువాయి

శృతి లయలు చక్కగా అమర్చుకుంటూ ఎంతో జాగ్రత్తగా పాడే గాయకులు మాటలను నమిలి మింగేసే అవసరం లేదు గదా?

తెలుగు మాతృభాష కాని తమిళులు తెలుగులో ఉండే కీర్తనలు అరవంలోనే రాసుకుని వల్లిస్తారు. అక్కడక్కడ ఉచ్చారణ దోషాలు లేకుండా ఉండవు. అది వేరే విషయం. కానీ తమిళులు 'త్యాగరాజు భాషకు ఆయన సంగీతానికి లొంగిపోయారు.

సంగీతానికి యోగ్యత ఒక్కటే ఉంటే చాలదు. యోగం కూడా ఉండాలి.

యోగం అంటే కలవడం. పరమాత్మతో పరిపూర్ణంగా కలిసిపోయి, దివ్యమైన సంగీతంతో ఏకం కావడం. ఈ స్థితి అందరికీ సిద్ధించదు – నాదసిద్ధి పొందిన విద్వాంసులే నిత్య స్మరణీయులు.

★ ★ ★

రామనామమే జపం, తపం.. రామ సేవనమే జీవనం.. పైగా ఎటువంటిది త్యాగయ్య సేవ? అల్ప తపమొనరించిన మునులకు దొరకని, అపురూప సేవ.. త్యాగయ్య ఉదయం సూర్యోదయానికన్నా ముందే లేచి, కాలకృత్యాలు ముగించుకొని, పూజా మందిరంలో కొలువైన రామునికి మేలుకొలుపులు పాడేవారు.. సూర్యునికి ప్రియమైన సౌరాష్ట్ర రాగంలో." మేలుకో దయానిధీ! మేలుకో దాశరథీ!" అంటూ ఆరంభించి, అప్పటికీ కనులు తెరువని స్వామిని, ఉదయపు రాగం– బౌళిలో "మేలుకోవయ్య! మమ్మేలుకో రామ!" అంటూ పాడి,' నారదాది మునులు, దిక్పాలకులు, సురలెల్ల నీపూజకై వేచియున్నార'ని వేడుకోగా, స్వామి కనులు మెల్లగా, తెల్లగా విప్పారేవి!

వెనువెంటనే "భళి భళి భక్తుల పూజాఫలము నీవునుకొంటి, నళినలోచన! నీకు నలుగుబెట్టేరా! నాపాలి శ్రీరామ! భూపాలక స్తోమ! కాపాడ సమయము, నీ పాదములీర!" అంటూ శంకరాభరణ రాగంలో పాడుతూ, రామయ్యకి స్నానాది ఉపచారాలు ఒద్దికగా నిర్వహించేవారు.. తదుపరి, తిరిగి తన పూజామందిరంలోకి యదుకులకాంభోజి రాగంలో "పచ్చవిల్తుని గన్న పాలిత సురేంద్ర! హెచ్చరికగారార! హే రామచంద్ర!" అంటూ సవినయ ఆహ్వానం పలికేవారు.

త్యాగయ్య కోరి, పాడుకొన్నట్లు, రామునిపై 'మినువాసులెల్ల విరులను చిలికేవారు'! ఆపిదప, పవనజ స్తుతిపాత్రుడు, పావన చరిత్రుడు, రవిసోమ వరనేత్రుడు, రమణీయ గాత్రుడు అయిన రామయ్యకు, జానకీమాతకు కల్యాణం చేసేవారు భక్తిశ్రద్ధలతో త్యాగయ్య.

"సీతాకళ్యాణ వైభోగమే.. రామకల్యాణ వైభోగమే".. అదే నిజమైన వైభోగం.. త్యాగయ్య మనసు'కు రంజిల్లత చేకూర్చే మధుర ఘట్టం అది!.. ఇక, శ్రీరామచంద్రప్రభువు కొలువుతీరే సమయ మాసన్నమయేది! కొలువుకు అన్ని ఏర్పాట్లూచేసి, తాను అలంకరించిన నవరత్నఖచిత సింహాసనంపై కూర్చుండబెట్టి, దేవగాంధారి రాగాలాపనచేసి," కొలువైయున్నాడే కోదండపాణి" అంటూ పాడుకొని, పరవశించిపోయేవారు త్యాగయ్య! ఎలా ఉండేది ఆ కొలువు?

"వరమగు వాసనలు పరిమళింప, సన్నిధిలో సుర, వారసతులు బాగ నటింప, అదిగాక, పరాశర, నారద మునులెల్ల నుతింప, ఎంతెంతో నెనరున సురపతి, వాగీశులు సేవింప, మేను పులకరింప", దేదీప్యమానంగా విరాజిల్లేది! మధ్యాహ్న సమయమయ్యేది... అది.. రాచకార్యాలతో అలసి, సొలసిన రామచంద్రునికి ఆకలయ్యే వేళ అని త్యాగయ్యకు ముందే తెలుసు. అందుకే.. "సారమైన దివ్యాన్నము, షడ్రసయుత భక్షణములు" సిద్ధంచేసేవారు. వాటితోపాటు మధురమైన పాలను, దార, సోదరాదుల'తోడి' గూడి, తన పాలు(భాగం) ఆరగింపమని రాముని వేడుకోనేవారు. తృప్తిగా ఆరగించిన రామచంద్రునికి తదుపరి అందివ్వవలసినది–

విడెము... అంటే.. జాజికాయలు, యాలకులు,జాపత్రి, వక్కలు, ఆకులతో కమ్మటి తాంబూలం.. అయితే, తన చేతితో ఇస్తే స్వీకరిస్తాడా స్వామి? త్యాగయ్యగారికి మెరపువంటి ఆలోచన వచ్చేది.

ఖరహరప్రియ రాగంలో "విడెము సేయవే! నన్ను విడనాడకవే!" అంటూ.. తన చేతులనే, 'పుడమి తనయ చేతి మంచి మడుపులనుచు తలచి', స్వీకరించమనేవారు. త్యాగయ్య భక్తికి పరవశించిపోయి, ఆనందంగా తాంబూల సేవనం చేసేవారు రామయ్య. భోజనానంతరం, కాసేపు విశ్రమించటం రామయ్యకు అలవాటు. ఆ సమయంలో పాదాలు ఒత్తుతూ, వీనుల విందైన సంగీతం పాడటం హనుమకు పరిపాటి. అయితే, త్యాగయ్య రాముని వద్ద చనువు తీసుకొని, ధన్యాసి రాగంలో ఇలా వేడుకోనేవారు.." బంగారు మేటి పాన్పుపై, భామామణి జానకి శృంగారించుకొని చెలువొందగా, నిన్నుగని పొంగుచు, మల్లెవిరుల పూజించు వేళ, సంగీతము పాడుమని రామాభిరామ! మనసు రంజిల్ల పల్కరాదా!" శ్రీరాముడు, త్యాగయ్య నిష్కలంక భక్తికి కరగి, చిరునవ్వు నవ్వి,'పాడుమని' ఆనతిచ్చేవారు.

త్యాగయ్య ఆనందానికి అవధులు లేక, 'బిలహరి' అయిన శ్రీరాముని, బంగారు ఊయలలో పరుండబెట్టి, ఊపుతూ "రామబ్రహ్మ తనయుడౌ త్యాగరాజు తా పాడుచు నూచగా.. దొరకునా! ఇటువంటి సేవ!" అంటూ కనులవెంట ఆనందాశ్రువులు నిండగా, తనువు మరచి పాడుకొనేవారు.. తన భార్య, శిష్యులందరితో కలసి, ప్రొద్దుపోయే వరకు ఎన్నో కృతులు, దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు రామస్వామి సముఖాన గానం చేసేవారు. శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలు, రామ భజనలు, రామాయణ పారాయణాలు.. రామ మంత్ర అనుష్ఠానాలు... ఒకటేమిటి? రాత్రి కాగానే, పవళింపు సేవలు వరుసగా చేసేవారు... 'లాలి లాలియని యూచేరా!' (హరికాంభోజి) 'లాలి గుణశాలి!' (కేదారగౌళ) 'రామ! శ్రీరామ లాలి (శంకరాభరణం) 'శ్రీరామ! రామ రామ (నీలాంబరి) 'రామరామ రామ లాలి'(శహన) 'జోజో జోరామ'(రీతిగౌళ) 'లాలి యూగవే' (నీలాంబరి)... అప్పటికి శ్రీరాముడు నిద్రలోకి జారుకొనేవారు.. చివరిగా.. 'సురటి' విసరుతూ..." అతి మృదుతర సత్యభాషణునికి, అఖిలాండ నాథునికి, సీతాపతికి హారతీరే.." అంటూ ముత్యాల హారతులు సమర్పించేవారు. ఈవిధంగా తన సేవలో అనుక్షణం గడిపే త్యాగయ్య అనుపమాన భక్తికి రాముడు పొంగిపోయి, ఆయన పాటకు ముగ్ధుడై, 'కనులార, కామితంబు తీర' దర్శనం ఇచ్చాడు. "రామభక్తి సామ్రాజ్యానికి మకుటంలేని మహారాజు త్యాగరాజు". త్యాగయ్య కృతులు పాడుకొన్న, విన్న సకల జనావళినీ రామచంద్రమూర్తి కరుణించి, కాపాడుతాడనేది తథ్యం...

**వందే త్యాగరాజ సద్గురుమ్..**

★ ★ ★

# మహా వాగ్గేయకారుడు - "త్యాగరాజు" "ప్రహ్లాదభక్తి విజయం"

**వేమూరి రామలక్ష్మి గారు.**
**9701486050**

కవి, ఉపదేశికుడు, హాస్యచతురుడు, సంగీతనాటక కర్త, వేద పురాణా గమశాస్త్రాధ్యాయన పరుడు, సంస్కృతాంధ్ర భాషా, జ్యోతిష, సంగీత శాస్త్ర పండితుడు, వైణికుడు, గాయకుడు – పరమసాత్త్వికుడు, రామభక్తుడైన త్యాగరాజు – కర్ణాటక సంగీత చరిత్రలో వెలసిన "ధ్రువతార". సంగీత రచనా లోకములో "కృతి" రచనకొక విశిష్టమైన స్థానమునకు దారులు పరచి; రాగాలాపన, స్వర కల్పన, సాహిత్య ప్రస్తారములతో (నెరవు) గాయకుడు నాదలోకమునందు స్వతంత్రముగా విహరించుటకు "మార్గము" చూపిన మహా వాగ్గేయ కారుడు త్యాగరాజు. నిగర్వి, నిరాడంబరుడు, సద్గురువు. ఎంత ఎత్తునకు వెళ్లిననూ వినమ్రుడుగానుండుట, భక్తులు, ప్రాచీనులు, గురువుల యందు పూజ్యభావము – యివి – అవి – అననేల "ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" – యీ ఒక్క వాక్యము చాలును – త్యాగరాజు యొక్క గుణ విశేష వ్యక్తిత్వములను అద్దమునందు చూపుటకు!!!

త్యాగరాజు ప్రహ్లాదభక్తి విజయము, నౌకాచరిత్రము, సీతారామవిజయము అను మూడు సంగీత నాటకములను రచించాడని ప్రతీతి. యిందులో "సీతారామ విజయము" అలభ్యము. నౌకా చరిత్రము "ఏకాంకిక" వంటిది. యిందులో అంకములు లేవు. "ప్రహ్లాద భక్తి విజయము" యక్షగానసరళిలో 5 అంకములు గల నాటకము, ప్రాచీన సంస్కృత సంగీత ప్రబంధములు – "మార్గ" సంప్రదాయమునకు చెందినవి. కర్ణాటక సంగీతావిర్భావముతో ప్రాంతీయ భాషలలో సంగీత రచనలు చేయుట ప్రారంభమైనది. యిది ఒక పరిణామదశ. యక్షగాన ప్రక్రియలో ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్త్వికాభినయములు సమానముగా పోషించబడతాయి. కాని యీ సంగీతనాటకములో ఆహార్యము – అనగా పాత్రోచితమైన వస్త్రాలంకరణకు తావులేదు. యిందలి పాత్రధారులైన గాయకులు – రచనా గానము ద్వారా – ఆ యా పాత్రల వ్యక్తిత్వమును ఆవిష్కరించాలి. రసభావములను వ్యక్తము చేయవలసి వుంటుంది. ఒక దృశ్య ప్రబంధమును – శ్రవ్య ప్రబంధముగా మలచి – ఒక "దేశి" (తెలుగు) ప్రబంధమును – "మార్గ" (సంస్కృతం) ప్రబంధ స్థాయిలో ఆవిష్కరించిన త్యాగరాజు – "ప్రాచీనత – నవీనతలకు" ఒక వారధిగా మార్గదర్శియైన సద్గురువుగా నిలచి సంగీత లోకమునకు పూజనీయుడు – ఆరాధనీయుడు అయినాడు.

ఆంధ్రదేశము నేలిన కొండవీటి రెడ్డి రాజులు, విజయనగర పాలకులు, తంజావూరు నేలిన నాయక రాజులు, మహారాష్ట్రులు యక్షగానములను ప్రోత్సహించేరు. వసంతోత్సవములు, చైత్రోత్సవములు, వైశాఖోత్సవములు, శరన్నవరాత్రులు మొదలైనవి పాలకుల ఆధ్వర్యములో జరిగేవి. పండితులు, నాయకులు, కవులు, నటులు, వీరులు ప్రదర్శనలలో పాల్గొనుటకు రాజానుమతి కోరుట, దాని కనుగుణముగా బహిరంగప్రదేశములు, ఉద్యాన వనములలో ఏర్పాట్లుచేయుట జరిగేవి. నరసార్వభౌములను వేడని త్యాగరాజు తాను రచించిన యీ ప్రహ్లాదభక్తి విజయమను సంగీత నాటక ప్రదర్శనకై శ్రీరామ చంద్ర సార్వభౌముని యనుమతి వేడుకొన్నాడు. కథా ప్రారంభమందు ప్రబంధగ్రంథాను క్రమణిక సాంప్రదాయముగా తన యొక్క – గ్రంథ విషయ పరిచయము చేయుచూ "శ్రీ పురవరమున (తిరువయ్యారు) రామబ్రహ్మ సుతుడను త్యాగరాజును నాటకంబొకటి పాటగా వినుపింతు – జ్ఞానవైరాగ్య విజ్ఞాన. సద్భక్తిగలదియు, రాగ, తాళ, మృదంగ రవళిచేతను – నాగరికంబైన నాటకంబొకటి పాటగా వినిపింతు.... "రాగ, తాళ, మృదంగరవళిచే... నాగరీకంబైన అభినయముచే" యని త్యాగరాజు పలుకుటలో... తనకాలమందున్న సామాన్యజనుల వ్యవహారిక భాషకంటె... నాగరికమైన భాషలో తన రచన వినిపించెదనని చెప్పెను.

## ప్రహ్లాదభక్తి విజయమందలి విషయము :

వేదాంతపరముగా చూచినచో జీవాత్మ – పరమాత్మను చేరుటకు అనునిత్యము తపించుట "సతి–పతి భావన". భాగవతమందు గోపికలు పరమాత్మయైన శ్రీకృష్ణుని కొరకు పరితపించిన విధముగానే, ప్రహ్లాదుడు శ్రీహరి దర్శనమునకై పరితపించినట్లు కనబడిననూ... యిది కేవలము త్యాగరాజు యొక్క మానసిక స్థితికి ప్రతిబింబముగా కనబడుచున్నది. 96 కోట్ల రామనామము జపించి శ్రీరామ సాక్షాత్కారము పొందినా త్యాగరాజు మనస్సు పూరట చెందలేదు. శ్రీ రాముని దర్శన భాగ్యము మళ్ళీ ఎప్పుడు కలుగుతుందో!! కరుణిస్తాడో! లేదో! ఎల్లప్పుడు రాముని చెంతనే వుండే భాగ్యం తనకు లభిస్తుందా? త్యాగరాజు మనస్సు పరిపరివిధములుగా డోలాయమానంగా వుంది. "సరిలేని సీతతో – సరయూ మధ్యంబున నా పరితాపము యాడిన పలుకులు మరచితివో! పది పూటలపై కరుణించెదననుచు "రామా! తిరిగివచ్చి నన్ను నీదరికి చేర్చుకుంటానని చెప్పిన మాటలు మరచినావా"

ప్రహ్లాదభక్తి విజయమందలి రీతిగౌళ రాగములో "నన్ను విడచి కదలకురా! రామయ్యా!" అను కీర్తనలో త్యాగరాజుని యొక్క యీ ఆర్తి స్పష్టముగా కనబడుచున్నది. బహుశా త్యాగరాజు ఈ రచన తరువాతనే "వాగధీశ్వరి" రాగమందు "పరమాత్ముడు వెలిగే" కీర్తననురచించియుండును. యోగసిద్ధి పొందిన వారికి అంత్యదశలో

ముక్తి ఘంటారావము వినబడుతుంది. అదియే 'పరావాక్కు'. అధిదేవత 'సరస్వతి' – వాగధీశ్వరి రాగమందు త్యాగరాజు పరమాత్మను స్మరించుచూ ''పరమాత్ముడు వెలిగే ముచ్చట'' కీర్తనను రచించియుండును. నవవిధభక్తులలో యిది శరణాగతి – ఆత్మార్పణము – త్యాగరాజు రచన.

శ్రీ ప్రహ్లాద భక్తి విజయము ''నవరసభరితం'' (1) కరుణ (2) హాస్యం (3) అద్భుతం (4) రౌద్రం (5) భయానకము (6) భీభత్సము (7) శృంగారము (8) శాంతరసము (9) భక్తి.

**నవవిధ భక్తి :** (1) శ్రవణం (2) కీర్తనం (3) స్మరణం (4) పాదసేవనం (5) అర్చనం (6) వందనం (7) దాస్యం (8) ఆత్మనివేదనం (9) శరణాగతి.

**భక్తి మార్గములు :** ఐదు – (1) శాంతభక్తి (2) సఖ్యభక్తి (3) వాత్సల్యభక్తి (4) దాస్యభక్తి (5) మధురభక్తి.

**యిందలి పాత్రలు – ఔచిత్యము – రసములు :**

కరుణ రస ప్రధానముగానున్న యీ నాటకములో – ''భక్తికే అంతిమ విజయము'' అని సూచనచేస్తూ – ప్రధాన పాత్రధారిగా ''ప్రహ్లాదభక్తి విజయము'' అను పేరు సముచితంగా యున్నవి. సందర్భోచితంగా నవరసములు యిందులో కనబడతాయి. ప్రాచీన మార్గ సంప్రదాయ సంగీత రూపకములలో ప్రారంభమందు రంగస్థలముపై ''శ్రీ గణపతిని'' ఆవిష్కరింపజేసి, ప్రార్థన చేయుట – తదుపరి సూత్రధారి, నటి/నటుడు ప్రవేశించుట జరుగుతుంది. సూత్రధారి కథ వివరములు తెలుపుట ఆచారము. కాని, యీనాటకమందు రాజుయొక్క ప్రధాన ద్వార పాలకుడు / దౌవారికుడు రంగప్రవేశము చేయుట జరిగినది. దౌవారికుని వస్త్రధారణ నీరుకావి ధోవతి గట్టుట, నుదుటిపై తిరునామము ధరించుట యనునవి – యీ కథ విష్ణుభక్తికి సంబంధించినదనియు, ''బాగు మీర నటనము చేయుచు – రాగతాళగతులను పాడుట'', చతుర్విధాభినయముల ద్వారా యీ నాటకము యొక్క వుద్దేశ్యము సూచించబడినది. యిది త్యాగరాజు అనుసరించిన ప్రత్యేక – స్వతంత్రమైన సంప్రదాయము. ప్రహ్లాదుని చరిత్రకు భాగవతమందలి నృసింహావతారము – హిరణ్యకశిపుని వధ– ఆ పాత్రలు – ఘట్టములు లేకుండానే త్యాగరాజు యీ కథను నడిపించుట రౌద్ర – భీభత్స– భయానక రసములకు ప్రాధాన్యత యియ్యకుండా – భక్తి రస ప్రధానముగా – సాత్త్వికాభినయమునే చూపుట యిందలి ప్రత్యేకత. ప్రాచీన సంగీత రూపకములకు నూతన సొబగులద్దిన త్యాగరాజు స్వతంత్ర భావములగల కవి – వాగ్గేయకారుడు. ప్రాచీన సంప్రదాయమైన రంగపూజ, గణపతిని ఆవిష్కరించుటకు మారుగా శుభప్రదమైన సౌరాష్ట్రరాగములో ''శ్రీ గణపతిని సేవింపరారే'' యను కీర్తనతో స్తుతి చేయుచు ''వివిధ గతుల ధిత్తళాంగుమని'' నాట్యగణపతి – ఘల్లు ఘల్లుమను గజ్జెల రవళులతో ఆనందనర్తనము చేయు ప్రవేశములు – ఈ రచన సంగీత నాట్యములకు

సంబంధించినదిగా త్యాగరాజు సూచన చేయుట ''ఒక చమత్కారము''.

యీ కృతి సతియైన శ్రీరామచంద్రుడు సూర్యవంశ తిలకుడు. ప్రాచీన రాగమైన 'సౌరాష్ట్ర' – సౌరాష్ట్రాధిపతి సూర్యుడు. శుభప్రదమైన సౌరాష్ట్రరాగమందు ప్రారంభించబడినది.

యక్షగానములు రాత్రి మొదటి ఝాములో ప్రారంభించి సూర్యోదయమువరకు చేయుట – కర్మసాక్షియైన సూర్యుని ఆహ్వానించుట అనాది సంప్రదాయము. అదే పద్ధతిని అనుసరించిన త్యాగరాజు – యీ నాటకము చివరలో లక్ష్మీనారాయణులు ప్రత్యక్ష మగుట, యీ అద్భుత దృశ్యమును చూచుటకు సూర్య చంద్రులు, బ్రహ్మాది దేవతలు వేంచేయుట, శుభప్రదమైన సూర్యరాగము – సౌరాష్ట్రయందే మంగళనీరాజనము యిచ్చుట త్యాగరాజు యొక్క సందర్భోచిత భావనా చాతుర్యము కవితాచాతుర్యము వెల్లడి చేయుచున్నవి.

ప్రాచీన సంగీత రూపకములపై నిర్మించబడిన –నవీనయుగపు సంగీతరూపకముగా రెండు యుగములకు వారధిగా త్యాగరాజు రచించిన యీ ''ప్రహ్లాద భక్తి విజయము'' కర్ణాటక సంగీత రచనలలో ''పచ్చల పతకము''

## ప్రహ్లాదభక్తి విజయము :

### మొదటి అంకము :

యిందలి పాత్రలు ప్రహ్లాదుడు, సాగరుడు, వైనతేయుడు.

**కథ :** ప్రహ్లాదుడు శ్రీహరిని ధ్యానించుట మానకపోవుట చేత హిరణ్యకశిపుడు ఆ బాలుని నాగపాశములచేత బంధించి, సముద్రములో పడవేయించినాడు. హరిభక్తుడైన సాగరుడతనిని రక్షించి భేరీ వాద్యములు, వారకాంతామణుల నృత్యగానములతో, రాజలాంఛనములతో ప్రహ్లాదుని దివ్యమందిరములోనికి తీసికొనిపోయి, నాగులకు విరోధియైన వినతాసుతుని ప్రార్థించగా వైనతేయుడు నాగపాశవిముక్తుని చేసి తన తాపము చల్లార్చుకొనుటకు **కృష్ణా! కృష్ణా!** అనుచు వెడలి పోవును

1. కీర్తన : సాగరుండువెడలె యమునాకల్యాణి రాగం – ప్రశాంత, గంభీరమైనది – శాంత, భక్తిరసములు

2. కీర్తన : వినతాసుతరారా – హుసేని రాగం – వేడుకోలు – భక్తిరసము

3. ద్విపద : కనకాద్రి ధరలోన.... – నాగులను చంపుట – భీభత్స, రౌద్ర రసము, భయానక

4. కీర్తన : వారధినీకు – తోడిరాగం – వందనములు చేయుట – శాంత, భక్తి రసములు

5. కీర్తన : వచ్చును హరి–నిన్ను జూచును – కల్యాణిరాగం – ప్రహ్లాదుని, ఓదార్చుట – కోమలమైనరాగం నవవిధ భక్తితత్త్వములలో యిది ''స్మరణం''

### రెండవ అంకము

**కథ :** సాగరుని మాటలతో వూరడిల్లిన ప్రహ్లాదుడు ''శ్రీభక్తహృత్తాప'' అనుచు ఏకాగ్రతతో దండకముతో శ్రీహరిని ధ్యానించును. ఉద్వేగము (కీర్తనం)

కీర్తన : వందనము రఘునందనా – శహనరాగం – కరుణ, భక్తి, శాంతరసములు, హాస్యం (దెప్పుట) (వందనం)

ద్విపద : ముజ్జగంబులకాదిమూలమై... వేడుకొనుట ... భక్తి రసము

కీర్తన : ఎట్లుకనుగొందునో... ఘంటారాగం... ఆర్తి

కీర్తన : ఇందుకాయీ తనువు ... పున్నాగవరాళి... నిర్వేదన... భక్తి, కరుణ, శాంతరసములు ప్రదర్శింపబడినవి

**మూడవ రంగము లో అంతర్నాటకము**

నారదుడు ప్రహ్లాదుని ఆర్తిని గ్రహించినవాడై శిష్యవాత్సల్యముతో సనక, సనందనులకు శ్రీహరి త్వరలోనే ప్రహ్లాదునకు దర్శనమిచ్చునని తెలిపెను. యింతలో ప్రహ్లాదునకు వీణా నాదము వినబడగా నారదుడు వచ్చుచున్నాడని గ్రహించి తన ఎదుటకు వచ్చి, కనబడవలెనని అట్లు లేనిచో యిది 'నాభ్రమ' యని తలచెదనని నిష్ఠురముగా పలికెను.

కీర్తన : నిజమైతే నిలువుము – భైరవిరాగం – విభ్రాంతి, భక్తిరసము (శ్రవణం)

కీర్తన : నారదముని వెడలిన – పంతువరాళి రాగం

**నారదుడు ప్రవేశము**

చూర్ణిక : జయతుజయతు సకలనిగమాగమ

కీర్తన : ఇపుడైన నసుదలచినారా స్వామి – ఆరభిరాగం – భక్తిగౌరవములు

కీర్తన : ఎన్నగమనసు – నీలాంబరి – శ్రావ్యమైన, అందమైనరాగం... సంతోషము... అర్చన

కీర్తన : ఏటిజన్మమిదిహా! ఓ రామ! వరాళిరాగం – కరుణరసము – పరివేదన / నిర్వేదము – మూర్ఛపోవుట

కీర్తన : ఎంతనుచు వర్ణింతు – సౌరాష్ట రాగము – మూర్ఛనుండిలేచుట – శ్రీహరిదర్శనము – అద్భుతరసము కోర్కెలు తీరుట

తెరవెనుక గాయకులు పాడుచుండుట

కీర్తన : ఏనాటి నోముఫలము – ప్రహ్లాదుడు శ్రీహరి పాదములను పట్టుకొనుట (పాదసేవనం)

**నాలుగవరంగము**

కీర్తన : నన్నుబ్రోవకను – విడువనురా రామ – శంకరాభరణరాగము

కాసునువెదుకగ – గన్న రత్నమురీతి ..../ అంబలి దినువేళ అమృతమిచ్చినట్లు..

ఆడబోయిన తీర్థమెదురైన రీతి... విస్మయము / ఆశ్చర్యము

కీర్తన : అడుగు వరములనిచ్చేను ... ఆరభిరాగం

కీర్తన : వారిజనయన నీవాడనునేను... కేదారగౌళరాగం...భక్తిరసం... నిర్మోహత్వము

కీర్తన : ఓ రామ / రామ/ సర్వోన్నత!... నాగగాంధారి రాగం.... ఎడబాటు

కీర్తన : వద్దనుండేదే బహుమేలు వారిజాక్ష! వరాళి రాగం... వియోగము

కీర్తన : దయరానీ దయరానీ దాశరథీ రామ! మోహనరాగం... సాత్త్విక భక్తి, వేడుకొనుట, పులకరింత, ఆనందభాష్పములు, కౌగిలి.

ద్విపద : సారెసారెకు... పంకజములకెల్ల భాను చందమున...

కలువలకిందుచందమున... మగువకు మగనిచందమున.... దీనజనులకు దేవదేవ... వలచుచునే నొక్కవరమడిగెదనయ్య.

కీర్తన : తీరునా! నాలోనిదుగ్ధ / సావేరి / పాలన్నముభుజియింపబెట్టి.... నైవేద్యం

తమ్మపుటికెను బట్టితానెపుడు నిలువకను... (దాస్యం)... పాదాబ్జములనొత్తుట...

...సురటివిసరి (వీవనవీచుట).... పాడుచును... కీర్తనం...

.... నీ పాదసారసమును హృదయారవిందమున బెట్టి కట్టుకోక... షోడశోపచారములు

కీర్తన : దయసేయవయ్య.... యదుకుల కాంభోజిరాగం.... సందిగ్ధత... శంక

.... శ్రీ సాకేతపతి రాడేయన... వచ్చును...

.... నాధుడురాలేదని... మ్రొక్కుకోబోవువేళ... ఎదురైన సుఖము. ఆనందం –

...విల్లు వంచునో! లేదో!.... మేనుకంపించుట

కందము : తల్లినిగను పుత్రునివలె – ఉల్లంబానందమంది

**ఐదవ అంకము:**

కీర్తన : ఆనందమానందమాయెను ... భైరవిరాగం... బ్రహ్మానందం, నిత్యానందం

సదానందం...నీయందముకని సొక్కితి.... అమలిన శృంగారం

ఎడబాయని ప్రేమ... చేత చిక్కితి... ప్రాయములెల్ల నీ పాలు చేసి మ్రొక్కితి... శరణాగతి భాగవతభక్తి

కీర్తన : నన్ను విడచి కదలకురా... రీతిగౌళరాగం... విప్రలంభము / వియోగము

... బాగుగ నన్నేలుకోరా అల్ల – త్యాగరాజనుత తనువునీదేరా

... అందుండక నీవేగవచ్చెదనని నాపై ఆనవెట్టిపోరా ... పంతువరాళిరాగం

.... కన్నీరు కాల్వలగుట, యిల్లు వాకిలగుట, నిమిషము యుగమౌట... నిరీక్షణ

శ్రీహరి ప్రహ్లాదుని యందెంతో ఆదరము చూపెను. తిరిగి వత్తునని తనపై ఆనపెట్టి / ఒట్టు పెట్టుకుని ప్రహ్లాదుడుకోరగా శ్రీహరి అట్లేయని చెప్పి అంతర్హితుడయ్యెను.

కీర్తన : ఏమని వేగింతునే... హుసేని రాగం.... వియోగము.

కీర్తన : ఎంతపాపినైతి.... తాళలేకపోవుట ... ఆత్మనివేదన.

కీర్తన : చెలిమిని జలజాక్షుగంటే చెప్పరయ్యా... గోపికా భక్తి... వెదకుట... నాయికా భావము.

శ్రీహరి సీతారాముల రూపమున ప్రత్యక్షమగుట

పరమేశ్వరుడొక్కడే పురుషుడు, ప్రకృతి స్వరూపమంతయు / భక్తులందరు తమయందు స్త్రీత్వము నాపాదించుకొని – శృంగారరూపునిగా భగవంతుని ఆరాధింతురు.

నాయికా – నాయక / గోపికాభక్తి

కీర్తన : రారమాయింటిదాకా – అసావేరి – సీతారాములు ప్రత్యక్షమగుట (శరణాగతి)

**త్యాగరాజు – సంగీతనాటకము పరిసమాప్తి :**

సూర్యోదయము : కమలభవుడు వెడలె – కల్యాణిరాగం

వాణి బ్రహ్మలు, ఇంద్రుడు, దేవతలు, నేత్రోత్సవము జూడ వచ్చిరి

కీర్తన : వరమైన నేత్రోత్సవముజూడ... బ్రహ్మ – ఇంద్రుడు – చామరములు వీవ,

దేవతలు పుష్ప వాన కురిపించిరి – భాగవతులు హరినామము కీర్తించిరి (అర్చన)

కీర్తన : జయమంగళం / సౌరాష్ట్ర – నీనామరూపముకు నిత్యజయమంగళం

ఆం.వా.చ/వి.1/పి.53/ బా.ర.రా/

**కందార్ధము :** సంస్కృతంలోని ''ఆర్యా'' ఛందస్సుతో నడిచే ప్రబంధము ఆర్యా ఛందస్సులోని చివరి పాదంలో చివర 'గురువు' నొకదానిని చేరిస్తే 'కందపద్యం' అవుతుంది. ''కందప్రబంధం'' నుండే కంద పద్యం పుట్టివుంటుంది. యిది వీర రసోచితం. మనయక్షగానాలలో ప్రసిద్ధమైన 'కందార్థం' అనే గేయరచన – కందప్రబంధపు తరువాతి పరిణామమే! కందార్ధంలో తాళరహితంగా ''కందము''గానము చేసి చివరి పాదమును తాళయుక్తంగా కీర్తనలాగ ఆపాదాన్ని పల్లవిగా చేసుకొని – ''తధిగిణతోం'' యిత్యాది శబ్దాలతో సహా పాడతారు.

**నోట్ :** ఆంధ్ర యక్షగానములలో కందార్ధాలు లాగానే వృత్తార్థాలు, సీసార్థాలు కూడా అక్కడక్కడ వున్నాయి. త్యాగరాజు రచించిన ప్రహ్లాదభక్తి విజయమను సంగీత నాటకమందు 69 కీర్తనలు, 12 కందపద్యములు, 3 సీస, 1 తేటగీతి, 2 వుత్పలమాలలు, శ్లోకములు, 1. దండకము, 1. చూర్ణిక, 4 ద్విపదలున్నాయి. కథ భాగవతకథ = మూలము – గనుక – యిందుకొన్ని 'దేశి' పద్ధతులున్నప్పటికిని – శాస్త్రీయ సంగీత రచనలుండుటచేత నాటి మార్గ 'యక్షగానము' యొక్క పరిణామమే నేటి 'సంగీత నాటకము'. నేడు ప్రాచీనయక్షగాన సంప్రదాయము తెలియగోరువారికి యిది చక్కని వుదాహరణ కాగలదు.

★ ★ ★

# "మూలాధారజ నాద మెరుగుట ముదమగు మోక్షమురా"

- శ్రీ కె. వి. ఎస్. ఎమ్. గిర్మాజీ రావు

కర్ణాటక సంగీత పద్ధతిలో గానము చేయ బడుతూన్న కృతులలో సద్గురు శ్రీ త్యాగరాజస్వామి రచించిన "స్వరరాగ సుధారసయుత భక్తి–స్వర్గాపవర్గమురా; ఓ మనస" అనెడి కృతి అన్ని విధములా అగ్రస్థానమును వహించిన కృతులలో ఒకటి. అది శంకరాభరణము రాగములో ఆది తాళములలో రచింపబడింది. ఆ కృతి యొక్క మొదటి చరణమునందు "మూలాధారజ నాద మెరుగుట – ముదమగు మోక్షమురా" అని చెప్పబడింది.

మరల మరల పుట్టడము, మరణించడము అనేవి లేకుండ శాశ్వత ఆనందకరమైన విష్ణులోక ప్రాప్తి, అనగా, పరమపద నివాస ప్రాప్తికే మోక్షమని పేరు.

ఇంక, "మూలాధార" అంటే ఏమి ? మూలాధారము నందుద్భవించిన నాద మెరుగుట అనగా ఏమి? దానిని ఎరిగినందువల్ల అది ఏవిధముగా మోక్షకారణ మౌతుంది? ఆ నాదమెరుగటవలన మోక్షము ప్రాప్తించునని త్యాగరాజు కేవలము స్వానుభవమువలన తెలుసుకొనిన సహేతుకమైన శాస్త్రవిషయమా? లేక, ఏదైనా ప్రాచీన గ్రంధమునందు చెప్పబడిన విషయమా ? ఇత్యాది అనేకసందేహములు కేవలము గాయకులకు మాత్రమే కాక, శ్రోతలకు కూడా కలుగుట సహజం. అందువల్ల, "మూలాధారజ నాద మెరుగుట ముదమగు మోక్షము" అని చెప్పుటలోగల త్యాగరాజు యొక్క నిజమైన భావము ఏమిటో తెలుసుకొనేందుకు ప్రయత్నించి చూద్దాం.

ముందుగా, శ్రీరామభక్తుడు... వాగ్గేయకారక చక్రవర్తిఅయిన త్యాగరాజస్వామి చక్కని ప్రావీణ్యముగల వైణికుడని, గాయకుడని, సంగీతశాస్త్ర పారంగతుడని, చక్కని ఇంగితజ్ఞాన సంపన్నుడైన కవియని, పండితుడని మనము ముఖ్యముగా గమనించవలసియున్నది.

కృతియొక్క మొదటి చరణపు మొదటి భాగమునందు "నాద మెరుగుట ముదమగుమోక్షము" అని చెప్పబడినందువల్ల నాదమును గురించి ముందుగా మనం కొంచెము తెలుసుకోవలసి ఉంది. అనాహత నాదము, ఆహతనాదము అని నాదము రెండు రకములని, ఆ రెండింటిలో అనాహత నాదము రక్తిహీనమై గానమునకు ఉపయోగపడదని, ఆహత నాదము శ్రుతి, స్వర, రాగ రూపముతో రక్తివంతమై గానమునకు ఉపయోగకరమైనదని మొదలగు రీతుల ప్రాచీన గ్రంధములలో చెప్పబడింది. ఇందువల్ల ఈకృతిలో చెప్పబడిన నాదము ఆహత నాదమా! లేక అనాహత నాదమా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కృతియొక్క పల్లవి "స్వరరాగ సుధారసయుత భక్తి" అని ప్రారంభింపబడింది. స్వరమునకు, రాగమునకు, రక్తికి కారణమైనది ఆహతనాదమని ప్రాచీన గ్రంధములవలన తెలుస్తూన్నందువల్ల త్యాగరాజుస్వామి చెప్పింది ఆహత

నాదమేనని ధ్రువపడుతూంది.

"మూలాధారజ నాద మెరుగట" అనగా, మూలాధార అనే అంగము నుండి పుట్టిన, లేక, కలిగిన నాదమని భావము. మూలాధార అంటే ఏమిటో ఇంక మనం తెలిసికోవలసివుంది. ఆహతనాద పరముగా మూలాధార అంటే రెండు రకములుగా మనం అర్ధంచేసుకోవచ్చు.

వీణకు, తంబురాకు కుడివైపున ఉండే కుండకి వెనుకవైపు పై అంచుకి మధ్యను తంత్రులను కట్టేందుకు వేయబడే బిళ్ళకు, లేక కట్టెముక్కకు మూలాధార అని పేరు. శ్రుతిచేయబడిన వీణ లేక, తంబురా తంతెను మీటి ధ్వనింపచేసినప్పుడు కుండలోగల గాలిలో స్పందనము లేర్పడి ఆస్పందనములవలన కుండకూడా స్పందించుటచేత ఆస్పందనములు మూలాధార ద్వారా తంత్రులకు ప్రవహించుటవలన తంత్రుల ధ్వని బలపడి నాదముగా రూపొందుతుంది. లేదా, తంత్రీవాద్యపు తంత్రులను మీటినప్పుడు మొదట బిగ్గరగా కలిగే ధ్వనిని కూడా మూలాధార అని అర్ధం చెప్పుకోవచ్చు. ఆ మూలాధార అనే ప్రధమధ్వనే ప్రస్తుతం ఆధారషడ్జస్వరం (The Fundamental Or Primary Sound) అని చెప్పబడుతూంది. గాలితోకూడిన తంత్రీవాద్యపు కోలంబకము. (The Body Of The Stringed Musical Instrument) యందలి గాలిలో ఏర్పడిన స్పందనములు కోలంబకము ద్వారా ప్రధమధ్వనికితోడై ఆధ్వనిని బలపరిచినందువలన నాదము ఏర్పడుతూంది.

మూలాధార అనే పదమునకు పైని చెప్పబడిన రెండు అర్ధములలో ఏ అర్ధమునైనా మనం స్వీకరించవచ్చు. ఇంతకీ, మన చర్చనీయాంశము మూలాధారవల్ల ఏర్పడిన నాదం కాని, మూలాధార కాదు. కనుక, నాదము ఏ విధముగా మోక్షదాయకమో ఇంక మనం తెలుసుకోవలసి ఉంది. మానవ శరీరమంతయు అనేకమైన రక్తనాడులతో కూడుకొని ఉంది. ఆ నాడు లన్నియు స్పందించెడి స్వభావమును కలిగియున్నవి. ఒక నిమిషమునకు ఇన్ని చొప్పున క్రమయుతమగు స్పందనములను చేయుచుండును. అందువలననే దేహమునందు రక్తము సరిగా ప్రవహించుచుండును. ఎప్పుడు ఆ నాడులు స్పందించుట మానునో, అప్పుడు ఆదేహమునందు రక్తప్రసారము ఆగిపోవుటవలన, ఆదేహము నిర్జీవమగుచున్నది. కనుక మానవ శరీరమంతయు సజీవముగా ఉండినంత కాలము స్పందన తరుచుతనమును కలిగియుండునని అందరికీ విదితమైన విషయమే.

ఇంక, నాదము స్పందన తరచుతనమువలన ఏర్పడుచున్నది. స్పందన తరచుతనమును కలిగిన ఒక వస్తువు ఇతర స్పందన తరచుతనమును కలిగిన వస్తువుయొక్క స్పందన తరుచుతనముతో ఏకీభవించి, ఒకానొక నిష్పత్తిలో స్పందించును. దీనినే సహాను కంపన (Co-Vibration) అని అందురు. ఒక సునాదమును కలిగిన తంబురాను శుద్ధముగా శ్రుతిచేసి ఆ నాదమును మనము వినినప్పుడు, ఆ నాదము యొక్క స్పందన తరుచుతనముతో మనశరీరమునందలి రక్తనాడులన్నియు ఒకానొక నిష్పత్తిలో స్పందించుచు తంబురా నాదముతో ఏకీభవించును. అందువలన ఆనాదము మనశరీరమునందంతయు నిండినట్లును,

మన పరిసర ప్రాంతమంతయు నాదముతోనిండి ఉండినట్లును మనము అనుభవించుచున్నాము. మన శరీరమునందలి నాడులన్నియు తంబురా నాదము యొక్క స్పందన తరచుతనముతో, ఒకానొక నిష్పత్తితో స్పందించుచు ఆ నాదముతో ఏకీభవించుటవలన మన మనసు ఇతర తలంపులను వదలి సంపూర్ణముగను, శుద్ధముగను ఆ నాదమునందే లగ్నమైయుండును. ఇది సంగీత పండితులకు, సంగీతాభిమానులైన శ్రోతలకు కూడా అనుభవమైన విషయమే.

అటు తరువాత, మోక్షము భగవదుపాసనవలననే కలుగును. భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపము లేదు. ఎవరెవరు ఆయనను ఏయే రూపముగా ఉపాసింతురో ఆయా రూపములతోనే ఆ భక్తులను ఆయన రక్షించును. ఆయన గుణములను, లీలలను, మహిమను, ఆయా అవతారములయందు ఆయన వహించిన రూపములను ఉపాసించుటయే ఆయనను సంపూర్ణముగ ఉపాసించుట – అన్న విషయముకూడా అందరికి తెలిసినదే. ఆయన ఏకకాలము నందు జగత్తంతయునిండి, సర్వజగత్తును తన యందు ఉంచుకొనే గుణము కలవాడు. ఆగుణమునే వ్యాపన శీలత్వము, వాసుదేవత్వము అని అందురు. అందువలననే ఆగుణమును ధ్యానించుచు, ఆగుణమునకు సంబంధించిన వాసుదేవుడను సాంకేతిక నామముతో ఆయనను స్మరించుచున్నాము. నాదమును మనము వినుచున్నప్పుడు, ఏక కాలమునందు మన శరీరమునందంతటను నాదమునిండి, మనము నాదమునందున్నటులనిశ్చలమనసుతోఅనుభవించుటె భగవంతుని అసాధారణగుణములలో శ్రేష్ఠమైన వాటిలో ఒకటైన, మోక్ష ప్రదమైన వ్యాపనశీలత్వమును లేక వాసుదేవత్వమును ఉపాసించుటే యగుచున్నది. కనుక, మొదటి చరణము యొక్క మొదటి భాగము ఆ భావముతోనే "మూలాధారజ నాదమెరుగుట ముదమగు మోక్షము" అని త్యాగరాజస్వామి చెప్పినట్లు వ్యక్తిమౌతూంది. అటుతరువాత, ఆచరణముయొక్క రెండవ భాగమునందు "కోలాహల సప్తస్వర గృహములు గురుతే మోక్షమురా; ఓ మనస" అని చెప్పబడినది. "రా ఓ మనస!" అని చెప్పబడుటవల్ల త్యాగరాజస్వామి, విషయమును, తన మనసుకు తాను బోధించుకొనెడి రీతిలో ప్రపంచమునకు వెల్లడించెనని తెలియుచున్నది. కృతుల సాహిత్యమునందు సాధ్యమైనంత వరకు తక్కువ మాటలను ఉపయోగించెడి స్వభావమును కలిగిన త్యాగరాజస్వామి, చరణముయొక్క రెండు భాగములయందు "మోక్షము" అనే శబ్దం ఉపయోగించినందువలన, ఆచరణము నందలి రెండు భాగములు రెండు ప్రత్యేక భావములతో చెప్పబడినవని గోచరిస్తూంది. అందువలన, చరణముయొక్క రెండవ భాగము యొక్క భావము ఏమిటో కూడా తెలుసుకొనవలసి ఉంది.

"కోలాహల"అంటే,గుంపుగాశబ్దించిన,"సప్తస్వర గృహముల గురుతే అంటే, ఏడు స్వరస్థానములను ఆనమాలు పట్టుటే. "ముదమగు మోక్షము" అంటే, ఆనందముతోకూడిన మోక్షదాయకము అని అర్థము. అనగా, (నాదమునందు) గుంపుగా పలికెడి ఏడు స్వరస్థానములను గమనించుటే ఆనందముతో కూడిన,

మోక్షమార్గమని చరణముయొక్క రెండవ భాగము యొక్క భావము. ఇందువలన, త్యాగరాజస్వామి తన గానకళా సాధన సందర్భమునందు తాను తెలిసికొనిన, ఒకానొక శాస్త్రీయానుగుణమైన విశేషాంశమును వెల్లడించినట్లు గోచరిస్తూంది. ఇంక, ఈవిషయములో ఆ మహనీయుడు పొందిన శాస్త్రీయానుగుణమైన విశేషాంశానుభవము, ఆధునిక శబ్దశాస్త్ర (Acoustic) రీత్యా ఎంతవరకు శాస్త్రానుగుణ్యమో తెలుసుకొని, పిమ్మట అదిఎటుల మోక్షప్రదమో తెలుసుకొనుట లాభదాయకం.

శ్రుతి చేయబడిన వీణ, లేక తంబురా తంతెను మీటినప్పుడు ఆ తంతె అంతయు ఏకఖండముగా స్పందించి నందువల్ల బిగ్గరగా ఒక ధ్వని కలుగుతుంది. ఆదే ప్రథమ ధ్వని అని, ఆధార షడ్జస్వరము. (The Fundamental Or The Primary Note) అని చెప్పబడుతూంది. తదుపరి ఆ తంతె తనంతటతానే రెండు భాగములుగాను, మూడు భాగములు గాను, నాలుగు భాగములుగాను, అయిదు భాగములుగాను, ఆరు భాగములుగాను స్పందించును. ఈ సందర్భములో ఆరోహణ క్రమములో ఒక దానికన్న మరియొకటి హెచ్చుగా కొన్ని సూక్ష్మధ్వనులు ఆధార షడ్జస్వరములో అంతర్గ తముగ, వాటంతటవే జనించి, ఆధార షడ్జస్వరములో లయమగును. అటుల వాటంతటవిగా ఏర్పడిన ధ్వనులకే స్వయంభూధ్వనులని (The Upper Partials Or The Over Tones) పేరు. చరణము యొక్క రెండవ భాగమున చెప్పబడిన "కోలాహల సప్తస్వర గృహముల గురుతే" అనగా, ఆధారషడ్జస్వరమునందు అంతర్గతముగా వాటంతటవే జనించి, వృద్ధిపొంది, ఆధార షడ్జస్వరమునందే లయించెడి స్వయంభూస్వరముల వ్యాపారమును సరిగా గమనించుటేయని భావము. ఇంక, అటుల ఆ స్వరములు వ్యాపారము సరిగా గమనించుట ఎటుల మోక్షదాయకమో తెలిసికొనవలసి ఉంది.

మోక్షదాయకమైన, భగవంతుని లీలలో సృష్టి, స్థితి, లయ వ్యాపార మొకటి. ప్రథమధ్వనియందు గుంపుగా వాటంతటఆవే జనించి, వృద్ధిపొంది ఆ ధ్వనిలోనే లయమయెడి స్వయం భూధ్వనుల వ్యాపారము భగవంతుని సృష్టి, స్థితి లయ లీలగా గమనించి ఉపాసించుటే మోక్షదాయకమని, చరణముయొక్క రెండవ భాగము యొక్క భావమని విశదమగుచున్నది.

కృతియొక్క మొదటి చరణపు మొదటి భాగంలో నాదోపాసనవలన భగవంతుని వ్యాపన శీలత్వమును, రెండవ భాగంలో భగవంతుని సృష్టి, స్థితి, లయ వ్యాపార లీలను ఉపాసించదమగుచున్నందువలన మోక్షము కలుగునని చెప్పబడింది. ఇంక, భగవంతునికి సంబంధించిన ఆ రెండు ప్రత్యేక గుణాలను ఉపాసించడానికి నాదోపాసనే ఎందుకు చెయ్యాలి ? కళ్లు ముక్కు మూసుకొని ఒక నిర్జన ప్రదేశంలో కూర్చుని ఆ రెండు గుణాలను ధ్యానించడం మూలకంగా ఉపాసించవచ్చునుకదా? అనే సందేహాలు ఈ సందర్భంలో కలుగడం సహజమే.

ఆ మాదిరిగా ధ్యానించడం కూడా

మోక్షదాయకమే. దానినే సమాధియోగమని అంటారు. భగవద్గీతలో ఆరవ అధ్యాయమునందు శ్రీకృష్ణపరమాత్మ ఒకటవ శ్లోకం నుండి ముప్పైఆరవ శ్లోకంవరకు ఆ యోగాన్ని ఎట్లా చేయాలో వివరంగా అర్జునుడికి బోధించాడు. అదంతా విన్న తర్వాత అర్జునుడు, మనసు చంచల స్వభావమును కలిగినదైనందువలన స్థిరముగా ఒక సద్విషయమునందు నిలకడగా ఉండదని, అందువల్ల ఆ యోగమునందు మనశ్చాంచల్యము కలిగితే ఆ యోగమును అభ్యసించేవాని గతి ఏమౌతుందని ప్రశ్నించినప్పుడు, శ్రీకృష్ణ పరమాత్మ తనను నమ్మినవానికి ఎప్పటికీ దుర్గతి కలుగదనియు, ఒక జన్మలో ఒకజీవి ఎంతవరకు ఆ యోగాన్ని సాధనచేస్తాడో అంతవరకు ఆ ఫలమును ఆజీవికి స్వర్గమునందనుభవింపజేతుననియు, స్వర్గమునందు ఆజీవి ఆ ఫలము ననుభవించిన తరువాత ఆ యోగాన్ని తిరిగి అభ్యసించుటకు సదుపాయములుగల సద్వంశమునందు ఆజీవిని జనింపజేతుననియు, అటుల అనేక జన్మల పర్యంతము సాధన చేయుటవలన క్రమముగా తగిన వైరాగ్యము, జ్ఞానము ఏ జన్మయందు కలుగునో ఆ జన్మలో సంపూర్ణముగా మనసు నిలుపుట సాధ్యమగుననియు, అందువల్ల ఆజన్మాంతమందు ఆజీవికి మోక్షము ప్రాప్తించుననియు చెప్పియున్నాడు. కనుక సమాధియోగమువల్ల మోక్షమును పొందుటకు బహు జన్మముల పర్యంతము సాధన చేయవలసి ఉందని విశదమౌతూంది, అందువల్లనే పైని చెప్పబడ్డ సందేహాలకు కృతియొక్క రెండవ చరణపు మొదటి భాగంలో త్యాగరాజస్వామి “బహు జన్మలకు పైని జ్ఞానియై వరగుట మోక్షము” అని సమాధానమును చెప్పుట తటస్థించింది. అటు తరువాత ఆ చరణపు రెండవ భాగంలో సహజభక్తితో రాగజ్ఞాన సహితుడు ముక్తుడు” అని, చెప్పినది కూడా గమనింపతగ్గ విషయమే.

“సహజ” అనగా, ప్రయత్నం లేకుండానే దానంతటది ఏర్పడుట. “రక్తితో” అనగా, ఒకానొక సద్విషయమునందు, లేక భగవద్విషయమునందు ప్రీతితో ఆచంచలముగా సదా మనసును లగ్నం చేయుట, “రాగజ్ఞానసహితుడు” అనగా, రాగమును గురించిన జ్ఞానాన్ని కలిగినవాడు. “ముక్తుడు” అనగా, మోక్షమును పొందును, అని అర్థము.

గానం చేసేవారు, వినేవారుకూడా ఒకే సమయంలో ఆలౌకికానందముతో తన్మయత్వ మొందెడి స్వరాల కలయికతో కూడిన అనిబద్ధగానం రాగము.

అలౌకికానందానుభవమును కలుగజేసేది నాదం. నాదం యొక్క హెచ్చుతగ్గులే స్వరాలు. ఆ స్వరాల వివిధ రకముల రక్తియుత కలయికలవలన కలిగెడి అలౌకికానందానుభూతిని, అనగా చెప్పుటకు అలవిగాని రసానుభూతి యొక్క అనంత ప్రభావాన్ని తెలుసుకొనువాడే రాగజ్ఞాన సహితుడనే భావం ఏర్పడుతుంది. అటువంటి రాగజ్ఞానముతో రాగాన్ని గానం చేసేవారు, వినువారుకూడా అని భావం. కనుక, ఆటువంటి జ్ఞానముతో కూడిన గాయకులు శ్రోతలు కూడా మోక్షమును పొందుదురనెడి అర్థము

ఏర్పడుతూంది. ఈచరణముయొక్క మొదటి భాగంలో సమాధియోగంవల్ల బహుజన్మములకు పైని మోక్షము కలుగునని చెప్పబడడం చేత ఈ రెండవ భాగంలో చెప్పబడ్డ, సహజభక్తితో కూడిన రాగజ్ఞాన సహితుడు ఒక జన్మతోనే మోక్షమును పొందుననెడి భావం ఏర్పడుతూంది.

రెండవ చరణపు మొదటి భాగంలో మనసు చంచల స్వభావాన్ని కలిగినదని, అందువల్ల బహుజన్మల పర్యంతం మనసును భగవద్విషయమునందు అచంచలముగా నిలుపుటకు సాధన చేయవలసియున్నదనే భావాన్ని వ్యక్తంచేసి, అదే చరణపు రెండవ భాగమునందు ప్రయత్నంలేకుండానే దానంతటది సదా ప్రీతితో భగవద్విషయమునందు లగ్నమైన మనసుతో, అనగా, "సహజభక్తితో" అని చెప్పడం మనసు విషయంలో మొదటి భాగంలో వెల్లడించిన భావానికి ఆచరణపు రెండవ భాగంలో వెల్లడించిన భావం విరుద్ధంగా గోచరిస్తూందనే సందేహం కలుగడానికి అవకాశం ఉంది. కృతియొక్క ఉపక్రమోప సంహారాలలో, అనగా ఆది మధ్యాన్తములలో కేవలము ఆహతనాదప్రభావాన్ని గురించిన సహేతుకమైన శాస్త్ర విషయాలను వ్యక్తపరచినందువల్ల నాదాన్ని వినేటప్పుడు మనసుకి ఆ నాదం యందు ప్రీతితో లగ్నమయెడి సహజ లక్షణం కలదని, అందువల్లనే "సహజభక్తితో" అని చెప్పుటకు కారణమైయుండవచ్చునని గోచరిస్తూంది. అసలు, ఈ రెండవ చరణపు రెండవ భాగంలో చెప్పబడ్డ భావం బహుశా, త్యాగరాజస్వామి తన అనుభవంవల్ల తెలిసికొనిన విషయమైయుండవచ్చునని గోచరిస్తూంది. ఇందువలన మనసు నాదమునందు ప్రీతితో లగ్నమగుట నాదంయొక్క ప్రభావమువలననే అని వ్యక్తమౌతూంది.

మానవుడు శ్రవణేంద్రియం ద్వారా నాదాన్ని గ్రహిస్తాడు. (1) బాహ్యకర్ణము (2) మధ్యకర్ణము, లేక, భేరీ కుహరము (3) అంతఃకర్ణము అని చెవి మూడు భాగాలు. బాహ్యకర్ణము ధ్వని తరంగాలను కర్ణ భేరీ (The Tympanum) అనబడే బిగింపబడిన పొరపైకి పోగుచేస్తుంది. కర్ణ భేరి అనేది బాహ్య కర్ణమును మధ్య కర్ణమునుండి వేరుచేస్తూంది. మధ్యకర్ణము ఒక ఆస్థికుహరం (Bony Cavity). ఇది అనేక ఎముకలతో కూడి ఉంటుంది. వాటిలో (1) సుత్తి ఎముక (The hammer bone) (2) దాగలి ఎముక (The anivil bone) (3) రికాబు ఎముక (The stirrup bone) అనబడే మూడు యెముకలు ముఖ్యమైనవి. ఈ మూడు యెముకలు ఒక గొలుసులాగ ఒక దాని నొకటి అనుసరించి ఉంటాయి. ఈ గొలుసుయొక్క మొదటి యెముక కర్ణభేరిని ఆనుకొని ఉంటుంది. లోపలి యెముక అంతఃకర్ణమును ఆనుకొని ఉంటుంది. మధ్య కర్ణానికి చివర అండాకృతి గవాక్షి (The oval window) అనబడెడి రంధ్రం పల్చని పొరతో బిగువుగా మూయబడి ఉంటుంది. ఇది అన్తఃకర్ణమును మధ్యకర్ణము నుండి వేరుచేస్తూంది. అంతఃకర్ణము (The labyrinth) ఒక అస్థికుహరం. ఇది ఒక విధమైన ద్రవంతో కూడుకొని ఉంటుంది. ఇది (1) కుహరిక (The vestibule) (2) మూడు అర్ధ వృత్తములుగు ఉండే గొట్టాలు (3) కర్ణావృత్తి (The cochlea) అనే మూడు భాగాలతో కూడుకొని

ఉంటుంది. నాదగవాక్షి (Sound window) అనే గవాక్షి మరియొకటి దీనికి ఉంటుంది. శ్రవణనాడి (The auditory nerve) ఒక చివర మెదడు (The brain) తో కలుస్తూ, రెండవ చివర పీచు మాదిరిగా ఉండే అతి సూక్ష్మ నాడులతో కూడుకొని ఉంటుంది. ఈ అతి సూక్ష్మ నాడులే పాశ్చాత్య భాషలో "కొర్టిస్ ఫైబర్స్" (Cortis fibers) అని అనబడుతున్నాయి. ఆయా శరీర ప్రకృతిని బట్టి, వారి వారి అదృష్టమునుబట్టి ఈ అతి సూక్ష్మ నాడులు 3000 మొదలుకొని 8000 వరకు ఉంటాయి. ఈ అతిసూక్ష్మ నాడులలో ఒక్కొక్క నాడి ఒక్కొక్క అమిశ్రితధ్వని (Simple note) కి భగవంతుని చేత శ్రుతి చేయబడి ఉంటాయి. ఇందువల్ల వీటిని శ్రుతి నాడులని కూడ చెప్పవచ్చును.

రికాబు యెముక (The stirrup bone) మరియు అంతఃకర్ణపు ద్రవము (The labyrin-thine liquid) వలన ధ్వని తరంగాలు శ్రుతి నాడులకి చేరినప్పుడు, ఆ ధ్వనియందు ఎన్ని అమిశ్రిత ధ్వనులు (Simple tones) ఉన్నాయో అన్ని శ్రుతినాడులు, ఒక్కొక్క ధ్వని కొక్కొక్క నాడి చొప్పున స్పందించును. మిశ్రమ ధ్వని (Complex note) అనగా స్వరం, సంకీర్ణధ్వని (Compound note) అనగా కొన్ని స్వరాల కలయకవలన ఏర్పడిన నాదం కలిగినప్పుడు ఆధ్వనులయందు ఎన్నెన్ని అమిశ్రిత ధ్వనులు ఉన్నాయో అన్ని నాడులు మాత్రమే సమశ్రుతిలో స్పందించి ఆయా ధ్వనులను విభజించి విమర్శిస్తాయి. ఇందు వల్లనే నాదమునందు అంతర్గతముగా, వాటంతటవిగా ఏర్పడే స్వయం భూధ్వనుల వ్యాపారమును మనం గుర్తించకలుగుతున్నాం. ఈరీతిగా శ్రవణనాడి ద్వారా నాదం మెదడుకి చేరుతూంది. మెదడు కూడా స్పందన తరచుతనమును చేసే స్వభావాన్నే కలిగినదైనందువల్ల ఆ నాదాన్ని అనుభవిస్తుంది. ఎప్పుడైతే మెదడు నాదాన్ని అనుభవిస్తుందో అప్పుడే మెదడు నుండి ఇతర తలంపులన్నియు వదలిపోతాయి. అందువల్ల మెదడు విశ్రాంతి అనే సుఖాన్ని అనుభవిస్తుంది. నీరు పల్లానికి ప్రవహించే సహజ గుణాన్ని కలిగినట్లే, మనసుకు సుఖమువైపు మ్రొగ్గుట సహజగుణం. అందువల్ల మనసు సహజమగు ప్రీతితో నాదానుభవమునందు అవిలంబముగా లగ్నమై ఉంటుంది. ఈ శాస్త్ర విషయానుభవము వలననే మహనీయుడగు త్యాగరాజస్వామి మనోవీధినుండి అప్రయత్నంగాను, ఆసుధారగాను "సహజభక్తితో రాగజ్ఞాన సహితుడు ముక్తుడు" అనే వాక్యము వచ్చుటకు కారణమని గోచరిస్తూంది.

కృతియొక్క మొదటి రెండు చరణములవలన, సమాధి యోగంవల్ల మోక్షమును పొందుటకు అనేక జన్మల పర్యంతం ఆయోగాన్ని సాధన చేయవలసి ఉన్నదని, నాదోపాసన వలన, రాగజ్ఞానమువలన ఒక జన్మతోనే మోక్షమును సులభముగ పొందవచ్చుననే విషయాలు వ్యక్తమైనాయి. అనగా అనిబద్ధగానం వల్ల మోక్షమును సులభంగా పొందవచ్చుననే భావం వ్యక్తమైంది. అయితే, నిబద్ధగానంవల్ల అనగా లయ, సాహిత్యములతో కూడిన గానంవల్ల మోక్షం కలుగునా? కలుగదా? అనే సందేహం సహజంగా ఏర్పడుతూంది. కృతియొక్క అనుపల్లవి "పరమానందమను

కమలముపై ఒక భేకము చెలగేమి? " అని చెప్పబడింది.

కమలము, బకము, భేకము నీటికి సంబంధించినవే. "స్వరరాగ" అని పల్లవి ప్రారంభింపబడింది. స్వరము, రాగము అనేవి ఆహత నాదానికి సంబంధించినవే అయినందువల్ల నాదం అనే కొలనులో పరమానందం అనే కమలము అనే భావం ఏర్పడుతుంది. బకము, భేకము. అంటే జలమునందు పలుకునవని అర్థం. అనగా కొంగ, కప్ప అని అర్థం. ఇందువల్ల, పరమానందం ఉద్భవించే నాదంపై కొంగ, కప్ప **అ**ర్పులు ఏమిటి ? అనే భావం ఏర్పడుతుంది. కనుక, పరమానందం అనగా అలౌకిక ఆనందాన్ని ఉద్భవింపచేసే నాదం కొంగ, కప్ప అర్పులవల్ల కలుషిత మౌతుందనే ధ్వని గోచరిస్తూంది.

కొంగ, కప్ప నీటియందు ఒకానొక కోరికతో అరుస్తాయి. కొంగ, కప్ప అర్పులు కూడా నాదానికి ఎట్లా సంబంధించిన ధ్వనులో, అట్లాగే అచ్చులు, హల్లులు మొదలైన వర్ణాలతో కూడిన సాహిత్యంకూడా నాదానికి సంబంధించిన ధ్వనులే. కనుక కోరికతో సంబంధించిన సాహిత్యం పరమానందాన్ని కలిగించే గానమునందు చెలగడమేమి? అనే భావం గోచరిస్తూంది. ఇందువల్ల, కోరికలతో కూడిన, అనగా– కామ, భోగ, మోహ, లోభ, మద, మాత్సర్యాలను ప్రకోపింపచేసే సాహిత్యం పరమానందాన్ని కలిగించే గానమునందు చెలగినందువల్ల ఆ గానము కూడా కలుషితమై ప్రాపంచిక విషయ లోలత్వాన్ని ప్రకోపింపచేసే గానంగా రూపొందునని, అందువల్ల గానం వల్ల కలుగవలసిన సత్ప్రయోజనం ఎట్లా కలుగుతుంది ? అనే ప్రశ్నార్థకభావం ఏర్పడుతూంది. అనగా అటువంటి గానంవల్ల సత్ప్రయోజనం కలుగదని భావం. కనుక, అలౌకికానందాన్ని కలుగచేసే గానంతో ప్రాపంచక విషయ లోలత్వమును ప్రకోపింపజేసే సాహిత్యం చెలగడమేమి ? అనే ప్రశ్నార్థక భావం అనుపల్లవిలో గోచరిస్తూంది. ఇందువల్ల స్వతఃగానం అలౌకికానంద దాయకమైనదని, ఆ గానమునందు అలౌకికానంద దాయకమైన సాహిత్యమే చేర్పబడవలయునని, లేని యెడల ఆ గానం సత్ప్రయోజనకారి అవదనెడిభావం అను పల్లవివల్ల ఏర్పడుతూంది.

అటు తరువాత, మూడవ చరణపు మొదటి భాగంలో "మద్దల తాళగతులు తెలియకయే మర్దించుట సుఖమా" అని ప్రశ్నార్థకంగా చెప్పబడింది. అనగా, మృదంగ తాళగతులను తెలియకుండ మద్దించుట, అనగా భజించుట సుఖముగాదు అనే అర్థాన్ని ధ్వనింపచేస్తూంది.

భజన అంటే భగవన్నామములను మృదంగము, తాళము మొదలైన వాద్యాలను అనుసరిస్తూ విలంబ, మధ్య, ద్రుత లయలలో గానము చేయుట. మనసును ఆకర్షించడంలో నాదానికి ఎంతశక్తి ఉందో అంతశక్తి లయకుకూడా ఉంది. ఏ విషయము లయతో గానం చేయబడుతుందో ఆ విషయమునందు మనసుని సంపూర్ణంగా లయింపచేసేశక్తి లయకు ఉంది కనుక, భగవన్నామములను లయయుక్తంగా గానం చేసేటప్పుడు మనసు సంపూర్ణంగా భగవద్విషయమునందు లగ్నమౌతుంది. అందువలన లయయుక్తమైన భగవన్నామ భజన వలనకూడా

మోక్ష సౌఖ్యము ప్రాప్తిస్తుంది. అటులకాకుండా నోటితో భగవన్నామములను లయరహితంగా భజించేటప్పుడు మనసు మరియొక విషయము పైకి మరలుతుంది. భగవద్విషయముపై మనసు నిలవకుండ ఎంత నామ భజన చేసినను మోక్ష సౌఖ్యమబ్బదు. కనుక, భజన గానంవల్ల మోక్షసౌఖ్యం చేకూరాలంటే మనసు కూడ సంపూర్ణంగా భగవద్విషయమందు లగ్నమైతీరాలి. అటుల మనసు సంపూర్ణంగా భగవద్విషయముపై లగ్నమవడానికి మృదంగ, తాళాది వాద్యాల లయను సరిగా అనుసరించి విలంబ, మధ్య, ద్రుత లయలలో భగవన్నామములను గానం చెయ్యాలనే భావం మూడవ చరణపు మొదటి భాగంవల్ల గోచరిస్తుంది.

ఈ మూడవ చరణంయొక్క రెండో భాగంలో "శుద్ధ మనసు లేక పూజ చేయుట సూకరవృత్తి" అని చెప్పబడింది.

మానవుడు అనుదినము మనసుచేత, వాక్కుచేత, శరీరముచేత ఏయే కర్మలు చేయునో ఆయా కర్మఫలమును తాను అపేక్షింపక, సర్వకర్మలకు ప్రేరేపకుడు, సర్వ కర్మలకు కర్త భగవంతుడే యని మనసునందు నమ్మి, ఆయా కర్మఫలములను మనస్ఫూర్తిగా భగవంతునికి, శ్రీకృష్ణార్పణమస్తు అని అర్పించడమే శుద్ధమనసుతో పూజ చేయిడం. ఆటులగాక ఆ ఫలములను తాను అపేక్షించి చేయడం సూకరవృత్తియని చెప్పబడింది.

"సూకరము" అనేది సంస్కృత పదం. అడవి పందికి, ఊర పందికి సూకరమని పేరు. "సూకర" అనే శబ్దానికి అమరకోశంలో "అనేకమైన పిల్లల నీనునది" అని, "విష్ఠను తినునది" అని అర్థాలు చెప్పబడ్డాయి. అందువల్ల మానవుడు తాను అనుదినము చేసే కర్మఫలమును భగవంతునికి అర్పించక తాను అభిలషించుట కేవలము పిల్లలను కనడం, తన్మూలముగా సంసార లంపటంలో తగులుకొనడం అవుతుందేగాని, సద్గతికి కారణమవదు. అట్లాగే అనుదినము తాను భుజించునది భక్తితో భగవంతునికి నివేదింపకుండా భుజించుట సూకరవృత్తే అగుతుంది. కాని, సద్గతికి కారణమవదని ఈ మూడవ చరణం యొక్క రెండవ భాగమునకు భావమని గోచరిస్తుంది.

అటుతరువాత, ఆఖరు చరణంలో "రజతగిరీసుడు నగజకు దెల్పు స్వరార్ణవ మర్మములు విజయముగల త్యాగరాజు కెరుకే, విశ్వసించి తెలుసుకో, ఓ మనసా" అని చెప్పబడింది.


రజతగిరీశుడనగా పరమశివుడు; నగజకు దెల్పు అనగా పార్వతికి తెల్పెడి; స్వరార్ణవమర్మములు అనగా అపారమైన స్వరముల రహస్యములు, అనగా సంగీత శాస్త్రం అని అర్థం.

త్యాగరాజస్వామికి నారదులవారు ఒక సంగీత గ్రంథాన్ని ఇచ్చారని, దాని పేరు స్వరార్ణవమని, ఆ గ్రంథంలోని విషయాన్నే త్యాగరాజస్వామి ఈ కృతిలో చెప్పాడని కొంతమంది అభిప్రాయపడుతూన్నట్లు గోచరిస్తుంది.

త్యాగరాజస్వామి నిష్కామ భక్తుడు. ఆయనకు భగవంతుడైన శ్రీరామచంద్రమూర్తే దర్శనమిచ్చినప్పుడు

నారదులవారు ఆయనకు దర్శనమిచ్చి సంగీత గ్రంథాన్ని బహూకరించాడంటే దానికి సంశయించవలసిన పనిలేదు. కాని, త్యాగరాజు తప్ప, ఆయన శిష్యులలోనివారుకాని, తదితరులు గాని ఎవరూ ఆ గ్రంథాన్ని చూచినట్లుగాని, చదివినట్లు గాని ఏ విధమైన సాక్ష్యము ఎక్కడా గోచరించదు. త్యాగరాజస్వామి అనంతరం ఆ గ్రంధం ఆదృశ్యమైపోయిందని, దానిని ఎవరూ చూడలేదని ఆయన చరిత్రలో చెప్పబడుతూంది. నారదులవారిచేత త్యాగరాజస్వామికి ఇయ్యబడిన సంగీత గ్రంథం పేరు స్వరార్ణవమై ఉండవచ్చును. కాని, ఆ గ్రంధంలో శివుడు పార్వతికి సంగీత శాస్త్రం చెప్పినట్లుందని చెప్పడం సరియైన అర్థంగా గోచరించదు. ఆసలు, ఆయన స్వరార్ణవమనేశబ్దం అపారమైన సంగీత శాస్త్రమనేభావంతో చెప్పి ఉండవచ్చునుకదా! అనే అభిప్రాయం కలుగడానికి కూడా ఆస్కారం ఉంది. అందువల్ల స్వరార్ణవమంటే "అపారమైన సంగీత శాస్త్రము" అని అర్థం చెప్పుకొనడంలోనే సుఖముందని గోచరిస్తూంది. 1660 సంవత్సర ప్రాంతంలో "చతుర్దండి ప్రకాశికా" అనే సంగీతలక్షణ గ్రంధం రచింపబడినకొద్దికాలమైన తరువాత "సంగీత సార సంగ్రహము" అనేలక్షణ గ్రంథం తెనుగు భాషలో పద్యరూపంలో రచింపబడింది. అటు తరువాత త్యాగరాజస్వామికి కొంచెం ముందుకాలంలో అనగా 1750 వ సంవత్సరానికి కొంచెం ముందుకాలంలో "సంగ్రహ చూడామణి" అనే సంగీత లక్షణ గ్రంథం సంస్కృత భాషలో తెలుగు లిపిలో రచింపబడింది. జగన్మోహిని రాగంలో త్యాగరాజస్వామి గానంచేసిన "శోభిల్లు సప్తస్వర" అనే కృతిలోని అంశము సంగీతసార సంగ్రహంలో ఒక పద్యమునందు చెప్పబడి ఉన్నందువల్ల, త్యాగరాజస్వామి అనుసరించిన కనకాంగి, రత్నాంగి ఇత్యాది డెబ్బది రెండు మేళ పద్ధతి, ఆయన కృతులను గానంచేసిన రాగాల పేర్లు, వాటి లక్షణాలు కూడా సంగ్రహచూడామణిలో చెప్పబడినందువల్ల, త్యాగరాజస్వామి ఆ రెండు గ్రంథాలను అనుసరించాడనే విషయం గోచరిస్తూంది. ఇంతేకాకుండ, కృతిపల్లవిలో "స్వరరాగ" అని స్వరము, రాగము అనే రెండు విషయాలే చెప్పబడడం, సంగ్రహచూడామణిలో స్వరముల లక్షణాలు, రాగముల లక్షణాలు మాత్రమే చెప్పబడడం కూడా గమనించతగ్గ విషయాలు. అంత మాత్రమే కాకుండ, సంగ్రహచూడామణిలో, స్వరముల గురించి, రాగముల గురించి చెప్పమని గౌరి పరమ శివుని అడిగినట్లు, అందుకు పరమ శివుడు స్వరాలు, రాగాలు మొదలైన వాటికి సంబంధించిన సంగీత శాస్త్రమును చెప్పినట్లు, సంగ్రహ చూడామణి రచింపబడింది. కనుక, త్యాగరాజస్వామి ఆఖరు చరణంలో "రజత గిరీశుడు నగజకు తెల్పు స్వరార్ణవ మర్మములు" అని, సంగ్రహచూడామణి గ్రంథాన్ని ఉద్దేశించే గానం చేసి ఉంటాడని స్పష్టంగా గోచరిస్తూంది. నిష్కామభక్తుడు, సంగీతయోగి అయిన సద్గురు శ్రీ త్యాగరాజస్వామి తన మనసును కారణంగా చేసుకొని గానానికి సంబంధించిన పరతత్వాన్ని సశాస్త్రీయంగాను, హేతువాదయుక్తంగాను లోకానికి బోధిస్తూ గానంచేసిన కృతులలో ఇది ఒకటి.

★ ★ ★



సంగీత శాస్త్ర సాగరం

**కె.వి.ఎస్. ఎం. గిర్మాజీరావు**

(1910 (సుమారుగా)

మరణం : 28-06-1982)

కోఠీ వెంకట సూర్య ముఖ్య ప్రాణ గిర్మాజీరావు కాకినాడ వారు. వీరు మంచి వైలెన్ విద్వాంసులు. పిఠాపుర రాజాస్థాన విద్వాంసులైన తుమరాడ సంగమేశ్వర శాస్త్రి శిష్యులు వీరు. సంగీత శాస్త్రాన్ని ప్రొఫెసర్ పి. సాంబమూర్తి వద్ద అభ్యసించారు. గిర్మాజీరావు అనంతపురం జిల్లాల్లో 'గుత్తి' అనే ఊరిలో మాల్టన్ స్మిత్ మల్టి పర్పస్ పాఠశాలలో సంగీతోపాధ్యాయులుగా పనిచేసారు. ఉద్యోగ విరమణ తరువాత తిరిగి కాకినాడ వచ్చి స్థిరపడ్డారు. వీరు 1982 లో తమ 72 వ ఏట పరమపదించారు. ఆ లెక్కన చూస్తే వీరు సుమారుగా 1910 లో జన్మించి ఉండవచ్చు.

సంగీతంలో వివిధ పరీక్షలకు వెళ్లే విద్యార్థుల కోసం థియరీని 'ఆంధ్ర సంగీత శాస్త్రం' అనే పేరుతో రచించి 1953 లో ప్రచురించారు. ఇది 1960 లో రెండవ ముద్రణకు నోచుకొంది. ఈ గ్రంథంపైన ప్రొ. పి. సాంబమూర్తి, ద్వారం వెంకటస్వామి నాయుడు అభిప్రాయాలు వ్రాసారు.

గిర్మాజీరావు గొప్ప సంగీత శాస్త్రవేత్త. తమ అనుభవం వలన, పరిశోధన వలన గ్రహించిన నూతన విషయాలను కూడా ఈ గ్రంథంలో పొందుపరచారు. ముఖ్యంగా సప్త తాళాలకు ఐదు జాతులు చేర్చితే ఏర్పడే 35 తాళాలకు వీరుకొన్ని నూతన నామాలను ఏర్పరచారు. ఈ పేర్లను బట్టి, కటపయాది ఫార్ములాను ఉపయోగించి ఆతాళంలో లఘువు ఏ జాతికి చెందినదో, ఆతాళంలో ఏఏ అంగాలు ఉన్నాయో, ఆ అంగాలు ఏ క్రమంలో వస్తాయో అతి సులువుగా తెలుసుకోవచ్చు. ఈ పేర్లు వారి మేధస్సుకు ఒక మచ్చుతునక.

ఈ గ్రంథంపైన తమ అభిప్రాయాన్ని వ్రాసిన ద్వారం వెంకటస్వామి నాయుడు 'నాదవిషయాన్ని తెలుగులో వచ్చిన ఏ సంగీత గ్రంథంలోనూ వ్రాయనంత విపులంగా గిర్మాజీరావు వ్రాసారని' ఎంతో ప్రశంసించారు. ఆరుప్రకరణాలతో అలరారే ఈ గ్రంథం సంగీత విద్యార్థులకు ఒక వరం అని చెప్పవచ్చు. ఈ గ్రంథానికి ద్వితీయ భాగం కూడా వ్రాసారు. కానీ అది అముద్రితంగా ఉండిపోవడం శోచనీయం. **– ఏ.యస్. రాజారావు**

# త్యాగరాజును గురించి ఇతరులు చేసిన స్తుతి, వ్రాసిన రచనలు



- డా॥ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

ఒక ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ప్రారంభించబోతూ, లేదూ వేదపాఠాన్ని మొదలుపెట్టబోతూ 'ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయకర్తృభ్యో వంశఋషిభ్యో నమో గురుభ్యః' అంటూ మనకు పూజ్యస్థానీయులైన మన సనాతన హైందవ సంప్రదాయకర్తలకు, మన వంశఋషీశ్వరులకు, మన గురుపరంపరకు సభక్తికంగా నమస్కరించటం మన కనాదికాలం నుండి వస్తున్న ఒక సత్సంప్రదాయం. ఏ రంగానికి చెందినవా రెవరైనాసరే తమకు పూర్వకాలంలో నివసించి ఆ రంగంలో అనితరసాధ్యమైన, విశేషమైన, అభినందనీయమైన కృషిని చేసి రాణించి తమవంటి వారి కాదర్శంగా నిలిచిన మహనీయులకు మనస్ఫూర్తిగా నమస్కరించటం, వారిని స్తుతించటం, వారి ఆశీస్సుల నందుకోవటం శ్రేయోదాయకమైన విషయం. మన కవీశ్వరు లందరూ కావ్యరచన నారంభించబోతూ ఇష్టదేవతాస్తుతినీ, కొన్ని పద్యాల తరువాత పూర్వకవిస్తుతినీ చేయటం, ఆశ్వాసాద్యంతాలలో కృతిపతిని సంబోధిస్తూ పద్యాలను వ్రాయటం కూడా ఇటువంటిదే! దీని నాదర్శంగా తీసుకొనే మన కర్ణాటక శాస్త్రీయసంగీత కళాకారులు, కవులు మొదలైనవారు వాగ్గేయకార శిరోమండనుడైన త్యాగరాజస్వామివారిని భక్తిపురస్సరంగా బహుధా ప్రస్తుతించారు. ఆ విధానాన్ని ఈ వ్యాసంలో లఘువుగా పరామర్శిద్దాం.

త్యాగరాజుకు ప్రధానశిష్యుడైన వాలాజపేట వేంకటరమణ భాగవతార్ (క్రీ.శ.1781–1874) త్యాగరాజు వ్యక్తిత్వంలోని ఆధ్యాత్మికత, కవితామార్దవం, వైరాగ్యం, భక్తి, సాహిత్యం, సంగీతం, రామతత్పరతల నావిష్కరిస్తూ ఒక చక్కని శ్లోకాన్ని చెప్పాడు.

శ్లో॥ వ్యాసో నైగమచర్చయా మృదుగిరా వల్మీకజన్మామునిః
వైరాగ్యే శుక ఏవ భక్తివిషయే ప్రహ్లాద ఏవ స్వయం ।
బ్రహ్మా నారద ఏవచాప్రతిమయో స్సాహిత్య సంగీతయోః
యో రామామృతపాన నిర్జితశివ స్తం త్యాగరాజం భజే ॥

ఈ శ్లోకాన్ని నేను, మా ప్రియమిత్రులు డా॥ చేరెడ్డి మస్తాన్‌రెడ్డిగారు కలిసి ఈ క్రింది పద్యంగా ఆంధ్రీకరించాం!

సీ॥ వ్యాసుఁ డెవ్వఁడు? వేదవాదంబులందున
మృదువాక్య సరణి వాల్మీకి యెవఁడు?
వైరాగ్యమున మునివరుఁడైన శుకుఁ డెవ్వఁ?
డతిభక్తి యుక్తిఁ బ్రహ్లాదుఁ డెవఁడు?

సాహిత్యమునఁ బద్మసంభవుం డెవ్వఁడు?
నారదుం డెవఁడు? గానంబునందు;
శ్రీరామకీర్తనాసార పానము చేత
శీతాంశుధరుని మించినది యెవఁడు?

తే॥ అతని సీతమా రామబ్రహ్మాభిధాన
గర్భకలశ వారాశి రాకాశశాంకు
భవ్య కాకర్ల వంశాబ్జ పద్మహితునిఁ
ద్యాగరాజును భజియింతు మనవరతము.

'సంగీత సాహిత్య కళానిధి' బిరుదాంచితులైన శ్రీమాన్ నల్లాన్‌చక్రవర్తుల కృష్ణమాచార్యులుగారు త్యాగరాజస్వామివారిని ఈ క్రిందివిధంగా ప్రస్తుతించారు.

శ్లో॥ సత్సు వాగ్గేయకారేషు, బహుష్వన్వేషు సాంప్రతం ।
రసభావాది సామగ్ర్యా, త్యాగరాజో విశిష్యతే ॥

నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట వాస్తవ్యులైన శ్రీ వట్టిపల్లి మల్లినాథశర్మగారు త్యాగరాజును స్తుతిస్తూ రథబంధంలో ఇమిడే విధంగా ఒక శ్లోకాన్ని రచించారు.

శ్లో॥ శ్రీనిత్యాయ సదాగమ ప్రజహృదే రామాయచిద్రూపిణే
భూజానీశ్వర మండనాయ సదయ స్మేరాస్యభా భాస్వతే।
మేఘశ్యామల మూర్తయే శ్రితమనోమోహచ్ఛిదే విశ్వపే
నిత్యం తే ప్రణతిం సగాన మిహ తన్ మోనిస్తులౌజస్వతే॥

ఈ శ్లోకంలో రథకేతనం దగ్గర నుండి నిలువుగా క్రిందికి అక్షరాలను చదివినట్లయితే 'శ్రీత్యాగరాజాయ మహతే నమోస్తు' అనే అక్షరాలు కనిపిస్తె. శ్రీ శాస్త్రిగారు త్యాగరాజు రచించిన 'మనసా! మన సామర్థ్య మేమి? విను సాకేతరాజు విశ్వమనే రథము నెక్కి తన సామర్థ్యముచే తానే నడిపించెనే ...' అనే వర్ధని రాగ కీర్తనను దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకాన్ని రచించారు. వారే ఈ శ్లోకంలోని అక్షరాలను ఒక రథచిత్రంలో వ్రాసి ముద్రిం చారు.

బ్రహ్మశ్రీ లంకా సీతారామశాస్త్రిగారు 'శ్రీత్యాగరాజచరితామృతమ్' అనే తమ కావ్యంలో–

శ్లో॥ కావేరీతీర వాసాయ, కారుణ్యామృత వర్షిణే।
సంగీతాంబుధి చంద్రాయ, త్యాగరాజాయ మంగళమ్॥

అంటూ త్యాగరాజుకు మంగళాశాసనం చేశారు.

'అభినవజయదేవ' బిరుదాంచితులైన శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రిగారు తమ 'త్యాగరాజు' కావ్యంలో–

శ్లో॥ నాదబ్రహ్మ స్వరూపాయ, నారదాపర మూర్తయే।
స్వరరాగ సుధాబ్ధీందు, త్యాగరాజాయ తే నమః॥

అంటూ త్యాగరాజును నాదబ్రహ్మస్వరూపుడుగానూ, అపరనారదుడుగానూ, సంగీతసముద్రం నుండి ఆవిర్భవించిన చంద్రుడుగానూ సంభావించి నమస్కరించారు.

శ్రీ ఆకెళ్ల అచ్యుతరామమ్‌గారు త్యాగరాజును తమ గురుదేవులుగా సంభావిస్తూ వారికి నమస్కరించారు.

శ్లో॥ శ్రీరామచంద్ర చరణార్చక భక్తశ్రేష్ఠ
బహురమ్యభావ రస సంయుత గీతకర్త।
వేదాంతతత్త్వ బహుళార్థ వివేకమూర్తి
శ్రీత్యాగరాజగురుదేవ నమో నమస్తే॥

శ్రీ నండూరి రామకృష్ణమాచార్యగారు 'త్యాగబ్రహ్మ ప్రగదిత మహా గాన సామ్రాజ్యరాణీ... విజయతు విశాలాంధ్ర పృథ్వీమతల్లీ' అంటూ ఆంధ్రమాతకు తమ శుభాకాంక్షను తెలిపారు.

సుప్రసిద్ధ అష్టావధాన కవీశ్వరులైన వేంకట పార్వతీశ్వరకవులు–

చం॥ వయసు గతింపఁగా తిరిగి వచ్చినవారము దేశదేశముల్;
భయపడనేల? నాడులను బట్టి వచింతుము; దేవుఁడైన రా
మయ గుడి లేని గ్రామ మొకటైనను గానము; భక్తుఁడైన త్యా
గయ కృతి లేని గానసభ లెచ్చటఁ గానము నిక్కువంబుగన్.

ఉ॥ పావన భావముల్ తొలకి పైకొన రాగ రస ప్రవాహముల్
తావులు సూప మిన్నొరసి తాళతరంగము లొప్ప లోక సం
జీవ నిబంధ రామపద సింధువులో వరభక్తి మందర
గ్రావము ద్రిప్పి ముక్తిసుధఁ గాంచిన త్యాగసుధీంద్రు నెన్నెదన్.

అంటూ త్యాగయ్యను కీర్తించారు.

భావకవితాయుగకర్త లిద్దరిలో ఒకరైన శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు తమ 'ఆంధ్రావళి' ఖండకావ్యం లోని 'తెలుగుమాన్యము' ఖండికలో త్యాగరాజును నాదతత్పరుడని కీర్తించారు.

చం॥ సరళపదాల భావమయ సాహితి నేలిన సత్కవీశ్వరుల్
స్వరమయ రాగ కీర్తనల స్థాయి సుఖం బెలయించె నాదత
త్పరుడయి త్యాగరాజు భగవత్కళ దిద్దిరి రంగురేకలన్
నిరుపమ సిద్ధహస్తులగు నేర్పరి శిల్పు లజంతలోయలన్.

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు 'మహి మున్ వాగనుశాస నుండు సృజియింపన్ ...' (1-10) అనే రామరాజభూషణుడి 'వసుచరిత్ర' లోని పద్యానికి అనుకరణగా-

మ॥ మహి మున్ తాళులపాక ధాత సృజియింపన్, క్షేత్ర కామేశు ద
మ్మహనీయస్థితి మూలమై నిలుప, శ్యామాభ్రాత బ్రోవన్, మహా
మహులై గోపన త్యాగయోగులు భజింపన్ సొంపు వాటిల్లు నీ
బహుళాంధ్రీపద గేయ సుందరతర ప్రాగల్భ్య మూహించెదన్.

అనే పద్యాన్ని రచించి పదకవితకు సౌందర్యాన్నీ, ప్రాగల్భ్యాన్నీ కట్టబెట్టిన అన్నమాచార్య క్షేత్రయాది వాగ్గేయ కారులతోబాటుగా త్యాగరాజును కూడా స్మరించారు.

'తెలుగులెంక' శ్రీ తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారు తమ 'రాష్ట్రగానం'లో తెలుగు వెలుగులైన 'అన్నమభట్టు నా అన్న, భాస్కరమంత్రి నా బంధువు, తిమ్మరుసు నా భ్రాత, త్యాగరాజు నా అన్న అంటూ మహా నందంతో రొమ్ము విరుచుకొని నిలబడి చెప్పే హక్కు నా కున్నది. ఆ కారణంగానే నా జన్మ ధన్యమైంది!' అన్నారు.

సీ॥ '... ... ...
తన గీతిచే జగమ్మునకు జీవము వోయు
త్యాగయ్య నాదు సోదరుఁ డటంచు

తే॥ విశ్వరంగమ్ముపై ఱొమ్ము విఱిచి నిలిచి
లీలమైఁ బల్కు హక్కు నాకే లభించె
ధన్యతా భాజనంబు గదా మదీయ
జీవితం' బని సమ్మదశ్రీ భజింతు.

మన తెలుగువారిలో రాజపద విరాజితులై, రామభక్తిసామ్రాజ్యాన్ని ఏలిన ముగ్గురిని గురించిన ఈ క్రింది సుప్రసిద్ధపద్యం మనందరికీ తెలిసినదే! వీరిలో రెండవవాడు త్యాగరాజు. ఇది 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు త్యాగరాజును గురించి రచించిన హరికథకు ప్రారంభంలో ఉన్నది. కానీ ప్రస్తుతం ఈ హరికథ మన కలభ్యంగా ఉన్నది.

తే॥ గుడులు కట్టించె కంచర్ల గోపరాజు
రాగములు కూర్చె కాకర్ల త్యాగరాజు
పుణ్యకృతి చెప్పె బమ్మెర పోతరాజు
రాజు లీ మువ్వురును భక్తిరాజ్యమునకు.

'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రిగారే తమ 'ఉదయశ్రీ' రెండవ భాగంలో 'తెలుఁగు వెలుఁగులు' అనే

ఖండికలో–

త్యాగరాయల ప్రేమరాగడోలికలలో
కమ్మగా నూగె మా గానలక్ష్మి

అన్నారు. వీరే తమ ఉదయశ్రీ 3వ భాగంలో 'త్యాగయ్య' అనే శీర్షికతో 9 పద్యాలు వ్రాశారు. వాటిలో ఒక దానిని చూద్దాం.

తే॥ తాత గిరిరాజు కవిరాజు; తండ్రిగారు
రాలు కరగించు గొప్ప పౌరాణికుండు;
కవితయును గానమును రెండు కలిసి మెలసి
కాపుర మొనర్చె త్యాగయ్య గళమునందు. 1

డా॥ సురగాలి తిమోతి జ్ఞానానందకవిగారు 'త్యాగరాజు' అనే శీర్షికతో 16 పద్యాలను వ్రాశారు. వాటిలోని రెండు పద్యాలను చూద్దాం!

శా॥ నీ నాదమ్మున నల్ల స్వర్గమునకున్ విశ్వానకున్ నీవు ని
శ్రేణిన్ గట్టితివోయి రాగరసమూర్తీ! నేటి సంగీత వి
ద్యానేతల్ భవదీయ గానఝురులం దానంద ముప్పొంగగా
తానా లాడుట కీవె కారణము నాదబ్రహ్మ త్యాగాహ్వయా!

ఉ॥ నీ మహితైక తత్త్వ కమనీయ హృదంతరవీథిలోన శ్రీ
రాముని సన్నిధానమును రాగ మెలర్ప ప్రతిష్ఠ జేసి స్వ
ర్ధామము దింపినాడ వవురా మధురంబగు గానసత్కళా
గ్రామణి నీదు పుట్టువు పురాకృత భాగ్యము తెల్గుజాతికిన్.

శ్రీ శంకరంబాడి సుందరాచార్యులుగారు 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ...' అనే మన తెలుగు జాతీయగీతంలో–

'అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై నిఖిలమై నిలిచియుండే దాక...
నీ ఆటలే ఆడుతాం నీ పాటలే పాడుతాం
జై తెలుగుతల్లీ! జై తెలుగుతల్లీ!'
అంటూ భక్తియుతంగా గానం చేశారు.

'జ్ఞానపీఠ' పురస్కార గ్రహీతలైన ఆచార్యశ్రీ సి. నారాయణరెడ్డిగారు తమ ముఖాముఖి కార్యక్రమంలో 'నా దేశం త్యాగరాజ కృతిలహరి' అన్నారు. వారే తమ 'రాష్ట్రావతరణం' ఖండికలో 'త్యాగయ్య సుధాగళాన రాగవల్లు లల్లు నేడు' అన్నారు.

శ్రీ ఎం. శ్రీకాంతకమనీయసుధాఫణిగారు 'తెలుగువెలుగులు' అనే శీర్షికలో మన తెలుగుమాత–

అన్నమయ్యకు నేను వీణ మీటాను
క్షేత్రయ్యకే నేను ఆట నేర్పాను
త్యాగయ్యకే నేను పాట నేర్పాను
నా పేరు తెలుగు; నా ఊరు వెలుగు'

అన్నట్లుగా ఒక గీతం వ్రాశారు.

శ్రీ అంగర వేంకట సత్యనారాయణగారు 'సద్గురు' అనే శీర్షికతో త్యాగరాజును గురించిన కవిత నొకదానిని రచించారు. ఇది కమ్మని ఖండగతిలో నడిచింది.

ఘనతపోధనుల దీవెన లెందు నిలచె
భక్తశిఖామణుల్ పాడి రెచ్చోట
మేధానిధుల జ్ఞానమే పవిత్రావనీ
ఖండమందున మహా గౌరవమ్మున నిల్చె
పుట్టితివి బంగారు భూమిపై నీవు
పాడితివి శ్రీరామభక్తి సామ్రాజ్యాన
సద్గురూ! నీ చరిత్రము ధన్య మీ జగతి.

వెల లేని సాహితీ విభవమ్ము నిండి
కడుమనోహరమైన గానసుధ లొల్కి
తత్త్వవిజ్ఞాన వేదాంత సారమ్ము
భక్తియై ముక్తియై బంగారు పాటలై
సత్యమై నిత్యమై సంగీతసారమై
నిలుచు నీ కీర్తి వెల్గులు నింపి లోకాన
సద్గురూ! నీ చరిత్రము ధన్య మీ జగతి.

ఇంపైన మనసుతో సొంపారు బంగారు
గంపలను మేలైన చంపకమ్ములు దెచ్చి
చల్లితివి శ్రీరామచంద్రు పదపద్మముల

రఘుకులాంబుధిసోము నగుమోము గాంచితివి
క్షీరసాగరశయను కృప నందినావు
నిలచు నీ కీర్తి వెల్గుల నింపి లోకాన
సద్గురూ! నీ చరిత్రము ధన్య మీ జగతి.

వర్ధమాన వాగ్గేయకారులు కర్ణాటక సంగీత గాయకులు శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావుగారు త్యాగ రాజును ప్రస్తుతిస్తూ ఒక పాటను వ్రాశారు.

పల్లవి: రాలకైన రాగాలను– నేర్పునట్టి త్యాగయ్యా!
రమణీయ భావాలను– కృతులుగ తీర్చితివయ్యా! ॥రాలకైన॥

చ॥1. నారదుడే దిగివచ్చే– నీ గానాస్వాదనకై
సంగీతపు రహస్యాల– స్వరార్ణవము నొసగే ॥రాలకైన॥

2. రాముని సన్నిధి కంటే– పెన్నిధి లేదంటివి
రామభక్తిరాజ్యంలో–రాజువు నీవైతివీ ॥రాలకైన॥

3. నీ గానము వినిన జనుల– జన్మము చరితార్థమాయె
నీ పాదము ఆనిన యెడ–ముదమున ఉప్పొంగిపోయె ॥రాలకైన॥

4. కర్ణాటకసంగీతము– విరాజిల్లునంత వరకు
చిరంజీవివై త్యాగయ్యా!– చిరకాల ముండుమయ్యా! ॥రాలకైన॥

చలనచిత్ర మాధ్యమానికి వచ్చేసరికి శ్రీ రేణుకా ఫిల్మ్స్ మద్రాసువారు 1946వ సంవత్సరంలో 'త్యాగయ్య' అనే చలనచిత్రాన్ని నిర్మించారు. శ్రీ చిత్తూరు వి. నాగయ్యగారు అందులో త్యాగయ్యగా నటించటం మాత్రమే కాకుండా చలనచిత్ర దర్శకత్వాన్ని, సంగీత దర్శకత్వాన్ని కూడా వహించి దానిని నిర్మించారు. నవత సినీఆర్ట్స్‌వారు 1981వ సంవత్సరంలో శ్రీ బాపు గారి దర్శకత్వంలో 'త్యాగయ్య' అనే పేరుతోనే ఒక చలనచిత్రాన్ని నిర్మించారు. అందులో శ్రీ జె.వి. సోమయాజులుగారు త్యాగయ్యగా నటించారు. దానికి శ్రీ కె.వి. మహదేవన్‌గారు సంగీత దర్శకులు. శ్రీ పుహళేందిగారు వారికి సంగీత సహాయకులుగా వ్యవహరించారు.

సంగీత సాహిత్య ప్రవీణులు, మహాకవులు, భావకవిత అభ్యుదయ కవిత నాటక నాటిక నవల నవ లిక కథ కథానికాది రంగాలలో విశిష్ట స్థానాన్ని పొందిన రచయిత లనేకు లనేక చలనచిత్రాలలో దర్శక నిర్మా తల అభిరుచి ననుసరించి వ్రాసిన తమ తమ రసవద్గీతాలలో త్యాగరాజును స్మరించి మన కెంతో గొప్ప ఆనం దానుభూతిని కలిగించారు.

'కలికిపాటల కోయిల కులము నాది' అంటూ గొప్ప ఆత్మప్రత్యయంతో చెప్పుకొన్న శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారు 'అమెరికా అమ్మాయి' చలన చిత్రం కోసం వ్రాసిన 'పాడనా తెనుగు పాట పరవశనై...' అనే పాటలో–

త్యాగయ క్షేత్రయ రామదాసులు– తనివితీర వినిపించినది
నాడునాడుల కదిలించేది– వాడవాడల కనిపించేది
చక్కెర మాటల మూట– చిక్కని తేనెల ఊట

అంటూ మన తెలుగుపాటను ప్రస్తుతించారు.

ప్రాచీనాధునిక సాహిత్యాల నాపోశన పట్టిన శ్రీ వేటూరి సుందరరామమూర్తిగారు 'శుభోదయం' చలనచిత్రం కోసం వ్రాసిన 'కంచికి పోతావ కృష్ణమ్మా...' అనే పాటలో–

త్యాగరాజ కీర్తనల్లె ఉన్నాదీ బొమ్మ
రాగ మేదో తీసినట్టు ఉందమ్మా!

అంటూ కథానాయికను త్యాగరాజు కీర్తనతో ఉపమించారు. వారే ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన 'శంకరాభరణం' చలనచిత్రం కోసం వ్రాసిన 'ఓంకార నాదానుసంధానమౌ గానమే శంకరాభరణము...' అనే పాటలో–

త్యాగరాజ హృదయమై రాగరాజ నిలయమై
ముక్తి నొసగు భక్తియోగ మార్గము
మృతియె లేని సుధాలాప స్వర్గము
శంకరాభరణము

అంటూ ధీరశంకరాభరణ రాగ వైశిష్ట్యాన్నీ, ప్రశస్తినీ మనకు తెలియజేశారు. వారే 'చూడాలని ఉంది' అనే చలనచిత్రం కోసం వ్రాసిన 'యమహానగరి కలకత్తాపురి...' అనే పాటలో 'చిరుత్యాగరాజు నీ కృతినే పలికెను' అంటూ త్యాగరాజును పరోక్షంగా స్మరించారు.

పద్మశ్రీ డా॥ సి. నారాయణరెడ్డిగారు 'స్వప్న' అనే చలనచిత్రం కోసం వ్రాసిన 'అంకితం నీకే అంకితం...' అనే పాటలో–

కాళిదాసు కలమందు చిందు అపురూప దివ్యకవిత
త్యాగరాజ కృతులందు వెలయు గీతార్థసార నవత

అన్నారు.

'తొలిప్రేమ' అనే చలన చిత్రం కోసం శ్రీమణిగారు వ్రాసిన 'అల్లసానివారి పద్యమా...' అనే పాటలో–

'అల్లసానివారి పద్యమా– విశ్వనాథవారి ముత్యమా
కాళిదాసు ప్రేమకావ్యమా– త్యాగరాజ సంగీతమా
పోలిక లేని పాటలా– నువ్వు పిలిచావు నన్నిలా' అన్నారు.

ఆకాశవాణి విజయవాడ–ఎ కేంద్రంవారు 'సరసవినోదిని–సమస్యా పూరణం' అనే కార్యక్రమంలో 'గయలో పొంగిన భక్తి యీ ధరణికిన్ గాంధర్వ భిక్షం బిడెన్' అంటూ ఇచ్చిన సమస్యను నేను ఈ క్రిందివిధంగా పూరించాను.

మ॥ 'భయమేలా? రఘువంశ దీపకుడు ప్రాపై యుండగా' నంచు న
వ్వయు మాహాత్మ్యము నాలపించె తిరువైయార్ నాదయోగీశు; డా
బయకారుండు గుణామృతాంబునిధి సద్భక్తాగ్రగణ్యుండు త్యా
గయలో పొంగిన భక్తి యీ ధరణికిన్ గాంధర్వభిక్షం బిడెన్.

నరసరావుపేట వాస్తవ్యులు మా గురువర్యులు శ్రీ లంకా సీతారామశాస్త్రిగారు 'శ్రీ త్యాగరాజ చరితామృతమ్' అనే 5 సర్గల, 344 శ్లోకాల సంస్కృతకావ్యాన్ని రచించారు. శ్రీ అనంతరామ దీక్షితులుగారు 'త్యాగరాజాష్టకమ్'ను రచించారు.

'సంగీత సాహిత్యకళానిధి' శ్రీమాన్ నల్లాన్‌చక్రవర్తుల కృష్ణమాచార్యులుగారు 'శ్రీ త్యాగరాజచరిత్రము' అనే 288 పద్యాల కావ్యాన్ని రచించారు. వారే త్యాగరాజ విరచితమైన నౌకాచరిత్రం యక్షగానాన్ని 'నౌకాచరితం' అనే పేరుతో గద్య పద్య గేయాత్మక సంస్కృతకావ్యంగా అనువదించారు. 'అభినవజయదేవ' శ్రీ చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు 'త్యాగరాజు' అనే 121 పద్యాల కావ్యాన్ని, శ్రీ నల్లపెద్ది రామసుబ్బయ్యగారు 'త్యాగరాజీయము' అనే 7 ఆశ్వాసాల, 505 పద్యాల కావ్యాన్ని, డా॥ చేబ్రోలు చిన్మయబ్రహ్మకవి 'నాదబ్రహ్మ' కావ్యాన్ని, శ్రీ ప్రతాప కృష్ణమూర్తిశాస్త్రిగారు 'త్యాగరాజు' గ్రంథాన్ని రచించారు.

శ్రీ దేవరకొండ చిన్నికృష్ణశర్మగారు 'భక్తత్యాగరాజు', శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావుగారు 'భక్తత్యాగయ్య', శ్రీ తిరుపతి అనంతపద్మనాభరావుగారు 'త్యాగరాజు', శ్రీ మద్దులపల్లి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు'త్యాగరాజు' అనే నాటకాలను రచించారు. శ్రీ నండూరి వేంకటకృష్ణమాచార్యులుగారు 'త్యాగరాజు' అనే నాటికను, శ్రీ ముట్నూరి శంకరశాస్త్రిగారు 'సద్గురు శ్రీ త్యాగరాజు' అనే నాటికను రచించారు.

శ్రీ రామనాథకవిగారు 'త్యాగరాజ సుప్రభాతము'ను, శ్రీ తిరుపతి అనంతపద్మనాభరావుగారు 'సద్గురు త్యాగరాజు' నవలికను, శ్రీ హరినాగభూషణంగారు 'త్యాగరాజస్వామిచరిత్ర' అనే హరికథను రచించారు. 'కరుణశ్రీ' శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు శ్రీ కూచిభొట్ల కోటేశ్వరరావు భాగవతార్‌గారి అభ్యర్థన ననుసరించి త్యాగయ్యను గురించిన ఒక హరికథను రచించారనీ, ప్రస్తుత మది అలభ్యంగా ఉన్నదనీ కరుణశ్రీగారి కుమా రులు, మా గురువర్యులైన డా॥ జంధ్యాల జయకృష్ణబాపూజీగారు నాకు స్వయంగా చెప్పారు.

నేను త్యాగరాజకృతమైన 'ప్రహ్లాదభక్తి విజయం' యక్షగానాన్ని గురించి సవివరంగా ఉపన్యాసం చెప్పిన

శైలిలో 'ప్రహ్లాదభక్తి విజయం–ప్రసంగపాఠం' అనే పేరుతో సుమారు 60 పుటల వ్యాసాన్ని రచించాను. ఇది 'గానకళ' సంగీత మాసపత్రికలో 2005 జులై నెల నుండి 2006 ఫిబ్రవరి నెల వరకు ధారావాహికంగా ప్రచురితమైంది. 'గానకళ' మాసపత్రికలోనే త్యాగరాజును గురించిన నా వ్యాసాలు సుమారుగా 20 ప్రచురితమైనై.

శ్రీ నిత్యభూమానందస్వాములవారు, శ్రీ ములుకుట్ల పున్నయ్యశాస్త్రి గారు త్యాగరాజును గురించిన 'హరికథ'లను రచించారు. శ్రీ ములుకుట్ల సదాశివశాస్త్రి భాగవతార్, శ్రీ కోట సచ్చిదానంధాస్త్రి భాగవతార్, శ్రీ ఎం. వి. సింహాచలశాస్త్రి భాగవతార్ మొదలైన హరికథకులు ఆకాశవాణిలోను, అనేకానేక గ్రామాలలోను, పట్టణాలలోను అనేక వేల వేదికల మీద త్యాగరాజు చరిత్రను హరికథలుగా గానం చేసి శ్రోతల కానందాన్ని కలిగించారు, కలిగిస్తున్నారు.

1966 వ సంవత్సరంలో బ్రహ్మశ్రీ యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రిగారు (వై.వి. శాస్త్రిగారు), శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారు సంగీతాభిమానులైన తమ మిత్రులతో కలిసి నెల్లూరులో భిక్షాటన పూర్వక త్యాగరాజ సంస్మరణోత్సవసభను స్థాపించారు. హైదరాబాదు, పాలకొల్లు, రామచంద్రపురం, నూజివీడు, భీమవరం, కాకినాడ, విజయవాడ, ఏలూరు, గుంటూరు, నరసరావుపేట, తెనాలి, ఒంగోలు, మద్రాసు, తిరు వూరు మొదలైన పట్టణాలలో త్యాగరాజు పేరుతోనూ, నెల్లూరు, చీరాల, వరంగల్ మొదలైన పట్టణాలలో చైతన్యభారతి వంటి పేర్లతోను అనేక సంగీతసభలు వెలసి త్యాగరాజు కీర్తనలకు, కర్ణాటక సంగీతానికి ప్రచుర ప్రచారాన్ని కల్పిస్తున్నై.

మా మామగారు బ్రహ్మశ్రీ యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రిగారు (డా॥ వై.వి.శాస్త్రిగారు) నెల్లూరుకు ప్రక్కనే ఉన్న వేదాయపాళెంలో తమకు గల స్థలానికి ఆనుకొని ఉన్న బ్రహ్మశ్రీ వేమూరు శ్రీరామమూర్తిగారి స్థలాన్ని వారి నుండి సేకరించి, రెండింటినీ కలిపి అందులో తాము ప్రధానవ్యక్తిగా ఉండి తమ బంధు మిత్రాభి మానుల సహాయ సహకారాలతో 1983 వ సంవత్సరంలో త్యాగరాజాలయాన్ని నిర్మించారు. దినదినాభివృద్ధిని చెందుతూ ఉన్న ఆ ఆలయంలో ఆ రోజునుండి ఈ రోజుకీ విశేషార్చనలు, సంగీతాది ఇతర కార్యక్రమాలు యథావిధిగా జరుగుతూ ఉన్నై.

ఈ విధంగా మన కవులు, సంగీతకళాకారులు, అభిమాను లనేకులు త్యాగరాజును సంస్మరిస్తూనూ, సంస్తుతిస్తూనూ అనేకమైన రచనలను చేస్తూ, సంగీతసభలను జరుపుతూ, సంగీతానికి సంబంధించిన అనేకవిధాల కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఆలయనిర్మాణం చేస్తూ, ఆ సంగీత తపస్వి త్యాగరాజస్వామి పట్ల తమకు గల భక్తిప్రపత్తులనూ, ఆత్మీయతనూ చాటుకొంటూ ఉన్నారు.

'మధురవక్త' **డా॥ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి,** ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి. (గోల్డ్ మెడలిస్ట్)

తెలుగు లెక్చరర్ (రిటైర్డ్), 'సుధర్మ' 10-5-16, అరండల్‌పేట, నరసరావుపేట-522 601, పల్నాడు జిల్లా,

ఆం.ప్ర. సెల్ : **8978525456, drpolepeddi@gmail.com**

# 'గాయక సార్వభౌమ' కీర్తిశేషులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు



**యనమండ్ర వెంకట కృష్ణయ్య,**
**సెల్ నెంబర్ : 9849986679.**



తమ జీవితకాలంలో తెలుగుదేశాన్నేగాక, యావద్భారతావనినీ ఆకర్షించి తెలుగువెలుగును నలుదిక్కుల వెదజల్లినవారిలో 'గాయక సార్వభౌమ' కీర్తిశేషులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు ఒకరు. 1882 డిసెంబర్ 5వ తేదీనాడు ఆంధ్రసామ్రాజ్య ముఖ్యనగరమై విలసిల్లిన కృష్ణా జిల్లా శ్రీకాకుళమున శేషాచలం, మంగమాంబ దంపతులకు జన్మించిన పుణ్యమూర్తి రామకృష్ణయ్యపంతులు.

త్యాగరాజస్వామివారి శిష్యపరంపరలో మూడవ తరానికి చెందినవారు పంతులుగారు. సాక్షాత్తు త్యాగరాజస్వామి శిష్యుడు, తంజావూరులోని మానాంబుచావడి గ్రామ నివాసి, ఆంధ్రుడైన ఆకుమడుల వెంకట సుబ్బయ్యకు శిషుడైన సుసర్ల దక్షిణామూర్తిశాస్త్రి గారి శిష్యులే పారుపల్లివారు. దక్షిణామూర్తి శాస్త్రి గారి వద్ద తన సంగీత శిక్షణ కొనసాగించి గాయకుడిగా, వాయులీన విద్వాంసునిగా అసమాన ప్రతిభను గడించి, అపార స్వర సంపదను అపోసనము పట్టిన పంతులుగారు తాను గడించిన విద్యను జీవితాంతం భక్తిభావంతో అభివృద్ధి చేసుకుంటూ, దానితోపాటు అభివృద్ధి చెంది ఆదర్శప్రాయులయ్యారు. కాకినాడ సరస్వతీ గానసభలలో జరుగు ప్రసిద్ధ గాయకుల కచేరీలు మరియు అనేక పర్యాయములు దక్షిణదేశ పర్యటన చేసి అక్కడ ప్రసిద్ధ గాయకుల కచేరీలు కూడా శ్రవణం చేసి కళారహస్యములను అవగాహన చేసుకొని చక్కని సంగీత జ్ఞానం సంపాదించారు. స్వరంలో వినయం, భావంలో భక్తి, గాత్రంలో మాధుర్యం, గురువుపట్ల గౌరవం తదితర సలక్షణాలతో పంతులు గారు క్షణక్షణ ప్రవర్ధమానంగా ఎదిగారు. ఎదిగిన కొద్దీ

అభిమానుల, శిష్యుల, రసిక శ్రోతల హృదయాలలో ఒదిగారు. ఆంధ్రరాష్ట్రంలో శాస్త్రీయ సంగీత పునరుజ్జీవనానికి మూలపురుషులైన పారుపల్లివారు జంత్రగాత్రాలలో బహుముఖ ప్రజ్ఞావంతులైన సంగీత విద్వాంసులు.

'ఒకానొకని విద్య తనయందే ఘనంగా రాణిస్తుంది. మరొకని విద్య తన శిష్యునియందే రక్తికీ, రంగానికీ వస్తుంది. ఎవని విద్య ఉభయత్రా ఘనతకెక్కుతుందో అట్టివాడే గురువులలో అగ్రగణ్యుడుగా ప్రతిష్ట పొందగలవాడు' అంటాడు కాళిదాస మహాకవి. ఆ స్థాయిలో సంగీత సంప్రదాయాన్ని తన ఆశీ స్వరాలతో మనసా, వాచా, కర్మణా, జాతి, కుల, మత వర్గ విభేదాల కతీతంగా శిష్యకోటికి ప్రసాదించినవారు రామకృష్ణయ్యపంతులు. విజయవాడను కేంద్రబిందవుగా చేసుకొని ఆంధ్ర దేశమున శాస్త్రీయ సంగీత ప్రాచుర్యానికి పునాదులు వేశారు పంతులుగారు. పంతులుగారి గురుకులం "సద్యోజాతాది పంచ వక్త్రజ .. సరిగమపదని వర సప్తస్వర విద్యాలోలత"కు ఆలవాలం, క్రమశిక్షణకు పెట్టింది పేరు. శిష్యుల సంగీత అధ్యయనం మరియు సాధనలతో నిత్యమూ గురుకులం కళకళలాడుతుండేది. అన్ని వర్గములవారు ఈ గురుకులంలో ఉచిత వసతి, భోజన సదుపాయములు అందుకొని శ్రద్ధగా గురువుగారి వద్ద సంగీతము నేర్చుకొని వృద్ధిలోకి వచ్చారనటంలో సందేహములేదు. ఆ రోజులలో విజయవాడ పరిసర ప్రాంతాలలో సంగీత కళాశాలలు లేని కారణముగా పంతులుగారి గురుకులమే ఒక విశ్వవిద్యాలయముగా ఉండెడిది. శాస్త్రములో చెప్పబడిన గాయక లక్షణాలన్నీ మూర్తీభవించేటట్లు ఉండేది పంతులుగారి నిగ్రహం, స్ఫురద్రూపం, మంచి శారీరం, ఠీవి ఉట్టిపడే వేష భాషలు, తోటి వారియెడల సమాహితతత్వంతో ప్రకాశించే ప్రవర్తన – వీటికి ఆయన పుట్టినిల్లు.

పంతులుగారు మరియు వారి సతీమణి విద్యార్థులను కన్న బిడ్డలవలె చూసుకొనెడివారు. ఒకసారి పంతులుగారి శిష్యులలో ఒకరికి తేలు కుడితే, గురువుగారు శిష్యుడిని ఎత్తుకుని డాక్టరు వద్దకు తీసుకొనిపోయి, వైద్యం చేయించి ఇంటికి తీసుకువచ్చి పడుకోబెడితె పంతులుగారి సతీమణి రాత్రంతా మేలుకొని విద్యార్థికి సేవ చేశారట. వారు పొరుగూరు సంగీత కచేరీలకు రైలులో ఫస్ట్ క్లాసులో వెళితే, కూడా వచ్చే శిష్యులకు కూడా అదే క్లాస్ టికెట్ తీసుకొనేవారు. కచేరి నిర్వాహకులచేత తమతో పాటు శిష్యులకు కూడా అన్ని సదుపాయములు అమర్చేటట్లు చేసేవారు. ఇది వారి శిష్య వాత్సల్యానికి తార్కాణం.

**ఇల్లే ఒక రాజాస్థానం :** పంతులుగారి ఇల్లే ఒక రాజాస్థానంలాగా ఉండేది. శిష్యులు, అంతేవాసులు ఎల్లప్పుడు హడావిడిగా ఎవరి సాధనలో, పనుల్లో వారుంటే – అయ్యవారు క్షణక్షణం పర్యవేక్షణ చేస్తూ చెప్పవలసినవి చెప్పి,

పాడించి, ప్రతి శిష్యునకు తన బోధనా భాగ్యాన్ని కలుగచేసేవారు. పంతులుగారు శిష్యులకు నిత్య జీవితంలో అవసరమైన పొదుపుతనం, జాగ్రత్త, ఇంగితజ్ఞానం మొదలైన అన్ని విషయాలను బోధిస్తూ సొంత కుటుంబ సభ్యులవలె చూసుకొనెడివారు.

**ఆశలకు లొంగని యశస్సు :** అయన సంగీతానికి, తద్వారా ఆంధ్రదేశానికి చేసిన సేవ చెప్పాలంటే ఒక్క మాట చాలు. ఆయన యొక్క సంప్రదాయశుద్ధి, గాత్ర మాధుర్యం చూసి ఎంతోమంది దాక్షిణాత్యులు ఆయనను ఆదరించి ప్రోత్సహించడమే కాకుండా, వారిని మద్రాసులో స్థిరనివాసం ఏర్పరచుకోవలసిందిగా ఒత్తిడి చేశారు. ఆలా చేయడంవల్ల వారికి కలిగే ఆర్థిక యశోలాభాలను గూర్చికూడా ఆశపెట్టారు. దానికి పంతులుగారు "నాకు రెక్కలు వచ్చాయి కదా అని నేను ఎక్కడికో ఎగిరిపోతే నా జన్మస్థలం సంగతి ఏమి కావాలి. ఎంత సంపాదించినా వినియోగంలో వచ్చేది జానెడు పొట్ట కోసమే కదా! నా దేశపు ప్రజల అభ్యుదయమే నా అభ్యుదయము. నా ఆంధ్రదేశములో కూడా తమిళనాడు వలె సంగీతం బహుజన వ్యాప్తంగా వృద్ధి పొందేటట్లు చేయడమే నా జీవిత ధ్యేయం" అని అన్నారు. ఆ ఉద్దేశంతోనే వారు తమ స్వగ్రామమైన కృష్ణాజిల్లా దివిసీమ తాలూకా, శ్రీకాకుళం వదిలిపెట్టి విశాలాంధ్ర వసుంధరా కేంద్రబిందువైన విజయవాడలో స్థిరనివాసం ఏర్పరచుకొని జీవితాంతం వరకు తమ ఆదర్శాన్ని అమలుపరచడంలోనే గడిపినారు.

**పరనింద గిట్టని పండితులు :** ఇతర విద్వాంసులను గురించి నిరసించడంగాని, విమర్శించడంగాని పంతులుగారెప్పుడు చేసేవారు కాదు. ఒకవేళ శిష్యులలో ఎవరైనా ఆలా మాట్లాడుతుంటే వారిని పిలిచి మందలించి, ఇకముందెప్పుడు కూడా ఆలా చేయరాదని కట్టడిచేసేవారు.

**మైమరపించిన 'బాల'మురళీ గానం :** పంతులుగారు వారి గురువుగారైన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి వర్యుల ఆరాధన ఉత్సవాలు ప్రతి సంవత్సరం తానే స్వయంగా పర్యవేక్షిస్తూ చాలా ఘనంగా ఉత్తమ స్థాయిలో జరిపేవారు. ఒకమారు, అనగా సుమారు 1940 సంవత్సరము జులై మాసములో, పంతులుగారు ముఖ్యమైన పనిమీద తన స్వగ్రామానికి వెళ్ళవలసి వచ్చిన కారణముగా వార్షికోత్సవ కార్యక్రమ ఏర్పాట్లు చూడవలసినదిగా సీనియర్ విద్యార్థి అయిన నేతి లక్ష్మీనారాయణ భాగవతులుకు అప్పగించి వెళ్లారు. ఇతర సహాధ్యాయుల సూచనలతో, నేతివారు మంగళంపల్లి బాలమురళీకృష్ణ పేరుకూడా కార్యక్రమ ఆహ్వానపత్రంలో చేర్చారు. గ్రామం నుండి తిరిగి వచ్చిన పంతులుగారు కార్యక్రమ పత్రికలో మురళి పేరుతో ప్రకటన చూసి నివ్వెరపోయి – నేతివారితో 'వేళాకోళం చేస్తున్నారా 'అని మందలించారు. చి. బాలమురళి కొద్దిరోజుల నుండి మాత్రమే నా దగ్గర సంగీతాన్ని నేర్చుకుంటున్నాడు, ఇంకా గీతములు

కూడా పూర్తిచేయలేదు. దీనివల్ల ఉత్సవముల స్థాయి తగ్గుతుంది అని వారించగా, అప్పటికే కార్యక్రమ పత్రిక పంపడమైనదని చెప్పారు. జులై 18, 1940, ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున బాలమురళి కచేరీ ప్రకటించిన 30 నిమిషాలకు బదులు సుమారు రెండు గంటలకు పైగా కొనసాగి శ్రోతల ప్రశంసలందుకోవటంతో పంతులుగారు ఉప్పొంగిపోయారట. ఇది పంతులుగారు వారి గురువుగారు సుసర్లవారి ఉత్సవములలో కనపరచే ప్రత్యేక శ్రద్ధ, ప్రామాణికములు.

**సంగీత జగత్తునకు సద్గురుమూర్తి :** భక్తునికి భగవంతునికీ, తల్లికీ తనయునకూ, భార్యకు భర్తకూ, సంగీతమునకు సాహిత్యమునకూ గల సంభంద బాంధవ్యములు ఎటువంటివో అటువంటి అకళంక రమణీయ అనురాగములు కళలని; ఇట్టి కళ గురువునుండి గ్రహింపవలెనని, శిష్యునికి గురిలేక గురువునకు శిష్యుడు సరిలేక కొంతవరకు విద్య నభ్యసించగలడేమోగాని కళావతంసుడు కాలేడని, గురుశిష్యుల అవినాభావ సంబంధము కేవలం స్వానుభవైకవేద్యములని, ఈ రుచిని అనుభవించినవాడు ధన్యుడు, ముక్తుడు, అజేయుడని; గురుత్వమునకు ఉదాహరణగా అవతరించినవారు శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారని; రామునికి సీత, కృషునికి గీత అట్లే పంతులుకు అంతేవాసులని (అనగా సీతకొరకు రాముడు, గీత కొరకు కృష్ణుడు, శిష్యుల కొరకు రామకృష్ణుడు ఉద్భవించారన్నట్లు); అట్టి మహనీయ మధురమూర్తి సంగీత జగత్తునకు సద్గురుమూర్తియని, వారి జీవితచరిత్రము పరమ పవిత్రమని మరియు వారి కీర్తి ఆచంద్ర తారార్కమని అభివర్ణించారు పారుపల్లివారి శిష్యులు డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ.

**గాత్రస్థాయిని బట్టి స్వరదానం :** పంతులుగారి శిష్యులు కీ. శే. నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు గురువుగారి గురించి ప్రస్తావిస్తూ – వారు పాఠం చెప్పే తీరు, పాడే తీరుకూడా నేర్చుకునేవారికి సుబోధకంగానూ, మార్గదర్శకంగాను ఉండేవని; వారు కచేరీలలో రాగం పాడినా, నెరవు చేసినా, స్వర ప్రస్తారం చేసినా ప్రతి విషయం నమూనాలుగా భాసించేవని; చిల్లర దారులూ, ఇరుకు దారులూ వదిలిపెట్టి రాజమార్గంలో నడిచేవని; అందరిని చిన్నా పెద్దా అనకుండా ఆత్మీయులుగా చూస్తూ, ఆదరిస్తూ కూడా – తమ బెట్టు, గాంభీర్యం నిలుపుకునే ప్రవృత్తి వారిదని; గురుభక్తి అనే మహదాదర్శాన్ని వారు తాను అనుభవించి, శిష్యులందరిచేత ఆచరింపచేసేవారని కొనియాడేవారు. “అయ్యవారు పాఠం చెప్తూనే దానికి సంబంధించిన థియరీ కూడా చెప్పి వల్లింపచేసేవారు. గీతాలు, వర్ణాలూ పూర్తయ్యేటప్పటికే విద్యార్థులకు రాగం ఆలాపన చేసి ధారాళంగా స్వర ప్రస్తారం చేయగలిగే శక్తి ఏర్పడేది. శృతి శుద్ధం, లయ శుద్ధం కుదిరేది. వయోలిన్ విద్యార్థి అయితే ప్రక్క వాద్యం వాయించగలిగేవాడు. ఏ విద్యార్థినీ కూడా సంగీతం రాదు అని పంపేయకుండా వారి వారి

గాత్ర సంపత్తిని బట్టి వారికి పాఠం చెప్పి తమ శక్తిని దృష్టిలో ఉంచుకొని పాడుకోమనేవారు. "ముఖే ముఖే సరస్వతి" అన్నట్లుగా ఎవరికి ఎంతవరకు అబ్బుతుందో అంతవరకూ చెప్పి, ప్రతి శిష్యుణ్ణి అతడు పోగలిగినంత ఉన్నతస్థాయిలోకి తీసుకు వెళ్లేవారు" అని ప్రస్తావించేవారు పంతులుగారి శిష్యులలో ఒకరైన 'నాదసుధార్ణవ' అన్నవరపు రామస్వామి. సంగీత విద్వాంసుల యొక్క సమస్యలు, ఇబ్బందుల గురించి రామకృష్ణయ్య పంతులుగారు శ్రద్ధగా పరిశీలించి ఎంతటి చిక్కుముడి సమస్యనైనా యిట్టె పరిష్కరించగల దిట్ట. అయన దగ్గర శిష్యరికం చేసిన ప్రతి వ్యక్తీ ఒక విద్వాంసుడుగా పేరుపొంది, అన్న వస్త్రాలకు లోటు లేకుండా ఉండేవారు . వయొలిన్ వాయిస్తూ ఆయన పాఠం చెపుతున్నప్పుడు సంగీతంలో నిష్ణాతులైన విద్వాంసులు కూడా ముగ్ధులై ఆలకించి ప్రయోజనం పొందేవారు.

**బిరుదులు, పురస్కారాలు :** ఆ రోజుల్లో దాక్షిణాత్యులు గుర్తించి ఆదరించిన కొద్దిమంది ఆంధ్ర సంగీత విద్వాంసులలో పంతులుగారు ఒకరు. మద్రాసు సంగీత అకాడమీ నిపుణుల సంఘంలో సభ్యుడుగా చాలాకాలం పనిచేయడంతోపాటు తిరువాయూరులోని త్యాగబ్రహ్మ మహోత్సవసభ కార్యక్రమ నిర్వాహక సభ్యునిగా కూడా ఉన్నారు. ఆ రోజులలో కొలంబియా గ్రామఫోన్ కంపెనీ అయన కార్యక్రమాలను రికార్డు చేసింది. స్వార్ధరాహిత్యం, నిష్పక్షపాతబుద్ధి, నిష్కపటం మూర్తీభవించిన అజాతశత్రువు పంతులుగారు. దేశములోని వివిధ ప్రాంతాలలో కచేరీలు చేసి అనేక బిరుదులూ, పురస్కారాలు అందుకొన్నారు. 1915 ప్రాంతములో మద్రాసు రాష్ట్ర గవర్నర్ లార్డ్ పెంట్లాండ్ ప్రభువులు తెనాలిలో పంతులుగారి వేణు గానము విని తన్మయత్వం చెంది సువర్ణపతకం బహూకరించారు. 1923లో కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో, 1927లో చెన్నపట్నంలో జరిగిన అఖిల భారత సంగీత సభలో సంగీత కచేరీలు చేసి ప్రముఖుల, విద్వాంసుల, శ్రోతల మన్నలను ఆకట్టుకున్నారు. 1931లో ఆంధ్ర సారస్వత పరిషత్ , నరసరావుపేట వారు పిరాట్ల శంకరశాస్త్రి గారి చేతుల మీదుగా 'గాయక సార్వభౌమ బిరుదు' ప్రదానం చేసారు. 1944లో ఎన్. సి. కేల్కర్ ఆధ్వర్యంలో పూనాలోని తెలుగు, తమిళ, మహారాష్ట్ర సంఘాలు ఘనంగా సత్కరించాయి. 1944లో విజయవాడలోని త్రిలింగ శ్రీనివాస తిరుమల మహావిద్యాపీఠం వారు పంతులుగారిని 'అమితానంద నాదపరితోషిక' బిరుదును సత్కరించారు. కాకినాడలో ప్రతిష్టాత్మకమైన శ్రీరామ సమాజము మరియు సరస్వతీ గానసభల వారు స్వర్ణ పతకములు, హారాలతో సత్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిషత్తు వారు "భారతీ తీర్థో పాధ్యాయ" బిరుదుతో సత్కరించారు. అనేక సంగీత సభలకు వీరు అధ్యక్షులుగా ఎన్నుకోబడి తమ అమూల్యమైన సేవలను అందించారు.

# ఆంధ్రపత్రిక


1933-వ సంవత్సరము ఏప్రిల్

15-వ తేది శనివారము

## బ్ర॥ శ్రీ॥ పారుపల్లి రామకృష్ణయ్యగారి పాటకచ్చేరి

శాస్త్రులయ్య. రామారావుగారు మైసూరు వరదాచారిగారు మున్నగు మద్రాసు పుర ప్రముఖుల చేతను సంగీత విద్యాభిమానుల చేతను మద్రాసులో తంబుశెట్టి వీధిలో స్థాపింపబడి వెలుగొందుచున్న గానమందిరమునందు సదరుగాన సభ సభ్యులచే ఆహ్వానింపబడినవారై బెజవాడ వాస్తవ్యులగు బ్ర॥ శ్రీ॥ పారుపల్లి-రామకృష్ణయ్యగారొక పాటకచ్చేరి గురువారం 18-4-33 తేదీన జరిపిరి.

ఆనాడు ఆంగీరససంవత్సరాది పండుగ. ఆనాడు యీమద్రాసు నగర ప్రముఖులును సంగీతకళాభిమానులును దాక్షిణాత్యులు యీఆంధ్రగాయక విద్వాంసుని అభిమానించి రప్పించి ఆయనగాన మాధుర్యమును గ్రోలి యానందించుట శ్లాఘనము. శ్రీ రావు మాధవరావుగారు శాస్త్రులయమ. రామారావుగారు మైసూరు వరదాచారిగారు మున్నగు ప్రముఖులందరును సభకు ఆనాడు విచ్చేసిరి. ఆంధ్రులకు సంగీతవిద్వాంసులను మారవులకు భారముగా యీ గానమందిర నిర్వాహకులు ఆహ్వానించి అభిమానించినందులకై వారు చాల ప్రశంసాపాత్రులు.



గానకళాపారంగతులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు [illegible]

**అక్షరాలకందని ప్రతిభ పంతులుగారిది:** అవధులు లేని ప్రతిభామూర్తిని అంచనా వేయాలనుకోవడం ఆకాశానికి నిచ్చెన వేయాలనుకోవడమే. తారస్థాయిలో ఆయన గళం వీణలా వినిపించేదని, శ్రోతలు ఆశ్చర్యంతో చూసేవారని అనేవారు. తన కళలో పరిపక్వతను సాధించిన గాయక రుషి పారుపల్లివారు. కళాభారతిని ఆవాహన చేసుకొన్నవారే నిరాడంబరతకు పట్టం కడతారు. పంతులుగారి నిరాడంబరత ఆయన విద్యకు వన్నె తెచ్చింది. ఆయనను సంగీత ప్రియుల మనస్సుల్లో అజరామరంగా నిలిపింది.

**శిష్యప్రశిష్య సంపన్నులు :** పంతులుగారి శిష్యులే వందలాది మంది ఉన్నారు. అందరూ అసమాన ప్రతిభావంతులే!. ఆయన శిష్యుల పేర్లు కూడా తెలుగు రాష్ట్రాల్లో ఇంటింటా మార్మోగటం పంతులుగారు చేసుకున్న నిజమైన అదృష్టం. విజయవాడలో వారి గురుకుల శిక్షణలో తయారైన ఉద్దండులలో ప్రముఖులు సర్వశ్రీ మంగళంపల్లి పట్టాభిరామయ్య, నేతి లక్ష్మీనారాయణ భాగవతులు, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, అన్నవరపు రామస్వామి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నేతి శ్రీరామ శర్మ, మునునూరి వెంకట రమణమూర్తి, తిరుపతి పొన్నారావు, దాలిపర్తి పిచ్చహరి సోదరులు,

టి.కె. యశోద దేవి, జి. వి. రామకుమారి, అరుంధతి సర్కార్ మున్నగువారలు గలరు. పంతులుగారి శిష్యులు కొల్లలయితే, ప్రశిష్యులు కోకొల్లలు. సర్వశ్రీ నూకల చినసత్యనారాయణ, పెమ్మరాజు సూర్యారావు, బి. ఇందిరా కామేశ్వరరావు, ముట్నూరి జలజాక్షి, డి. వి. మోహనకృష్ణ, పొన్నపల్లి దుర్గాప్రసాద్, ముట్నూరి శ్రీనివాస నరసింహమూర్తి, పెరవలి నందకుమార్, మోదుమూడి సుధాకర్, వై. రమాప్రభ, చిద్రూపలక్ష్మి, నేమాని పార్థసారధి, అమ్ముల దుర్గాభవాని, ఆర్. దినకర్, విష్ణుభట్ల సోదరీమణులు సరస్వతి, కృష్ణవేణి తదితరులు పంతులుగారి ప్రశిష్యుల కోవకి చెందినవారు. వీరి శిష్య ప్రశిష్యులు పలు రాష్ట్రములలో అనేక సంగీత కళాశాలలో అధ్యాపకులుగా మరియు ఆకాశవాణి కేంద్రములలో నిలయ విద్వాంసులుగా సేవలు అందిస్తున్నారు. 'పారుపల్లియనెడి పావన నామంబు, విజయవాడలోన వెలయకున్న, ఏ స్థితిని గనెదమో? ఏ గతి నుందుమో? మాదృశులగు మందమతులు నేడు' అనేవారు కీర్తి శేషులు నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులవారు. పంతులుగారి కృషి, ప్రోద్బలంతో ఆంధ్ర రాష్ట్రములో విజయవాడ పట్టణములో ప్రప్రధమముగా ఆకాశవాణి కేంద్రము, తదుపరి సంగీత కళాశాల ప్రారంభమైనది. తద్వారా ఎందరికో స్వర భిక్షతోపాటు ఉపాధి కూడా కల్పించిన మహనీయులు పంతులుగారు. వీటిలో పనిచేసిన నిలయ విద్వాంసులు, ఆధ్యాపకులలో పలువురు వారి శిష్య, ప్రశిష్యులే. దక్షిణ భారతదేశంలో కన్నడిగులు, తమిళుల సంగీత ప్రతిభే ప్రామాణికంగా చలామణి అవుతున్న ఆ రోజులలో తెలుగువాడి స్వరాన్ని విశ్వవ్యాప్తం చేసిన విశిష్టమూర్తి పంతులుగారు.


పంతులుగారి జయంతి, గురుపూజ ఉత్సవములు నేటికినీ వారి శిష్య ప్రశిష్యులచే విజయవాడ నగరములో ఘనంగా అత్యంత శ్రద్ధాభక్తులతో వైభవోపేతంగా జరుపబడుచున్నాయి. ఆలాగుననే పంతులుగారి శిష్యులు 'సంగీతానంద' కీ. శే. నేతి శ్రీరామశర్మ కూడా హైదరాబాదులో సుమారు రెండు దశాబ్దాలపాటు గురువుగారి ఉత్సవములు ఘనంగా జరిపించి వర్ధమాన గాయకులందరిచేత పాడించి ప్రోత్సహించేవారు.

ఖండాంతర ఖ్యాతి నార్జించిన సుప్రసిద్ధ 'వాగ్గేయకారుడు', 'పద్మ విభూషణ్', 'సంగీత కళానిధి' డాక్టర్ శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, 'నాదసుధార్ణవ ' శ్రీ అన్నవరపు రామస్వామి మరియు ఎందరినో బహుముఖ సంగీత విద్వాంసులుగా తయారుచేసి ఆంధ్రదేశానికి సమర్పించిన గాయక సార్వభౌమునికి సంగీత కుటుంబమంతా ఋణపడి ఉంటారనడంలో అతిశయోక్తిలేదు! సంగీతజ్ఞానంలో ఆంధ్రదేశాన్ని చైతన్యవంతం చేసిన మహామనీషిగా, యుగకర్తగా ప్రాతఃస్మరణీయులైన శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 1951వ సంవత్సరం జూలై 7వ తేదీ, ఆషాడ శుద్ధ ఏకాదశి పర్వదినాన తమ గురువులు దక్షిణామూర్తిశాస్త్రి గారి ఆరాధనోత్సవములు జరుపుతున్న వేళ సంగీత సరస్వతి ఒడికి చేరుకున్న ధన్యజీవి.

**(డిసెంబర్ 5వ తేదీ శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి 142వ జయంతి జయంతి సందర్భాన ఈ వ్యాసం ప్రచురించటమైనది)**

**అపురూప చిత్రాల సౌజన్యం గానకళానిధి శ్రీమాన్ వింజమూరి వరదరాజయ్యంగార్ కుమార్తె శ్రీమతి వింజమూరి సంధ్య గారు. వారికి కృతజ్ఞతలు**

# కృతిరత్నావళి - 5




సంగీతవిద్వాంసులు, ప్రముఖ వైణికులు స్వర్గీయ డా. మంచాళ జగన్నాధరావుగారిచే స్వరసంకలించబడిన అనేక శాస్త్రీయసంగీత రచనలను కృతిరత్నావళి పేరుతో లాస్యఫైన్ఆర్ట్స్ నాలుగు సంపుటాలలో ముద్రించటం జరిగింది. ఇప్పుడు మరికొన్ని కీర్తనలను కృతిరత్నావళి – 5 అనే గ్రంధంలో పొందుపరచి సంగీతలోకమునకు సమర్పిస్తున్నాము. ఈ సంపుటంలో స్వర్గీయ డా. మంచాళ జగన్నాథరావుగారిచే స్వరసంకలనం చేయబడిన కర్నాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీశ్యామశాస్త్రిగారివి, శ్రీ త్యాగరాజస్వామివారి శిష్యులైన శ్రీవీణకుప్పయ్యగారివి, మరియు శ్రీ సదాశివబ్రహ్మేంద్రసరస్వతి వారి కీర్తనలను ముద్రించటం జరిగింది. మేము ప్రచురించిన ఈ కృతిరత్నావళి – 5 గ్రంధం సంగీత విద్వాంసులకు, విద్యార్థులకు ఉపయోగపడుతుందని విశ్వసిస్తున్నాము. సంపాదకులు – నండూరి జోగులాంబ, నండూరి శివశంకరశర్మ, వాడ్రేవు సుబ్బారావు (late)

**పేజీలు – 309, ప్రతి వెల – రూ.300/**

**ప్రతులకు సంప్రదించవలసిన చిరునామా -**

**యన్.యస్.యస్. శర్మ,**

5-331, యస్. ఆర్. నాయక్ నగర్, ఐడిఏ జీడిమెట్ల, హైదరాబాదు 500 055

సెల్ నంబర్లు 9393761014, 7702844690, 9390354014 మరియు

**నవోదయ బుక్ హౌస్**

కాచిగుడా, హైదరాబాద్,

ఫోన్ 040 24652387, సెల్. 90004 13413

ఫోన్ : 9393100434, 9346301355



# త్యాగరాజ ఆరాధన ట్రస్టు

## (కళాభారతి ప్రాంగణం)

40, పిఠాపురం కోలనీ, విశాఖపట్నం - 530 003

**విషయం : కళాభారతి ఆడిటోరియం ప్రాంగణంలోని త్యాగరాజ స్వామి మందిరము వద్ద త్యాగరాజ ఆరాధనోత్సవముల నిర్వహణ; మీరు, మీ శిష్యబృందము పాల్గొన అభ్యర్థన.**

ఆర్యా!

ఉత్తరాంధ్ర ప్రాంత సంగీత కళాకారులు, కళాభిమానులంతా కలసి త్యాగరాజ ఆరాధన ఉత్సవములను సామూహికముగా జరుప నిర్ణయించి త్యాగరాజ ఆరాధన ట్రస్టును ఏర్పరచుకున్న విషయము మీకు విదితమే.

అసంఖ్యాకములగు స్థానిక, స్థానికేతర కళాకారుల సంపూర్ణ సహకారముతో త్యాగరాజ ఆరాధనోత్సవం కడు వైభవముగా తిరువాయూరు నందలి ఉత్సవమును తలపించు విధముగా ప్రతి సంవత్సరము జరుగుచున్న విధము మిక్కిలి సంతోషదాయకము.

రాబోవు పుష్య బహుళ పంచమి, 18-01-2025 తేదీన అయినది. అందుచే స్థానిక త్యాగరాజ స్వామివారి ఆలయ ప్రాంగణములో జనవరి 17, 18, 19, 20, 21 & 22 తేదీలలో త్యాగరాజ ఆరాధన మహోత్సవములు నిర్వహింప సంకల్పించబడినది. తేదీ 18-01-2025 న ఉదయం 8.20 గంటలకు కళాభారతి ఆడిటోరియంలో సామూహిక త్యాగరాజ పంచరత్న బృందగానము తదనంతరం జనవరి 18, 19, 20, 21, 22 తేదీలలో వివిధ కళాకారులచే త్యాగరాజ స్వామివారి కృతుల గానము, తేదీ 17-01-2025 సాయంత్రం 6.00 గంటలకు ఆరాధనోత్సవముల ఆరంభమును సూచించు విధముగా ఒక విశిష్టమైన కార్యక్రమముతో ప్రారంభించబడును. ఈ కార్యక్రమమునందు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాల యందలి కళాకారులే గాక ఇతర ప్రదేశములకు చెందిన కళాకారులు గూడా పాల్గొంటున్నందుకు సంతోషిస్తున్నాము. 1100 మంది కళాకారుల వరకు పాల్గొంటారని, క్రమేణ ఇది రెండవ తిరువాయూరు క్షేత్రముగా ఆవిర్భవిస్తుందని ఆశిస్తున్నాము.

అందుచే ఈ ఉత్సవములో పాల్గొనుటకు మీ అంగీకారము తెలియబరచుచూ మీ కార్యక్రమమును ఈ ఐదు తేదీలలో ఎప్పుడు జరిపింప మీకనుకూలముగా నుండునో తెలుప ప్రార్థన.

***మీ శిష్యులు తదితర కళాకారుల వివరములు ఇందు జతపరచబడిన నమూనా దరఖాస్తు ఫారములో పంపగోరెదము.***

సమయాభావం వల్లను ఎక్కువమందికి పాల్గొనే అవకాశమిచ్చుటకును ఒకే గురువు వద్ద నుండి వచ్చు కళాకారులను బృందములుగా పాడేలా పంపవలసినదిగా గురువులను కోరుచున్నాము.

| | | |
|---|---|---|
| ఒక్కొక్క కార్యక్రమమునకు కాల నిర్ణయం | : | B-High and above grade 30 నిమిషాలు |
| | : | B-grade 15 నిమిషాలు |
| | : | Others 10 నిమిషాలు |

**(10 నిమిషములు కేటాయించిన కళాకారులు, రెండు కృతులు మించకుండా నిర్ణీత 10 నిమిషముల సమయంలో ముగించవలెను.**

- ☛ కళాకారులు త్యాగరాజ కృతులనే పాడవలసియుండును. మనోధర్మ స్వరకల్పన చేయకూడదు. **30 నిమిషముల కార్యక్రమములో ఒక దివ్యనామ కీర్తనకానీ, ఉత్సవ సంప్రదాయ కీర్తనకాని చివర పాడవలసినదిగా అభ్యర్థన.**
- ☛ వారికి కేటాయించిన కాలమును విధిగా పాటింపవలెను.
- ☛ కనీసస్థాయిలో లేని కళాకారులకు అవకాశమునీయ వీలుబడదు. ప్రఖ్యాత కళాకారులచే గాని సంస్థలచే గాని ధృవపరచ బడని దరఖాస్తులకు అవకాశము లభించుట కష్టము. 12 సం.ల లోపు పిల్లలకు అవకాశము లభింపదు.
- ☛ అందరికి మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయములు కళాభారతిలో కల్పించబడును. మృదంగం, వీణ,డోలు మొదలగు భారీ వాయిద్యములు తేవలసిన వారికి స్థానికముగా రూ. 100/-రవాణా ఖర్చు నిమిత్తం ఇవ్వబడును.
- ☛ **జనవరి 18వ తేదీన** త్యాగరాజ పంచరత్న సామూహిక బృందగానంలో పాల్గొను కళాకారులు సంప్రదాయదుస్తులను ధరించవలెను (అనగా మగవారు ధోతి, లుంగీ/స్త్రీలు, చీర/జాకెట్, ఆడపిల్లలు లంగా, జాకెట్)
- ☛ స్థానికేతర మృదంగ, వయోలిన్ కళాకారులు సహకార వాయిద్యమందించుటకు ఎన్నిరోజులు, ఏయే తేదీలలో ఉండ గలరో ప్రత్యేకముగా తెలుపప్రార్థన.

ఇట్లు భవదీయుడు

☛ **ఈ ఆరు రోజుల కార్యక్రమములు నిర్ణయించుటకుగాను మీ జవాబును తేది 05-12-2024 లోగా పంపప్రార్థన.**

**డా॥ జి.ఆర్.కె. ప్రసాద్ (రాంబాబు)**
గౌరవ కార్యదర్శి

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘము, గుంటూరు





శ్రీత్యాగరాజసాంస్కృతికసంఘము,గుంటూరు వారి ఆధ్వర్యంలో, శ్రీత్యాగరాజ కళావేదికపై 13.10.2024 ఆదివారం నుండి 17.10.2024 గురువారం వరకు శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘ 46వ వార్షికోత్సవ పురస్సర వాగ్గేయకార మహోత్సవములు జరిగినవి. 13నఉదయం గం 9:30ని లకు జ్యోతి ప్రజ్వలనంతో కార్యక్రమం ఆరంభించ బడింది. సభాధ్యక్షులు గా అధ్యక్షులు శ్రీ రామరాజు శ్రీనివాస్ వ్యవహరించగా, కార్యదర్శి శ్రీ వల్లూరి కృష్ణ కిషోర్ సంచాలకులు గా నుండి నాటి ముఖ్య అతిధులైన, హైకోర్టు విశ్రాంత న్యాయవాది శ్రీ శేషసాయి గారిని మరియు అర్షవిద్యా వాచస్పతి శ్రీ వేదాంతం రాజగోపాల చక్రవర్తి గార్లను వేదికపైకి ఆహ్వానించగా సంఘ ఉపాధ్యక్షులు శ్రీ యస్. గిరిజాశంకర్ వారిని పుష్పగుచ్ఛములతోను, శాలువాలతోను, జ్ఞాపికలతోను సత్కరించారు. అధ్యక్షోపన్యాసము తరువాత ముఖ్య అతిధులిరువురును వారివారి విలువైన సందేశములనిచ్చిరి. సభాకార్యక్రమానంతరం సంఘం వారిచే నిర్వహించబడిన సంగీత పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిధులచే బహుమతి ప్రదానం జరిపించిన తరువాత వారి లఘుకచేరిలు ఏర్పాటుచేసిరి.



సాయంత్రం గం 6:30ని లకు శ్రీ సిక్కిల్ గురుచరణ్ (చెన్నై) కచేరి జరిగినది. శ్రీమతి దుర్గాభవాని వైలిన్ పై, శ్రీ బుర్రా శ్రీరామ్ మృదంగం

పై సహకరించిరి. కచేరి శ్రీ శంకర భగవత్పాదుల పై ధ్యానశ్లోకంతో ఆరంభించి, 'నాద తనుమనిశం' అను చిత్తరంజని రాగ త్యాగరాజకీర్తనపాడి, జయజయ, నాటరాగ పురందరదాస రచన చక్కని చిక్కని స్వరప్రస్తారాలతో గానం చేసారు. అనంతరం సౌరాష్ట్ర రాగంలో "సూర్యమూర్తే" దీక్షితులవారి రచన చక్కని పదాన్తర శుద్ధతతో గానంచేశారు. ఆపై "ఎంతముద్దో" బిందుమాలిని లో త్యాగయ్యగారి రచన, అభేరి లో అన్నమాచార్యులవారి కీర్తన నేదునూరి వారి స్వరపరచినది పాడి ప్రధానాంశంగా తోడి రాగంలో శ్యామశాస్త్రి వారి కీర్తన 'నిన్నేనమ్మినాను' రాగ, స్వర, సాహిత్య ప్రస్తారాలతో విస్తరించి గానం చేసినప్పటికి మరికొంచం NEU-ANCES లోపించిందనిపించింది. వాయులీనం పై ప్రక్క వాయిద్యాలవారుచక్కని సహకారన్నందించి కచ్చేరిని రక్తి కట్టించారు. శ్రీరామ్ గారి తన్యవర్తనం అద్భుతంగా ఉన్నది. అనంతరం అష్టపది, తిల్లానాలతో కచేరి ముగించారు.



ఉత్సవాలలో రెండవరోజు 14.10.2024 సోమవారం సాయంత్రం గం 6:30ని శ్రీ మల్లాది సూరిబాబు "త్రిమూర్తుల శిష్య ప్రశిష్య వాగ్గేయ రచనలపైప్రయోగత్మక వివరణ"ఆసక్తికరంగా సాగింది. శిష్య పరంపర ఎక్కువగా త్యాగయ్యగారికే ఉన్నదని, శ్యామ శాస్త్రి గారు తన కుమారుడైన సుబ్బారాయశాస్త్రి ని త్యాగయ్య గారి వద్దకే పంపిరని కనుకనే సద్గురు నామము త్యాగయ్యగారికే సార్ధకమైనదని చెప్పి, వారి శిష్య ప్రశిష్య పరంపరలోని రచనలను వినిపించడం జరిగింది. యీ క్రమంలో నారాయణ తీర్థుల వారి నుండి వచ్చిన సంగీత సంప్రదాయాన్ని కూడా స్పృశించారు. యీ కార్యక్రమానికి వయలిన్ పై కుమారి A. కామాక్షి, మృదంగం తో శ్రీ బుర్రా శ్రీరామ్ సహకరించారు. తొలుత శ్రీ పొన్నయ్య పిళ్ళేగారి రచన సౌరాష్ట్ర రాగంలో పాడి, మునిపల్లె సుబ్రహ్మణ్యకవి రచన 'ఓంనమశివాయం' ధన్యాసిలో స్వరపరచినది గానం చేసారు. తరువాత మద్యమకాల రచనల్లోని మాధుర్యన్ని వివరిస్తూ కాంభోజి రాగంలోని ముత్తయ్యభాగవతర్ గారి కీర్తన "రత్నకంచుకధారిణి "సంప్రదాయ శుద్ధంగా గానం చేసాక పట్నం సుబ్రమణ్య అయ్యర్ గారి రచన 'ఎంతనేర్చిన' సావేరి రాగంలో వినిపించి, దీక్షితులవారి తండ్రి రామస్వామి శివన్ గారి రచన 'పాహిమాం శ్రీ రాజరాజేశ్వరి' జనరంజనిలో, శ్రీ సుబ్బరాయశాస్త్రి రచన 'నినువినా గతిగాన జగాన' కళ్యాణి రాగంలో ప్రధానాంశంగా పాడేరు. సంప్రదాయాశుద్ధంగా సాగిన రాగస్వర ప్రస్తారాలు పూర్వ సంప్రదాయాన్ని జ్ఞప్తికి తెచ్చాయి. అనంతరం మైసూర్ వాసుదేవచార్యులు గారి కీర్తన 'భజరేమానస' అభేరి రాగంలో ను, 'లలితే మాంపాహి'- చేయ్యురు ? చెంగల్వరాయశాస్త్రి

గారి రచన యందుకుల కాంభోజి లోను, అలాగే పూలయూరు దొరైస్వామి కీర్తన 'అతడే నమ్మ' ఫరజు లోను, నారాయణదాసు గారి రచన 'వారణాసి పదన్యాసి' పూర్వికళ్యాణి లోను వినిపించి చివరిగా స్వాతితిరునాళ్ రచన "విశ్వేశ్వర" సింధు భైరవి తో ముగించారు.



ఉత్సవాల్లో భాగమైన మూడవరోజు 15.10.2024మంగళవారం చెన్నై నుండి రావలసిన విద్వాంసులు తుఫాను కారణంగా రాలేకపోయినందున స్థానిక విద్వాంసురాలు శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావు మరియు శ్రీ పశుపతి గార్ల శిష్యురాలైన శ్రీమతి డి.వి.ఆర్. సీత కచేరి ఏర్పాటు చేయ బడినది. యీకచేరికి సహకరించుటకు వైయలిన్ పై శ్రీ పి. నందకుమార్, మృదంగం పై శ్రీ బి. సురేశ్ బాబు సహృదయంతో అంగీకరించిరి. కచేరి తొలుత దర్బారు వర్ణం తో ఆరంభించి తరువాత బేగడ రాగంలో దీక్షితులు వారి రచన 'వల్లభనాయకస్య', మృదువుగా గానం చేసి శుభపంతువరాళి లో త్యాగరాజ కీర్తన 'నే పొగడకుంటే' కొద్దిపాటి రాగంతో పాడేరు. రాగధర్మాన్ననుసరించి స్థిమితంగా గానం చేసారు. అనంతరం నవరసకన్నడలో త్యాగయ్య గారి దురితకాల కీర్తన "నీనువినానమదెందు" లోని పైకాలం బిర్కా సంగతులన్నీ సమర్థవంతంగా పలికి రక్తి కట్టించారు. తదుపరి రీతిగౌళ రాగంలో త్యాగయ్యగారి 'నన్ను విడచి కదలకురా' తగినంత రాగంతో భావయుక్తంగా పాడారు. ఆపై 'ఎంతనేర్చిన సఫలమేమి 'పట్నం సుబ్రమణ్య అయ్యరు రచన రాగస్వర సంచారాలతో సఫలీకృతంగా వినిపించి, 'వినరాద నామనవి' యంటూ దేవగాంధారి కీర్తన గానం చేసారు. ప్రధానాంశంగా కళ్యాణి రాగంలో శ్యామశాస్త్రి వారి రచన 'హిమాద్రిసుతేపాహిమాం' స్వరరాగ సుధా రసయుత భక్తి తో సార్ధకం చేసారు. వైయలిన్ పై నందకుమార్ మృదంగం తో సురేష్ గార్లు అనుభవజ్ఞులైన కళాకారులు కావడం వలన పాటకు కావాల్సిన బలాన్ని చేకూర్చి కచ్చేరిని ద్విగుణికృతం చేసారు, తరువాత రెండు మూడు లలిత శాస్త్రీయ అంశాలతో నాటి కచేరి ముగించారు.



16.10.2024 మంగళవారం. సాయంత్రం గం 6:30కు విశాఖపట్నం నుండి విచ్చేసిన శ్రీమతి లలిత చంద్రశేఖర్ గాత్రకచేరికి, శ్రీ పి. నందకుమార్ వైయలిన్ పై శ్రీ బి. సురేష్ బాబు మృదంగం పై సహకరించిరి. తొలుత భైరవి వర్ణంతో ప్రారంభించి, గజరాజేన, అరభి లో దీక్షితర్ కీర్తన పాడేరు. ఆ పై

బ్రోవసమయమిది, చింతామణి రాగంలో శ్యామశాస్త్రి ఏకైక రాగకృతి చక్కని నిబద్ధతతో గానంచేశారు. పిమ్మట దేవదేవం భజేహం హిందోళ రాగంలో అన్నమాచార్యుల రచన రాగస్వర ప్రస్తారాలతో రుచిరంగా గానంచేశారు. అనంతరం స్వీయ స్వర రచనలో సామవేదం షణ్ముఖ శర్మ గారి రచన షణ్ముఖప్రియలో వినిపించారు. పూర్వవాగ్గేయకార రచనలలో వీరిని కూడా చేర్చి భక్తిని చాటుకున్నారనిపించింది. తరువాత 'చింతిస్తున్నాడే' ముఖారి రాగంలో త్యాగయ్యగారి అరుదయిన కీర్తన వినిపించారు. తదుపరి కళ్యాణి రాగంలో రామదాసు కీర్తన 'నను నుబ్రోవమనిచెప్పవే 'చాలా పటిష్టంగా త్యాగరాజ కీర్తన స్థాయికి చేరే లా గానం చేసి, ఓగిరాల వారి రచన ఫరజులో వారి కుమారుని కోరిక పై వినిపించారు. అనంతరం స్వీయస్వర రచనలో శ్రీపాదరాయ రచన మోహనలో పాడి, కీరవాణిలో 'వరములొసగి' అన్న పట్నం సుబ్రమణ్య అయ్యరు గారి కీర్తన ప్రధానాంశంగా ఎంచు కున్నారు. ఆసాంతం కచేరి సంప్రదాయ సంగీత సుగంధాన్ని పరిమళింప చేసింది. వయొలిన్, మృదంగం సహకారం కచేరికి మరింత శోభను చేకూర్చాయి చక్కని తని ఆ వర్తనం అనంతరం రెండు మూడు లలితశాస్త్రీయ అంశములతో కచేరి పరిసమాప్తం అయ్యింది.

ఉత్సవములలో చివరి రోజయిన 17.10.2024 గురువారం 'వాచస్పతి' శ్రీ ఎమ్.వి. సింహాచలశాస్త్రి గుంటూరు వారి హరికథాగానంలో శ్రీ ముత్తుస్వామి దీక్షితులు వారి దివ్య చరిత్ర, ఆద్యంతం అత్యంత ఆసక్తికరంగా సాగింది. వారి జనన రహస్యాలను, 7సం ప్రాయం లోనే గృహత్యాగం చేసి వారి గురువుగారితో కాశిక్షేత్ర ప్రయాణం,12వర్షముల అనంతరం స్వగ్రామమునకు తిరిగి వచ్చేమార్గంలో వారి క్షేత్రాటన మధ్యేమార్గంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి అనుగ్రహం సిద్ధించుట, ఆయా దేవతా మూర్తులపై కృతి రచన, వంటి సంఘటనలన్ని కారణజన్ముల జీవితానికి నిదర్శనంగా నిలిచాయి .సందర్భోచితంగా సింహాచలశాస్త్రి గారి కృతి గానం, రాగ శుద్ధత, సంగీత విద్వాంసుల గానానికి దీటుగా ఉన్నాయి. ప్రతి రచనలోని వైశి ష్ట్యాన్ని, వ్యాకరణాది విషయములను విశదంగ వివరించారు. ఆకథా కధనరీతి వర్ణనాతీతం అంటే అతిశయోక్తికాదు. కార్యక్రమాలను సంఘ గౌరవ కార్యదర్శి శ్రీ కృష్ణ కిషోర్, సంఘ సభ్యుల సహకారంతో ఘనంగా జయప్రదంగా నిర్వహించారు. తలవని తలంపుగా దేశాన్తరము వెళ్లిన మా పూర్వ కార్యదర్శి ఉత్సవాలకు విచ్చేయడం స్ఫూర్తి నిచ్చింది.



# నాద రమణీయ వేణు గానసభ





నెలవారీ విద్యార్థి విద్వాన్ కచేరి కార్యక్రమంలో భాగంగా నవంబర్ 30వ తేది వేణుగానం దట్ల శశాంక్, వీణ పై దాట్ల దివ్య గాయత్రి, మృదంగం అచ్యుతానంద. కచేరి ప్రారంభం మొదట మోహన వర్ణం బాలమురళీకృష్ణ గారి రచన; ఆరభి రాగం లో సకలగణాధిప, త్యాగరాజ కృతి; రవిచంద్రిక రాగం లో 'మాకేలరా విచారము', ధనశ్రీ తిల్లాన మొదలగునవి వినిపించారు.

సీనియర్ కచేరిలో:– మాండొలిన్ విజయ్ రాఘవన్, వయొలిన్ పై రాధికా శ్రీనివాసన్, మృదంగం పి.శ్రీనివాస గోపాలన్, ఘటం పై వి. శ్రీధరాచార్య సహకరించారు. వీరి కచేరీలో లాల్గుడి వారి చారుకేసి రాగం వర్ణం తో ప్రారంభించి, గౌళ రాగం లో శ్రీ మహాగణపతి తదుపరి బిందుమాలిని లో ఎంతముద్దో, త్యాగరాజ కృతి ముఖ్యాంశం గా శంకరాభరణం లో స్వరరాగ సుధ వాయించడం జరిగింది.

**- మోదుమూడి సుధాకర్**

# విజయనగరంలో ఘంటసాల వర్ధంతి



విజయనగరం కొత్తగ్రహారంలో గల రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో బుధవారం ప్రఖ్యాత గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వర రావు 102వ జయంతి జరిగింది. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, ఘంటసాల వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకను ప్రారంభించి వారి సంగీత పరంపర అలాగే వారి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, వంశీకృష్ణ, శారద, భానుహర్ష, మహేశ్వర రావు, బాలాజిస్వామి, శిరీష, విద్యార్థులు, తల్లితండ్రులు, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు...

**– గానకళ ప్రత్యేక ప్రతినిధి**



**శ్రీ కచ్ఛపీ కళాక్షేత్రం, ఆముదాలవలస.**
**20.11.2024న శ్రీమల్లాది సోదరులు**
**శ్రీరామప్రసాద్, రవికుమార్ ల గాత్ర యుగళం.**
**సర్వశ్రీ ఎంబార్ కన్నన్–వైలన్;**
**వంకాయల వెంకటరమణమూర్తి–మృదంగం;**
**ఎమ్.హరిబాబు–ఘటం;**
**బి.దుర్గాశ్రీనివాస శర్మ–మోర్సింగ్.**

# మారెళ్ళ వారి వేణుగానం



01-12-2024న గుంటూరు అరండల్ పేట శ్రీ మోహన రంగనాయక స్వామి ఆలయంలో శ్రీ మారెళ్ల వామన కుమార్ వేణుగాన కచేరికి వయోలిన్ – శ్రీ చావలి శ్రీనివాస్ మృదంగం – శ్రీ చావలి కృష్ణ మోహన్.

గజాననయుతం – చక్రవాకం – ఆది – దీక్షితార్; బంటురీతి; పరిదానమిచ్చితే – బిళహరి; ఉపచారముచేసేవారున్నారని; రమించువారెవరురా – సుపోషిణి – ఆది(త్రిశ్రం) డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఈ కీర్తనకు జోడించిన చిట్ట స్వరం చతురస్ర గతిలో నడుస్తూ, చివరి ఆవృతంలో త్రిశ్ర గతి నడిపారు. ఈ కీర్తన శ్రోతలను ఉత్సాహపరిచింది సారసనేత్రా – నోటు స్వరం – త్యాగరాజ ఇది నోటు స్వరం అని పేరు పొందినప్పటికీ, మొదటి భాగము చతురస్రంలోను, రెండవ భాగం త్రిశ్రంలోను నడుస్తాయి.

స్వాగతం కృష్ణ; చాలదా హరినామ; అదిగో అల్లదిగో అంశాలు శ్రోతల హర్షధ్వానాలు మధ్య వినిపించారు. దేవాలయ కమిటీవారు కళాకారులను సత్కరించారు.

## రోటరీ మ్యూజిక్ అకాడమీలో పద్మవిభూషణ ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ కి నివాళి



విజయనగరం కొత్తగ్రహారంలో గల రోటరీ దశిగి పేరాజు మ్యూజిక్ అకాడమీలో ఇటీవల ఆదివారం అమెరికా లో మృతిచెందిన ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్యాంసుడు పద్మవిభూషణ ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ కి నివాళి కార్యక్రమం జరిగింది. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, విద్యార్థులు జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ రవి తబలా విద్వాంసుని జీవిత విశేషాలను తెలియజేసి విద్యార్థులు వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విద్యార్థిని రోటరీ పూర్వ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి, అధ్యాపకులు రవికుమార్, వంశీకృష్ణ, శారద, భానుహర్ష, మహేశ్వర రావు, బాలాజిస్వామి, శిరీష, విద్యార్థులు, తల్లితండ్రులు, పాల్గొని నివాళులు అర్పించారు ...

**– డాక్టర్ మండపాక రవి,** గానకళ ప్రత్యేక ప్రతినిధి.

# సునాద వినోదిని - ఆత్మీయసమావేశం.






ఉభయాంధ్రప్రదేశాలలోనే కాక తెలుగు భాషాప్రియులు, సంగీత ప్రియులు అందరూ కలిసి ఏర్పరచుకొన్న వాట్సప్ సమూహం **'సునాద వినోదిని'.** ఆ సభ్యులందరూ 01.12.2024 న ఖమ్మంలో కలిసిన అపురూప, ఆత్మీయ సమావేశం విశేషాలు.

సమావేశం చిరంజీవి పవన్ కుమార్ ప్రార్ధనాగీతంతో ప్రారంభించగా, మన సభ్యులు శ్రీ చెఱుకువాడ సత్యనారాయణ(CS) గారి నిర్వహణలో సభ ప్రారంభం అయ్యింది. కాకినాడ సమావేశం తర్వాత, జరుపబోయే సమావేశం ఖమ్మంలో చేయాలన్న శ్రీ సారథిగారి కోరిక గురించి చెపుతూ, గత మూడు నెలలుగా సారథిగారి వేసిన ప్రణాళికలు, పడిన శ్రమ గురించి వివరించారు.

సునాద వినోదిని రెండవ సంచికను ఆవిష్కరించి వలసినదిగా, మన సభ్యులు డా.పాలకోడేటి సత్యనారాయణ రావు గారిని ఆహ్వానించగా, సంచికను ఆవిష్కరిస్తూ, వారు స్వపరిచయం చేసుకుని, సినిమా పుట్టకనుంచి తదనంతర కాలంలో భారతీయ సినిమా చెందిన మార్పుల గురించి తెలియచేస్తూ, ఎన్నో విశేషాలను, వివరాలను సోదాహరణంగా తెలియచేస్తూ, తాను సినిమాల గురించి రాసిన పుస్తకాల వివరాలను చెప్పి, సుదీర్ఘంగా ప్రసంగించారు.

జయంతి శాస్త్రి గారు మాట్లాడుతూ..ఒక పోస్ట్ పెట్టాలంటే ఎంత శ్రమ పడాలో వివరిస్తూ, పెట్టిన పోస్ట్ లకు సభ్యుల నుండి స్పందన తక్కువగా ఉంటే పోస్ట్స్ పెడుతున్నవారికి నిరుత్సాహం కలిగి, పోస్ట్స్ పెట్టాలనే ఆసక్తిని తగ్గుతుందని అన్నారు. పెట్టిన పోస్ట్స్ బావున్నదీ లేనిదీ తెలియచేస్తే, ఇంకా మెరుగ్గా శీర్షికలను రూపొందించడానికి వీలు కలుగుతుంది అన్నారు.

నిస్సార్ అహ్మద్ – (హైదరాబాద్) తిరిగి గ్రూప్ లో కథలను పరిచయం చేయమని కోరారు.

CV మురళి(చెన్నై): పోస్ట్ చేస్తున్న పాటలను వింటున్నప్పుడు, వాటి నేపథ్యం, ఆర్టిస్టులు, గతస్మృతులు గుర్తుకు వస్తున్నాయని చెపుతూ,

బాలుగారి తండ్రిగారి హరికథలు చెప్పడం గురించి చెప్పి, హరికథల గురించి కూడా గ్రూప్ లో ప్రస్తావించాలని, సినిమా క్విజ్ ప్రవేశ పెడితే బాగుంటుందని అన్నారు.

దూరదర్శన్ మొదటి తరం ఉద్యోగి, మహామహులు తనదైన శైలిలో ఇంటర్వ్యూ చేసిన విజయదుర్గ గారు, ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొనడంకోసంఎంతోకాలంగాఎదురుచూస్తున్నాని, ఈ మధ్య కళ్ళకు కాస్త ఇబ్బంది కలిగినా, ఆత్మీయులందరినీ – ముఖ్యంగా ఈ సమూహాన్ని ఇంత పద్ధతిగా నడుపుతున్న శ్రీ విజయసారథి గారిని వ్యక్తిగతంగా అభినందించడానికి అన్నయ్య పురాణం రమణ గారితో వచ్చానని చెప్తూ... ఎన్నో గ్రూప్స్ ఉన్నప్పటికీ గత ఏడు ఎనిమిది సంవత్సరములనుండి ఇంత పద్ధతిగా నడుపుతున్న గ్రూప్ ఇంకోకటి లేదని, దీనికి కారణభూతులైన ప్రతీ ఒక్క సభ్యునికి అభినందనలు తెలియచేస్తూ, ఇంతమంది గొప్పవారు, ప్రతిభావంతులు ఉన్న గ్రూప్ లో సభ్యురాలిగా ఉన్నందుకు గర్వంగా ఉందని అన్నారు.

శ్రీ పురాణం రమణగారు మాట్లాడుతూ, తను బైపాస్ ఆపరేషన్ చేయించుకుని 28రోజులే అయినప్పటికీ, మిత్రులందరినీ కలుసుకోవాలనే కోరికతో వచ్చానని, ఈ గ్రూప్ ఆవిర్భావం నుంచీ తనకున్న అనుబంధాన్ని వివరించి, సోదర సభ్యులందరిని కలుసుకున్నందుకు చాలా ఆనందాన్ని వ్యక్తపరచి, సమూహ సారధి శ్రీ సారథిగారికి హృదయపూర్వక అభినందనలు తెలియచేశారు.

శ్రీ దాశరథి గారి అల్లుడు గ్రూప్ కమలాఫలం లో తొనల్లా ఎంతో మాధుర్యంతో నిండి వైవిధ్యంగా ఉందని అన్నారు.

చల్లా సుబ్బారాయుడు – తెలుగు భాషలోని గొప్ప కవులను,రచయితలను వారి రచనలను పరిచయం చేస్తే బాగుంటుందని సూచించారు.

శ్రీనివాస్(కలగ క్రిష్ణమోహన్ గారి శిష్యులు) మంచి సంగీతం యొక్క ప్రభావం గురించి వివరిస్తూ, రోజూ ఉదయాన్నే ఆనాడు ఆకాశవాణిలో ప్రసారం చేయబడిన ఒక భక్తిగీతాన్ని వినిపిస్తే బాగుంటుందని సూచించారు.

మరో సభ్యురాలు శ్రీమతి రేవతి గారు మాట్లాడుతూ, ఈ సమూహం ద్వారా సినిమాల గురించి, పాటల గురించి ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నానని, వారంలో ఒక రోజు ఒక హీరో లేదా హీరోయిన్ కు సంబంధించిన పాటలను పోస్ట్ చేయమని కోరారు.



సమావేశంలో ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, విశ్లేషకులు, విమర్శకురాలు అయిన శ్రీమతి నందూరి సుందరీ నాగమణి గారు, మరియు.. ఆకాశవాణి ఉద్యోగి,ఎన్నో మంచి కథలను తన మధురమైన గళంతో శ్రోతలను అలరింపచేస్తున్న శ్రీమతి భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు మాట్లాడుతూ – ఈ సమూహంలో సభ్యులుగా ఉన్నందుకు గర్వపడుతున్నామని, సమూహాన్ని గత ఎనిమిది సంవత్సరములుగా ఇంత చక్కగా, పద్ధతిగా నడుపుతున్నందుకు శ్రీ విజయ సారథి గారికి ఇతర నిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు.

ఒరిస్సా జైపూర్ నుంచి విచ్చేసిన శ్రీ సోమయాజులు ప్రసాద్ గారు సమూహము నడుస్తున్న తీరును ప్రశంసిస్తూ, తాను జైపూర్ లో అడ్మిన్ గా ఉన్న సమూహానికి స్ఫూర్తి మన సునాద వినోదినే అని, ఎన్నో శీర్షికలను ఇదే పద్ధతిలో జైపూర్ గ్రూపులో ప్రవేశపెట్టానని సంతోషంతో తెలియపరుస్తూ... తాను ఇప్పటివరకు జరిగిన ఆత్మీయ సమావేశాలకు హాజరయ్యానని, ఈ ఖమ్మం సమావేశం



గుర్తుంచుకోవలసినదిగా జరిపించినందుకు, సారథి గారికి, కార్యనిర్వాహక సభ్యులకు అభినందనలు తెలియచేశారు.

శ్రీ కలగ క్రిష్ణమోహన్ గారు లలిత సంగీతం గురించి ఎన్నో విశేషాలు చెప్తూ, శ్రీ చల్లా సుబ్బారాయుడు గారు శ్రీ ఘంటసాల వారి పాటలు గురించి రాసిన పుస్తకాన్ని సభకు పరిచయం చేసారు.

శ్రీ సంపత్ కుమార్ ఆచార్యులు గారు సునాద వినోదినిలో ప్రస్తుతం ఉన్న శీర్షికలు అన్నీ చాలా బాగున్నాయని, కొత్త శీర్షికలను ప్రవేశపెట్టే దిశగా ఆలోచన చేయాలని సూచించారు.

ఈనాడులో పనిచేసి పదవీ విరమణ చేసిన ప్రముఖ చిత్రకారులు, మన సునాద వినోదిని మొదటి, ద్వితీయ సంచికలకు కవర్ పేజీ డిజైన్ చేసిన అమిత మితభాషి శ్రీ పెమ్మరాజు రవికిశోర్ తనకు చేసిన సత్కారానికి కృతజ్ఞతలు తెలియచేశారు.

శ్రీ చింతమనేని ప్రసాద్ ఈ గ్రూప్ తనకెంత మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తోందో తనదైన శైలిలో చెప్పి సభను రంజింపచేశారు.

శ్రీ శఠగోపం సుదర్శన్ సునాద వినోదిని, ఆ సాయంత్రం జరిగిన భలే మంచిరోజు పండుగలతో ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ అనుబంధాన్ని పంచుకున్నారు.

ఖమ్మం పట్టణంలో ప్రముఖులు, ఈ రెండు కార్యక్రమాలకు అన్నివిధాలా వెనకనుండి తన

సహాయ సహకారాలను ఎప్పటినుండో అందిస్తున్న డా.వాసుదేవ్ ప్రసంగిస్తూ సునాద వినోదిని సభ్యుల నిబద్ధతకు అభినందనలు తెలియచేస్తూ...ఆ సాయంత్రం జరగబోవు భలే మంచిరోజు పండుగకు అందరినీ పేరు పేరునా ఆహ్వానించారు.

సభ్యుల స్పందనలు తర్వాత, సునాద వినోదిని సభ్యులు శ్రీ విజయ సారథిగారిని ఆత్మీయంగా సత్కరించుకోవడం, సమావేశానికి హాజరైన వారందరికీ ఎంతో సంతోషం కలిగించింది. సభానంతరం చక్కటి విందు భోజనంతో సభ ముగిసింది.

ఈ సమావేశంలో గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయం – మన సభ్యులు, తెలంగాణా రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ వి వి శ్రీనివాసరావు, ఆత్మీయ సమావేశానికి శ్రీమతి తో విచ్చేసి, ఇలా ఒక వాట్సాప్ గ్రూప్ సభ్యులు ఆత్మీయంగా కలుసుకోవడం చాలా అరుదుగా జరుగుతుందని, ఇలా అందరినీ కలుసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని చెప్తూ, మన సభ్యులతో సరదాగా గడిపి, చివరివరకూ ఉండి, భోజననంతరం వెళ్లారు.

శ్రీయుతులు అన్నదానం ప్రసాద్, ఎంవీఎస్ ప్రసాద్, శర్మ, మూసం కిషన్ అచ్చిబాబు, శ్రీమతి నాగేశ్వరి, తదితరులు సభకు హాజరవ్వడంతో సమావేశం ఆద్యంతం ఎంతో ఉత్సహంగా, ఉల్లాసంగా జరిగింది. విదేశాల్లో ఉన్న శ్రీ శేషబాబు గారు,శ్రీ వెంకటేశ్వరరావు గారు, మరి కొందరు సభ్యులు ఈ ఆత్మీయ సమావేశానికి హాజరు కాలేకపోవడం పెద్ద లోటుగా అనిపించింది. వారు సమావేశం జయప్రదంగా జరగాలని శుభాకాంక్షలు పంపారు.

ఇంకో ముఖ్యవిషయం: శ్రీయుతులు పాశం నాగేశ్వరరావు, వెంకటరామయ్య, లక్ష్మణబాబు చేసిన ఏర్పాట్లు, అతిథి మర్యాదల గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ చూపించిన అభిమానం మరువలేనిది.

మరో ముఖ్యవిషయం : ఆత్మీయ సమావేశానికి తప్పక హాజరవ్వాలనే సంకల్పంతో ఖమ్మం వచ్చిన రైల్వే ఉన్నతాధికారి, మన సభ్యులు శ్రీ రవి పాడి, అనుకోని ఉద్యోగ బాధ్యతల ఒత్తిడి వల్ల ఉదయం ఆత్మీయ సమావేశానికి రాలేకపోయిన పరిస్థితి ఏర్పడింది పనుల ఒత్తిడి మధ్యలో ఖాళీ చేసుకుని, ఆ సాయంత్రం భలే మంచిరోజు కార్యక్రమానికి వారు హాజరై చివరి వరకూ ఉండడం చాలా సంతోషం కలిగించింది.

ఇంత అద్భుతమైన ఏర్పాట్లు చేసిన శ్రీ విజయ సారథి గారికి ఎన్నీ అభినందనలు చెప్పినా తక్కువే!

సభానంతరం చక్కటి విందు భోజనంతో సభ ముగిసింది.

**ములుకుట్ల వెంకటనారాయణ.**

# భక్తిశ్రద్ధలతో గీతాజయంతి



విజయనగరం కొత్తగ్రహారం లో గల రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో బుధవారం గీతాజయంతి జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి గీతాజయంతి విశేషాన్ని తెలియజేసారు. శ్రీకృష్ణుడు ఏవిధంగా అర్జుననికి ధైర్యం చెప్పి గీతను ఉపదేశించాడో తెలియజేసి విద్యార్థులు దానిని ఆవశ్యకతను దానిలోని విలువలను తెలుసుకొని నడుచుకోవాలని తెలియజేసారు. ఇందులో విద్యార్థులు, అధ్యాపకులు భానహర్ష, శారద, శిరీష, రవికుమార్, బాలజీశ్వామి, వంశీకృష్ణ మహేశ్వర రావు పాల్గొన్నారు.

**గానకళ ప్రత్యేక ప్రతినిధి.**

# విజయనగరం రోటరీ క్లబ్ కమ్యూనిటీ ప్రాజెక్టు



విజయనగరం రోటరీ క్లబ్ కమ్యూనిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగ్రహారం లో నడుపబడుతున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ వారు పవిత్రమైన ఈ మార్గశిర మాసంలో విద్యార్థులకు అటు చదువుతో పాటు సంగీతం మన సాంప్రదాయ విలువలు తెలిసే విధంగా మార్గశిర మాస సంగీత నగర సంకీర్తనను ప్రారంభించారు. ప్రతీ ఆదివారం ఉదయం 6.30నుండి 7.30వరకు ఈ సాంప్రదాయ సంగీత నగర సంకీర్తన వచ్చేనెల 5వ తేదీ వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి తెలియజేసారు. అలాగే ఈ నగరసంకీర్తన ఆవశ్యకత విలువలు తెలియజేసారు. అకాడమీ నుండి ప్రారంభమైన ఈ నగరసంకీర్తన శ్రీవేంకటేశ్వర స్వామి కోవెల కొత్తగ్రహారం 2వీధులలో జరిగింది. ఇందులో విద్యార్థులు, అధ్యాపకులు భానహర్ష, మహేశ్వర రావు, శిరీష భక్తులు పాల్గొన్నారు.

**– గానకళ ప్రత్యేక ప్రతినిధి.**




**ఏలూరులో 1.12.24న కృష్ణవేణి సంగీత సమారోహంలో మల్లాది నారాయణశర్మ యమునారామన్ ల గాత్రయుగళం.**

# కీ.శే.డా.గుడ్లవల్లేటి లక్షణరావుగారి 105 వ పుట్టినరోజు



ఆయన వృత్తిపరంగా వైద్యులు. ప్రవృత్తి సంగీత ఆరాధన...ఎందరో పేదలకు ఉచిత వైద్యం అందిస్తూనే సంగీత కచేరీలు నిర్వహించి, విద్వాంసులను గౌరవిస్తూ "పాటల డాక్టరు గారు"అని పేరు తెచ్చుకొన్న భగవద్భక్తులు కీ.శే.డా.గుడ్లవల్లేటి లక్షణరావుగారి 105 వ పుట్టినరోజును వారి కుటుంబ సభ్యులు ఘనంగా కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు వేణుగోపాలస్వామి ఆలయంలో 30-11-2024 నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిఖ్యాత వాయులీన విద్వాంసులు,



సద్గురువులు, పద్మశ్రీ బిరుదాంకితులు శ్రీ అన్నవరపు రామస్వామి గురువర్యులను(99 సం॥) ఘనంగా సత్కరించి, నా గాత్ర కచేరీ కూడా నిర్వహించారు. శ్రీమతి దుర్గాభవాని, శ్రీ సద్గురుచరణ్ నాకు వాద్యాలతో సహకరించారు.

వేణు విద్వాంసులు శ్రీ జి.ద్రోణేంద్ర ఫణికుమార్ కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహరించారు. ఈ ఆలయంలో లక్ష్మణరావుగారు ప్రతిష్ఠ చేసిన సద్గురు శ్రీ త్యాగరాజస్వామివారి విగ్రహం దర్శించటం మహద్భాగ్యం.

ముఖ్య అతిథిగా చార్టెడ్ అకౌంటెంట్ నీలిమ మరియు తిరుపతి సూర్యనారాయణ రాజు గారు కళాకారులని సన్మానించారు






విదుషి 'పద్మశ్రీ ' పరాశల పొన్నంబాళ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా తిరువనంతపురంలో గానంచేసిన విద్వాన్ ఎస్.మహదేవన్.ఎడప్పల్లి అజిత్ కుమార్-వైలన్;నాంజిల్ అరుణ్ -మృదంగం;పెరుక్కావు సుధీర్- ఘటం

# విశాఖ మ్యూజిక్ అకాడెమి 55వ వార్షికోత్సవ సంగీతసభలు

విశాఖ మ్యూజిక్ అకాడెమి 55వ వార్షికోత్సవ సంగీతసభలు 26-11-24 నుంచి 01-12-24 తేదీ వరకు స్థానిక కళాభారతి హాలులో రసజ్ఞులైన ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో ఘనంగా ఆరు రోజులు జరిగాయి.

సంప్రదాయానుసారంగా ప్రథమదివస సాయంత్రాన సరిగ్గా 6.15ని.కు వేదిక నిర్వాహకులు వి.యస్.యన్.మూర్తి గారి గళంలో "ఆదరమొప్ప మ్రొక్కెదుదు" నన్న గణేశస్తుతితో ఆహ్వానపలుకులతో మొదలైంది. నాటి ముఖ్య అతిథి, Sprint Exports Pvt Ltd, MD శ్రీ పవన్ కుమార్ గుంటూరు వారితో పాటు అకాడమి అధ్యక్షులు శ్రీ కె.వి. రామ్మూర్తి, కార్యదర్శి శ్రీ వీరఘంట చంద్రశేఖర్, కోశాధికారి శ్రీ సి.హెచ్. దుర్గాప్రసాద్ గారల సువర్ణ హస్తాలతో జ్యోతిని ప్రకాశింపజేసిన అనంతరం కుమారి బుద్ధ భావన వీనుల విందుగా "తొండము నేకదంతమును" అని సభక్తికంగా ప్రార్థన చేసింది. అకాడమి లక్ష్యాలను తెలియజేస్తూ, అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తిగారి స్వాగతోపన్యాసం, ముఖ్య అతిథి శ్రీ పవన్ కుమార్ గారి సందేశాలతో సభ ముగిసింది. తరువాత 6.40కి ఆరంభమైన విదుషీమణి పద్మావతి సారనాథన్(చెన్నై) గాత్రసంగీతసభ, డా.కొమాండూరి వేంకటకృష్ణ వాయులీనంపై, శ్రీ పి. జయభాస్కర్ మృదంగంపై, శ్రీ జి.వేంకటేశ్ మోర్సింగ్ పై సహకరించగా రసభరితంగా సాగింది.

సంగీతసభలో గాయని మాళవిరాగ వర్ణం, ఆభోగి రాగంలో "శ్రీ మహాగణాపతే", సుప్రదీపం రాగంలో "వరశిఖివాహన", జ్యోతి స్వరూపిణి రాగంలో "రామే భరతపాలిత", ఆహిరి రాగంలో "మాయమ్మ యనినే", గౌడమల్హార్ రాగంలో "సారసముఖి", కీర్తనల అనంతరం ముఖ్యాంశంగా కేదారగౌళరాగ కీర్తన "తులసీ బిల్వ" రాగాలాపన స్వరకల్పనలతో వినిపించారు. త్రిరాగమాలికగా తరువాత గానంచేసిన రాగం-తానం-పల్లవి అంశం గాయని ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. త్రిశ్ర త్రిపుట మిశ్రనడ తాళంలో రాగమాలికగా వసంత, భైరవి, వసంతభైరవి రాగాలలో సాగరసమాన నాదవిహార, రామనామసారపాన, త్యాగరాజ పాలయసదా అన్న సాహిత్యాన్ని వినిపించి శ్రోతల కరతాళధ్వనుల నందుకున్నారు. సరసాంగి రాగంలో స్వీయరచన తిల్లానాతో సభ ముగిసింది. కొమాండూరివారి వాయులీన సహకారం మేలనిపించగా, జయభాస్కర్ గారి మృదంగవాద్య ప్రతిభ ప్రతి అంశంలో క(వి) నిపించి వేంకటేశ్ గారితో సహా అందించిన లయ విన్యాసం, ఆకట్టుకుంది.

సభారంభంలో ఆనాటి సభాప్రాయోజకులైన RVR Projects pvt ltd., అధినేత శ్రీ ఆర్. వేంకటేశ్వర రావు గారు, ఇంజనీర్ శ్రీ ఐ.ఎల్. ఎన్.ప్రసాదుగారు కళాకారులకు ఫలప్రదానంతో సత్కరించారు.

రెండవరోజు 27-11-24 నాటి సాయంత్రం అకాడమి సహకార్యదర్శి శ్రీ మంథా జ్వాలా ప్రసాద్ గారి కళాకారుల పరిచయంతో ఆరంభమైన శ్రీ వి.కె.మణిమారన్ (చెన్నై), గారి గత్రసంగీతసభ

శ్రోతలను ఆనందింపజేసింది. హంసధ్వని రాగంలో "పాహి పాహి బాలగణపతి" అంటూ ఆరంభించి వరుసగా నాటరాగంలో "స్వామినాథ", ఆరభిరాగ పంచరత్న కీర్తన "సాధించెనే", చంద్రజ్యోతి రాగంలో "బాగాయెనయ్య", ధన్యాసిరాగంలో "రామా దయజూడవే", కీర్తనలు వినిపించి, కీరవాణి రాగాలాపన స్వరకల్పనలతో "అంబవాణి", నాగస్వరావళి రాగంలో "శ్రీ శంకర గురువరం", ఆలపించి రంజింపజేశారు. ముఖ్యాంశంగా కల్యాణి రాగంలో "ఏ తావునరా" కీర్తన అనంతరం నీలాంబరి రాగంలో "ఉయ్యాలలూగవయ్యా" అన్న అంశంతో సభను ముగించారు శ్రీ మణిమారన్. డా. మావుడూరి సత్యనారాయణ శర్మ వాయులీనంపై తగినవిధంగా రాగాలాపనలతో, స్వరకల్పనలతో స్వీయప్రతిభను ప్రదర్శించగా, మృదంగం విద్వాంసులు, అనుభవజ్ఞులు డా. వంకాయల వేంకట రమణమూర్తి గారు తన సహజసిద్ధమైన మృదుమధుర సహకారంతో, గంభీరమైన లయవిన్యాసంతో మన్ననలందుకున్నారు. శ్రీ యమ్. హరిబాబు గారి ఘటవాద్య సహకారం సమయోచితంగా సాగింది. సభారంభంలో ఆనాటి సభాప్రాయోజకులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యం వారికి అకాడమి ధన్యవాదాలు తెలుపగా, సహప్రాయోజకులు శ్రీమతి టేకుమళ్ళ శ్యామలగారు కళాకారులను సత్కరించారు.

మూడవరోజు 28-11-24 నాటి సాయంత్రం విశాఖ మ్యూజిక్ అకాడెమి ప్రతియేట లబ్ధప్రతిష్ఠులైన సంగీత/నృత్య కళాకారులకు క్రమంతప్పకుండా సమర్పిస్తూ వస్తూన్న ప్రతిష్ఠాత్మక 'సంగీత కళా సాగర' బిరుదును ఈ యేడాది చెన్నైకు చెందిన ప్రసిద్ధ మార్దంగికులు శ్రీ కె.వి.ప్రసాద్ గారికి సమర్పించింది. ఆ సందర్భంగా జరిగిన సన్మాన సభను "సుతులము మేము నిన్నెప్పుడు శుద్ధమనంబున గొల్తుమయ్య" అన్న స్వీయరచనతో విఘ్నేశ్వరుని స్తుతించి ఆరంభించారు శ్రీ వి.యస్.యన్.మూర్తిగారు. సభలో పాల్గొన్న అకాడమి అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తి, కార్యదర్శి శ్రీ వీరఘంట చంద్రశేఖర్, కోశాధికారి శ్రీ సి.హెచ్. దుర్గాప్రసాద్, సన్మానగ్రహీత శ్రీ కె.వి.ప్రసాద్ గారలు, లాంఛనంగా జ్యోతిప్రకాశన మొనరించాక వర్ధిష్ణుగాయని కుమారి కె. నాగవైష్ణవి "శుక్లాం బ్రహ్మవిచారసార పరమాం" అంటూ ఆరభి రాగంలో తాను స్వరపరచిన ప్రార్థన వీనులవిందుగా చేసింది.

క్లుప్తమైన అధ్యక్షుల సందేశమయాక, ఉపాధ్యక్షులు డా. పేరాల బాలమురళీకృష్ణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మాన గ్రహీత శ్రీ కె.వి. ప్రసాద్ గారిని ప్రత్యేక ఆసనం గ్రహింపజేసి అకాడమి కార్యవర్గం వారిని ముందు చందనకుంకుమలతో అలంకరించి, శాలువా,చందనమాల, జ్ఞాపిక, ఫలములు, పుష్పమాలలతో సత్కరించారు. అనంతరం శ్రీ వంశీ టెక్స్టైల్స్ తరపున శ్రీ వుప్పల శ్రీనివాస్, ప్రసాద్ గారికి పట్టువస్త్రాలు సమర్పించగా, అకాడమీ అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తిగారు బంగారుపతకంతో సన్మానించారు. ఎమిరటస్ కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్ రచించిన సన్మాన పత్రాన్ని కార్యదర్శి శ్రీ వి.చంద్రశేఖర్ అందజేశారు. స్థానిక సంగీతజ్ఞులు, సంస్థలుకూడా సమ్మానించి తమ ఆనందాన్ని తెలియజేసాయి. తరువాత సంగీతకళాసాగర కె.వి.

ప్రసాద్ క్లుప్తమైన తన స్పందనలో దేశంలోగల మృదంగవాద్య కళాకారుల తరపున తాను ఈ సన్మానం స్వీకరించానని పలకడంతో కరతాళ ధ్వనులతో సభ ప్రతిస్పందించింది. వెనువెంటనే అకాడమి ప్రతియేటా వార్షికోత్సవంలో అందించే అవార్డులు సన్మానాలు ఉపకారవేతనాల ప్రదాన కార్యక్రమం త్వరత్వరగా నిర్వహించారు.

Artist of distinction – అవార్డును మృదంగ విద్వాంసుడు శ్రీ యమ్.కామేశ్ గారికి, శాలువా జ్ఞాపిక నగదు బహుమతితో సమర్పించారు జూన్ నెలలో అకాడమి నిర్వహించిన యువకళాకారుల సంగీతసభలలో ఉత్తమ ప్రదర్శనకుగాను బెంగుళూరుకు చెందిన వర్షిష్ణ వాయులీన కళాకారిణి కుమారి శ్రీ విద్యకు శాలువా, జ్ఞాపిక మరియు నగదు బహుమతి నందించడం జరిగింది అదే సభలలో పాల్గొని తమవిద్యను ప్రదర్శించిన యువకళాకారిణులు ఘట్టి శ్రీవిద్య, నామతీర్థాల లక్ష్మీప్రసన్న, నామతీర్థాల కృష్ణప్రియ, కోట గాయత్రి వరేణ్య, భవ్యశ్రీ గీతిక, జ్ఞాన శివకీర్తనలకు కూడా అకాడమి శాలువా జ్ఞాపిక నగదు బహుమతులు అందజేసి ప్రోత్సహించింది.

మహరాజ ప్రభుత్వ సంగీత కళాశాల, విజయనగరం కు చెందిన డిప్లమో రెండవ సంవత్సరం విద్యార్థులైన యస్.భార్గవి, ఐ.శివాని, యం. శివకుమార్, టి. సురేశ్ గారలకు ఉపకారవేతనాలను అందించింది అకాడమి.

ఎప్పటిలాగే నిస్వార్థంగా తమ సమయాన్ని శక్తినీ అకాడమికోసం సంతోషంగా ధారపోస్తూన్న కార్యవర్గ సభ్యులలో ఒకరికి కృతజ్ఞతా పూర్వకంగా ప్రతియేటా జరుపుకునే సన్మానం ఈ యేడు సహకార్యదర్శి శ్రీ అయ్యగారి భుజంగరావు గారికి జరిపి, శాలువా అందమైన జ్ఞాపికతో సత్కరించింది అకాడమి.

ఈ సన్మానాలన్నీ సంగీతకళాసాగర కె.వి. ప్రసాద్ మరియు మైసూర్ బ్రదర్స్ చేతులమీదుగా జరుపుకోవడం విశేషం. ఈ అవార్డులు అన్నిటికీ ప్రాయోజికతనందించిన వదాన్యులందరికీ అకాడెమి ధన్యవాదాలు తెలియజేసింది.

తరువాత జరిగిన మైసూరు సోదరులు శ్రీ యమ్. నాగరాజ్ మరియు డా. మైసూర్ మంజునాథ్ గారల వాయులీన వాద్యసభ, ఒక సంగీతప్రవాహంలాగ సాగుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. వాగధీశ్వరి రాగంలో నెమ్మదిగా "పరమాత్ముడు వెలిగె" అన్న కీర్తనతో ఆరంభించి, జనరంజకంగా "పాహిమాం శ్రీ రాజరాజేశ్వరి" అంటూ జనరంజని రాగంలో ముందుకు సాగి, మృదంగ విద్వాంసుని సన్మానం సందర్భంగా త్యాగరాజ రచన "సొగసుగా మృదంగతాళము" కీర్తన శ్రీరంజని రాగం లో మనోహరంగా వినిపించి, వారుకూడా మృదంగ సహకారమందిస్తూన్న శ్రీ కె.వి.ప్రసాద్ గారిని గౌరవించారు. ప్రశ్న – జవాబు రీతిలో నిర్వహించిన స్వరకల్పన డా.యస్.కార్తిక్ ఘటంపై సహకరించగా వీనులకు విందొనర్చింది. శ్రోతలు కోరిన కాపీ రాగంలో, రాగం – తానం –పల్లవి వినిపిస్తూ, శ్రీ మంజునాథ్ పల్లవిని అరనిముషంలో అందించమని ఘటవిద్వాంసుడు కార్తిక్ గారిని కోరగా, చిరునవ్వుతో వెంటనే ప్రసాద గురుప్రసాద సంగీతవరప్రసాద

అనగానే సభికుల ఆనందధ్వని హాలంతా నిండిపోయింది. ఆ పల్లవి అనంతరం ప్రసాద్ – కార్తిక్ జంట అందించిన లయ విన్యాసం లలితగంభీరమైన రీతిలో, సునాదభరితమైన ఎడమ–కుడి సంధానంతో, లెక్కల ముక్తాయిలతో శ్రోతలకు విందుభోజనం అందించింది. పసందైన సింధుభైరవిరాగాలాపన, తిల్లాన, వినిపించి సభను ముగించారు విద్వాంసులు. తనకుమార్తెమల్లాప్రగడసంధ్యదివ్యస్మృతిలో,బంగారు పతకానికి ప్రాయోజకత చేకూర్చిన ప్రొ.యమ్. జి.శేషగిరిరావుగారి కుటుంబ సభ్యులకు, ఆనాటి సభకు ప్రాయోజకతను అందించిన డా.M.V.R. సుజాత – వారి మాతృమూర్తి డా. కరుణ మధ్వపతి (వీరి తాతగారైన ప్రఖ్యాత ప్రజాసేవకులు ఆలనాటి మంత్రివర్యులు కీ.శే. భాట్టం శ్రీరామమూర్తి మరియు వారి సతీమణి శ్రీమతి సత్యవతి గారల జ్ఞాపకార్థం) గారికి, సహప్రాయోజకులు HPCL Executive Director శ్రీ అభిషేక్ త్రివేది గారికీ అకాడమి ధన్యవాదాలు సమర్పించింది. సభారంభంలోనే శ్రీమతి సుజాతగారు, శ్రీ అభిషేక్ త్రివేది గారు కళాకారులను సత్కరించారు.

నాల్గవ రోజు 29-11-24 సాయంత్రం శ్రీ మోదుమూడి సుధాకర్ గారి గాత్రసంగీతసభ, కుమారి వి.శ్రీపూర్ణ గాయత్రి శివాని వాయులీనంపై, శ్రీ యం.ఏడుకొండలు మృదంగంపై, శ్రీ మావుడూరి సూర్యప్రసాదరావు ఘటంపై సహకరించగా సభారంజకంగా సాగింది. శ్రీ మంథా జ్వాలాప్రసాద్ గారు కళాకారుల పరిచయం ముగించాక ఆనాటి సభాప్రాయోజకులు, Devi Seafoods AGM శ్రీ జి. సత్యనారాయణ గారు, కళాకారులను సత్కరించగా, వారికీ, సహప్రాయోజకులు డా.సి.శాంతమ్మ గారికీ, అకాడమి ధన్యవాదాలు సమర్పించింది. స్వీయరచన శృతిరంజని రాగంలో వర్ణంతో ఆరంభించి, మోహన కల్యాణి రాగంలో "సంగీత సామ్రాజ్య సంచారిణీ", దేవక్రియ రాగంలో "శ్రీ గురుగుహ", తోడి రాగాలాపనతో "సరసిజనాభ మురారే", శహన రాగంలో " ఈవసుధ నీవంటి", కీర్తనలు పసందైన గాత్రం సౌలభ్యంతో వినిపించారు శ్రీ సుధాకర్. మిశ్రమాండ్ రాగంలో రామభక్తి సామ్రాజ్య సార్వభౌమం – త్యాగరాజ సద్గురువరం భజే అన్న రాగం–తానం–పల్లవి అంశం గాయకుని మనోధర్మ వైఖరిని తెలియజేసింది. హుసేని రాగంలో "వాడలిగితే" అన్న జావళి, మంగళంపల్లి బాలమురళీకృష్ణరచన రాగతాయమాలిక తిల్లానాలతో సభను ముగించారు కళాకారులు. వాయులీన సహకారం తగిన మనోధర్మప్రదర్శనతో శ్రోతలను ఆకట్టుకొనగా, లయవాద్య కళాకారుల లయవిన్యాసం రంజింపజేసింది.

అయిదవరోజు 30-11-24 నాటి సాయంత్రం కోశాధికారి శ్రీ సి.హెచ్.దుర్గాప్రసాద్ గారి కళాకారుల పరిచయానంతరం ప్రఖ్యాత గాత్రవిద్వాంసురాలు శ్రీమతి మండ సుధారాణి గారి గానం, శ్రీమతి సరస్వతుల శ్రీవిద్య సహకార గానంతో, శ్రీ ఆర్. దినకర్ వాయులీనంపై, శ్రీ కోటిపల్లి రమేశ్ మృదంగంపై, శ్రీ యస్.హనుమంతరావు ఘటంపై, కుమారి NVSL ప్రసన్న తంబూరపై, సహకరించగా ప్రేక్షకులను సంతోషపరచింది. ఆనాటి సభాప్రాయోజకులైన

Visakhapatnam Cooperative Bank Ltd Chairman శ్రీ సిహెచ్.రాఘవేంద్రరావు, CEO శ్రీ పి.వి.నరసింహమూర్తి కళాకారులను సత్కరించిన అనంతరం శ్రీమతి సుధారాణి, కార్తిక మాసం చివరిరోజు శివునిస్తుతి తో ఆరంభించి, ఖమాస్ రాగంలో దారు వర్ణం "మాతే మలయధ్వజ", రేవగుప్తి రాగంలో "గోపాలక పాహిమాం", ద్విజావంతి రాగాలాపన స్వరకల్పనలతో "అఖిలాండేశ్వరి", ధర్మవతి రాగంలో "భజనసేయరాదా", బహుదారి రాగంలో "కమలదళాయత", పూర్ణచంద్రిక రాగంలో "తెలిసి రామచింతన", అంశాలను గానం చేశారు. తదుపరి నటభైరవి రాగంలో RTP స రి గ మ ప ద ని స పాడెద – సాధన లో తరియించెద అన్నపల్లవిని గ్రహభేదం ద్వారా ఖరహరప్రియలో కూడా వినిపించి తన సంగీతజ్ఞానాన్ని తెలియజేశారు. రేవతి రాగ తిల్లానతో ముగిసిన సభలో సహకారవాద్య కళాకారులు సమయోచితంగా సహకరించి రాగాలాపనలలో, లయవిన్యాసంలో తమ ప్రతిభను చక్కగా ప్రదర్శించారు.

చివరిరోజు 01-12-24 నాటి సాయంత్రం తుఫాను కారణంగా ప్రకటించిన కళాకారులు రాలేనిస్థితిలో అప్పటికప్పుడే అకాడమి కోరికను మన్నించి తనవీణాగానాన్ని కుమార్తె కుమారి భమిడిపాటి వీణాధరి సహకారంతో అందించడానికి అంగీకరించిన డా. భమిడిపాటి కనకదుర్గా ప్రసాద్ గారికి అకాడెమి ధన్యవాదాలు తెలియజేసింది. శ్రీ సి.హెచ్.దుర్గాప్రసాద్ గారు కళాకారులను సభకు పరిచయం చేయగా, ఆనాటి ప్రాయోజకులు శ్రీమతి మల్లాప్రగడ లత అనిసింగరాజు గారు కళాకారులను సత్కరించారు. అనంతరం మృదంగంపై శ్రీ పారుపల్లి ఫల్గుణ్, ఘటంపై శ్రీ సరస్వతుల హనుమంతరావు సహకరించగా వైణికులు భైరవి అటతాళ వర్ణంతో సభను ఆరంభించారు. తరువాత వరుసగా మోహన కల్యాణి రాగంలో "సిద్ధి వినాయకం", ఆనందభైరవి రాగంలో "రాగరత్న మాలికచే", కల్యాణి రాగంలో "పంకజలోచన", నళినకాంతి రాగంలో "మనవి ఆలకించ", కీర్తనలు సునాదభరితమైన వీణానాదంతో వినిపించారు. తరువాత ముఖ్యాంశంగా ఆభేరి రాగంలో "నగుమోము గనలేని" కీర్తనను ఎన్నుకొని, హమీర్ కల్యాణి, దేశ్, కనకాంగి, సముద్రప్రియ, గానమూర్తి రాగాలలో తానం వినిపించడం శ్రోతలను మురిపించింది. ఖమాస్ రాగంలో "అపదూరుకు లోనైతి" జావళి, కాపీరాగంలో తిల్లానా, మంగళం వినిపించి వార్షికోత్సవ వేడుకలను సుసంపన్నం గావించారు. శ్రీ పారుపల్లి ఫల్గుణ్, శ్రీ హనుమంతరావు కలసి జంటగా అందించిన లయ విన్యాసం ప్రశంసనీయంగా నడిచింది.

ఆరు రోజులపాటూ ప్రతిరోజూ యథావిధిగా సమీక్షనందించారు డా. పేరాల బాలమురళీకృష్ణ గారు. వేడుకలో పాల్గొన్న కళాకారులకు, సభల ప్రాయోజకులకు, అధికసంఖ్యలో విచ్చేసిన ప్రేక్షకులకు, పాత్రికేయులకు కార్యదర్శి శ్రీ చంద్ర శేఖర్ ధన్యవాదాలు తెలియజేయడంతో విశాఖ మ్యూజిక్ అకాడెమి 55వ వార్షికోత్సవ సంగీతసభలు విజయవంతంగా ముగిశాయి.


**వియెస్సెన్మూర్తి ,** విశాఖ మ్యూజిక్ అకాడెమి

# విశాఖ మ్యూజిక్ అకాడమీ 55వ వార్షిక ఉత్సవ దృశ్యావళి
























# పరవశింపజేసిన 'భజరే గోపాలం'



భజరే గోపాలం నామసంకీర్తన ప్రేక్షకులను పరవశింపజేసింది. మెరైన్ఇంజనీర్ లింగం చంద్రశేఖర్, గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో గుంటూరు బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య కళావేదికపై 14-12-2024 శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. చెన్నైకి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, నాదోపాసకులు శ్రీరామపాద భాగవతార్, రమా శ్రీరామ్, గోకుల్ కృష్ణ, విక్రమ్, హరిహరన్ లు తమ గాత్ర ధారణలో వాగ్గేయకారుల సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. శ్రీరామపాదకు, శ్రీమతి గాత్ర సహకారం అందించగా, హార్మోనియంపై రాజారాం, మృదంగం గోపాల్, డోలక్ సాకేతరాం చక్కటి వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా నామసంకీర్తన కళాకారులను ఆలయ పాలక వర్గం, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



**ఘంటసాల గాయకుడు 'ఏ'గ్రేడ్ విద్వాంసులు**
**శ్రీ అంగాడి శివప్రసాద్ కు**
**ఘంటసాల 102వ జన్మదినోత్సవ వేడుకల్లో విజయవాడలో**
**4.12.2024 న జరిగిన సత్కారం.**

## శ్రీ పెద్దాడవారికి నివాళి



ప్రముఖ ఇంజనీరు, సంగీత ప్రియులు, రికార్డింగ్ నిపుణులు శ్రీ పెద్దాడ సత్య రామచంద్రరావు 7.12.24న దివంగతులయ్యారు. ది.18.12.24న కాకినాడ సూర్యకళా మందిరంలో వారి సంస్మరణ సమావేశం జరిగింది.వీరు ప్రముఖ గాయని శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి గారి భర్త. సరస్వతీ గానసభ ఉపాధ్యక్షులు శ్రీ లక్కరాజు సత్యనారాయణ జ్యోతి వెలిగించి సంస్మరణ సభ ప్రారంభించారు. కార్యదర్శి శ్రీపేపకాయల రామకృష్ణ, శ్రీమునుగంటి వెంకటరావు, శ్రీ పి. విశ్వనాథ్, సి.హెచ్.రామనాథం, శ్రీమతి చావలి సూర్యకుమారి, స్థానిక సంగీత ప్రియులు, కళాకారులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు.

# పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి 142 వ జయంతి వేడుకలు



బెజవాడ రామకోటిలో 5 రోజులపాటు గాయక సార్వభౌమ సంగీత పరిషత్ నిర్వహించింది. 5-12-2024 పారుపల్లివారి జన్మదినాన, విజయవాడ ఆకాశవాణిలో పంతులుగారి చిత్రపటాన్ని శ్రీ అన్నవరపు రామస్వామిగారు ఆవిష్కరించారు. కేంద్ర సంచాలకులు శ్రీ B వెంకటేశ్వర్లు గారు, కేంద్రడిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ సోమేశ్వరరావుగారు, స్థానిక విద్వాంసులు కొందరు హాజరయ్యారు.



5-12-24 న కచేరీ చేసిన సుధీర్ శర్మ గారిది శ్రుతి శుద్ధమైన గాత్రంతో, భక్తితో తనువు మరచి పాడే పాట. ఆయన సంగీతం అంటే ప్రాణం ఇచ్చే వ్యక్తి. వృత్తి దేవతార్చన, ప్రవృత్తి సంగీతం. ఈ జన్మలో కఠోర సాధన చేస్తే వచ్చే జన్మలో పుట్టుకతో సంగీతం అబ్బుతుందనే నమ్మకం ఆయనది. తాను సమాజంలో పేరుప్రతిష్ఠలు ఉన్న పెద్దల కోసం, విదేశీయుల కోసం వారాహి, ప్రత్యంగిరా యాగాలు, హోమాలు చేసి, వారిచ్చిన సొమ్మును సంగీతానికి ఖర్చుచేయటం ఆయన నిత్యకృత్యం. నిత్యం పెద్దల సంగీతం వింటూ, క్రొత్త కృతులు నేర్చుకుంటూ విద్వాంసులను ఆరాధిస్తారు.

ఈనాటి కచేరీలో మనోధర్మ సంగీతానికి కాక, అరుదుగా వినిపించే రచనలకు ఆయన ప్రాధాన్యతను ఇచ్చారు. వాద్య సహకారం అందించిన వారూ యువకులే.. చక్కని సహకారం ఇచ్చారు. కేవలం సంగీత విద్వాంసులనే కాకుండా సంగీత ఆరాధకులను, పోషకులను కూడా గౌరవించాల్సిన బాధ్యత సంస్థకు ఉంది కనుక, GSS పరిషత్ సుధీర్ శర్మ గారిని ఘనంగా సత్కరించింది. పెద్దలు అన్నవరపు గురువుగారు సత్కార కార్యక్రమం నిర్వహించి,ఆసాంతం కచేరీ విని,కళాకారులను ప్రశంసించారు.” సునాద సుధానిధి “ బిరుదాన్ని శ్రీ అన్నవరపు రామస్వామిగారి చేతుల మీదుగా సుధీర్ శర్మ గారికి అందించటం జరిగింది.

**రెండవరోజు కార్యక్రమం :** శ్రీమతి కమలదీప్తి గారి గానం శ్రీమతి దుర్గాభవాని- వయొలిన్ శ్రీ సద్గురుచరణ్- మృదంగం శ్రీ హరిబాబు-ఘటం.



శ్రీమతి కమలదీప్తి నిజంగా శ్రోతలను మంత్ర ముగ్ధుల్ని చేశారు. శ్రమ లేకుండా పాడగల మధుర గాత్రం ఆమె సొత్తు. ఎక్కడా రాజీ పడకుండా తను నేర్చి,సాధన చేసిన విద్యను ఆమె అద్భుతంగా ప్రదర్శించారు. ముందుగా భైరవి అటతాళవర్ణంతో ఆరంభించి, స్వల్ప కల్పనా స్వరాలతో అలరించారు. అఠాణా రాగంలో

దీక్షితులవారి కృతి “హేరంబాయ నమస్తే” పాఠం చిక్కగా ఉంది. అందులోనూ నాలుగు స్వరాలు వేసి, రక్తిని నిలిపారు. తన గురువుగారైన TN శేషగోపాలన్ గారి మార్కు చూపుతూ “వాంఛ తోను నా వగలు దెల్పవే “కర్ణరంజని” కీర్తన,గాయని నోట సార్ధకతను సంతరించుకుంది. లలిత రాగంలో “నన్ను బ్రోవు లలితా!” ఎంతో ఆర్తిగా గానం చేశారు. ఈరోజు ముఖ్యంగా చెప్పుకోవాలసిన అంశాలలో “హమీర్కల్యాణి “ఆలాపన” మానము లేదా!” కీర్తన, స్వరప్రస్థారం ఉన్నాయి. శ్వాసను దీర్ఘంగా నిలిపి, రాగాన్ని మంద్ర, మధ్యమ తార స్థాయిలలో సంచరిస్తూ పొడవైన సంగతులుగా సమర్పించటం ఎంతో బాగుంది. ఇక ఈనాటి ముఖ్యాంశం తోడి రాగం, తానం, పల్లవి. తోడిరాగంలో ఏ సంగతినీ విడువక విస్తారంగా పాడి, రిషభం నుండి గ్రహభేదం చేసి, మోహనకళ్యాణి రాగాన్ని చూపిన వైనం ఆకట్టుకుంది. తానం శ్రోతలను ఆనందాంబుధిలో తానమాడించింది. సందర్భోచితంగా పంతులుగారి జయంతి కనుక, “శ్రీ రామకృష్ణ గురుమ్ వందే ! శిష్య వాత్సల్యాది సద్గుణ సాంద్రం! గాయక సార్వభౌమం” అనే ద్విపదగర్భ పల్లవిని ఖండ అటతాళంలో మూడు తాళ అంగాలను వరుసగా త్రిశ్ర, ఖండ, చతురస్ర నడకలలో నడుపుతూ ఎంతో సమర్ధవంతంగా చిరంజీవి కమలదీప్తి గానం చేశారు. RTP కి ఉండవలసిన అన్ని హంగులను ప్రదర్శిస్తూ చివరలో రాగమాలికా స్వరాలు కేదారం, రంజని, భాగేశ్వరి రాగాలలో వేయటం గాయని ప్రతిభకు నిదర్శనం. ఎంతో కష్టతరమైన పల్లవిని అలవోకగా పాడారావిడ. ఈరోజు సద్గురుచరణ్ గారు పల్లవికి మరింత వన్నె తెస్తూ తని ఆవర్తనంలో మోహరా, ముక్తాయిలలో “శ్రీ రామకృష్ణ గురుం..” అనే అక్షర వరుసను జతిలో చూపుతూ చేసిన ప్రయోగం అనుపమానం. హరిబాబుగారి ఘటం తని కి మరింత సొబగు చేకూర్చింది. శ్రీమతి BV దుర్గా భవాని గారి వయొలిన్ అనుసరణ ఆమె అపార అనుభవానికి ప్రతీకగా నిలిచింది. చివరగా తాను వరం రాగంలో స్వరపరచిన “ఇతడే పర బ్రహ్మం ఇదియే రామకథ” అనే అన్నమయ్య కీర్తనను సాహిత్య స్పష్టతతో కమలదీప్తి వినిపించారు. మూడు గంటలు ఎలా గడచిపోయాయో తెలియలేదు. అన్నవరపు రామస్వామి గురువుగారు కచేరీ ఆసాంతం విని, నేటి కళాకారులకు ప్రశంసలను ఇచ్చారు.



7-12-24 న శ్రీ సాతూర్ కృష్ణ రామరత్నం గారి గాత్ర కచేరీ జరిగింది. ఆస్ట్రేలియా లో ఉంటూ డిసెంబర్లో భారత్ కు వచ్చి, చెన్నైలో కచేరీలు చేసి, అక్కడి గురువుల దగ్గర తన సంగీతాన్ని మెరుగుపరుచుకుంటూ వస్తున్న తమిళ విద్వాంసులు సాతూర్ కృష్ణరామరత్నం గారి గానం జనరంజకంగా సాగింది. బెజవాడలో సంగీత గురువుల జయంతిలో, శృంగేరీ గురువుల క్షేత్రంలో పాడటం ఆయనకు దక్కిన భాగ్యంగా భావించి, బహుశః బిలహరిలో “ఇంతకన్నా ఆనందమేమి?” అంటూ సద్గురు త్యాగరాజ కృతితో తన కచేరీ ఆరంభించారేమో ఆయన! చక్కని స్వరకల్పన రక్తిగా సాగిన అనంతరం, చంద్రజ్యోతి రాగాన్ని ఆలపించి,” బాగాయెనయ్యా! నీ మాయలెంతో” అంటూ త్యాగయ్య గారి అపురూప కృతిని గానంచేశారు. సరసాంగిలో స్వాతితిరుణాల్ కృతి తరువాత సాంప్రదాయబద్ధంగా రీతిగౌళ రాగాన్ని ఆవిష్కరించి, సుబ్బరాయశాస్త్రి గారి కృతి “జననీ! నినువనా “లో ఆసక్తికర స్వర ప్రస్తారం చేశారు. ముందురోజులాగే మళ్లీ తోడి ప్రధానాంశం. దీక్షితులవారి “శ్రీ కృష్ణం భజ మానస “ చౌకకాల కృతిని, 'శంఖ చక్ర గదాంబుజ'.. దగ్గర నెరవు పాడి,చక్కని స్వరవిన్యాసం చేశారు. గాయకుని శ్రుతి రెండున్నర. (సాధారణంగా ఒకటిన్నర వరకే పాడటం

చూస్తూ ఉంటాం) అయితే రామరత్నం గారి గొంతు అంత శ్రుతి లోనూ నల్లేరుమీద నడకలా సాగటమే కాదు; కొద్దిగా పెచ్చు కూడా పలికింది కొన్ని స్వరాలలో.. ఆయన మంచి మనో నిబ్బరంతో తన విద్వత్తును ప్రదర్శించిన తీరు ప్రశంసార్హం. జయభాస్కర్ గారి లయతో శివతాండవం చేయించారు. హరిబాబుగారి ఘటం దీటుగా సాగింది. నందకుమార్ గారి తోడి ఆలాపన ఎంతో బాగుంది. జావళి, బాలమురళి గారి కదనకుతూహల తిల్లానాతో కచేరీ ముగిసింది. యువ కళాకారులను ప్రోత్సహించాలనే సంస్థ ప్రధానోద్దేశ్యం నెరవేరింది.



నాల్గవరోజు మోదుమూడి సుధాకర్ గాత్ర కచేరీ జరిగింది. చిరంజీవి మల్లాజోశ్యుల శివతేజ –వయొలిన్ శ్రీకుందుర్తి అరవింద్ –మృదంగం.సుధాకర్,కచేరీలో ప్రధాన అంశంగా భైరవి రాగంలో “బాలగోపాల పాలయాశుమాం” దీక్షితర్ కృతి పాడటం జరిగింది.హిందూస్థానీ రాగమైన మారు బేహాగ్ లో పారుపల్లివారిపై “గాయక సార్వభౌమా ! వరదాయక! సద్గుణ ధామా!” అనే రాగం–తానం–పల్లవిని శ్రోతలు ఆసక్తిగా విని హర్షధ్వానాలు ఇచ్చారు. అద్భుత ప్రతిభ కలిగిన చిరంజీవి శివతేజ (16) ను విజయవాడ శ్రోతలకు పరిచయంచేయటం సంస్థ ప్రధానోద్దేశ్యం. చాలా చక్కగా చిరంజీవి వాయించి, రసజ్ఞుల ప్రశంసలు అందుకున్నాడు. అరవింద్ మృదంగానుసరణ ఎంతో మృదుమధురంగా సాగింది. శ్రోతల హాజరీ ఈరోజు బాగుంది. తమ త్యాగరాజ గురుపరంపరకు నమస్కరిస్తూ బాలమురళిగారు కాపీ రాగంలో రచించిన “భావమే మహా భాగ్యమురా!” కృతితో కచేరీ ముగించారు. నగరంలో అదే రోజు ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నా, పరిషత్ సభకు అధిక సంఖ్యలో శ్రోతలు విచ్చేశారు.



“గాయక సార్వభౌమ” సంగీత పరిషత్, స్వరఝరి (విజయవాడ) సంస్థల ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 5 నాడు ఆరంభమైన శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి జయంతి, 9 వ తేదీన పంతులుగారి ప్రియ శిష్యులు, పద్మశ్రీ అన్నవరపు రామస్వామి గురువుగారి వయోలా కచేరీతో దిగ్విజయవంతమైనాయి. 99 సంవత్సరాల వయస్సులో అపర భీష్మాచార్యునిలా వాయులీనాన్ని చేతబూని, శరపరంపరగా రాగవృష్టి కురిపించారు ఆ నాదతపస్వి. వాతాపి గణపతిం భజే, బ్రోచేవారెవరే, సుజన జీవనా, మరుగేలరా కృతులను పాడినట్లే, సాహిత్యాన్ని కమాను కదలికలలో పలికించారు. హంసధ్వని రాగంలో ఒక అక్షర విన్యాసంతో పట్టువిడువని లయజ్ఞానంతో ఆ వయస్సులో ఆయన చేసిన స్వరప్రస్తారం అనన్యసాధ్యం. గురువుల బాటను అనుసరిస్తూ శ్రీమతి BV దుర్గా భవాని, శ్రీ పెరవలి నందకుమార్ గార్లు ప్రధానాంశంగా పంతువరాళి రాగాన్ని,” వాడేరా దైవము మనసా!” అన్న త్యాగయ్య కృతిని తీసుకొని, సుమారు గంటసేపు శ్రోతలను పరవశింప చేశారు. శహన, షణ్ముఖప్రియ, బిందుమాలిని, వాసంతి, సూర్య, కాపీ రాగాలను స్వరమాలికగా చేసి, సమర్పించారు. శ్రీ పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగం, శ్రీ మార్టూరు హరిబాబుగారు ఘట సహకారాలు, కచేరీ స్థాయిని హిమోన్నతం చేశాయి.

## గాయత్రీ మహిళా సంగీత సన్మండలి - గుంటూరు లో శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య 141వ జయంతి





డిసెంబర్ 7న గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి సందర్భముగా వారి స్మారక అవార్డును శ్రీమతి పాతిబండ్ల జానకిగారికి పద్మశ్రీ అన్నవరపు రామస్వామివారి చేతుల మీదుగా అందజేశారు. డా. నీలిమ జ్యోతి ప్రజ్వలన చేసి సభకు శుభాకాంక్షలు అందజేశారు.

విదుషీమణి శ్రీమతి కార్తీక అనఘ గాత్ర సంగీత కచేరి బేహాగ్ వర్ణంతో ప్రారంభం అయ్యింది. వసంత రాగంలో గౌరీ సుకుమారి, శ్రీరంజనిలో మారుబల్క, వాంఛతోను మొదలగు కీర్తనలు రంజకంగా వినిపించారు. శ్రీమతి బి.వి. దుర్గాభవాని శ్రీ సురేష్ బాబు చక్కని సహకారాలు అందించారు. కార్యదర్శిని శ్రీమతి శేషురాణి స్వాగతం పలికారు.

## టి.టి.డి తిరుప్పావై ప్రవచన ప్రారంభ సమావేశం





16.12.24 న తిరుపతి అన్నమాచార్య కళామందిరం లో జరిగింది. శ్రీ శ్రీ శ్రీ పెద జియ్యంగారు ఆశీస్సులందించారు. గాయనీమణి విదుషి శ్రీమతి ద్వారం లక్ష్మి తిరుప్పావై పాశురగానం చేయగా, గారు, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ శ్రీరాజగోపాల్ గారు, విద్వాన్, కేంద్రీయ సంస్కృతవిద్యా పీఠ అధినేత ప్రొ॥రంగనాథన్ గారు, దివ్య ప్రబంధ ప్రాజెక్టు కార్యాలయ నిర్వాహకులుశ్రీ పురుషోత్తం పాల్గొన్నారు. శ్రీమతి లక్ష్మి, రమణ దంపతులకు స్వామి వారి ఆశీస్సులు సన్మాన పూర్వకంగా అందించారు.

# సరస్వతీ గానసభ (రి), కాకినాడ వారి 121వ వార్షిక సంగీత, నృత్య, నాటకోత్సవాలు





సరస్వతీ గానసభ (రి), కాకినాడ వారి 121వ వార్షిక సంగీత, నృత్య, నాటకోత్సవాలలో భాగంగా రెండవ విడత (II phase), ది.28-11-2024, గురువారం నుండి 01-12-2024, ఆదివారం వరకూ స్థానిక సూర్యకళా మందిరంలో నాలుగు రోజులపాటు జరిగాయి.

సరిగ్గా 6-30 ని:లకు కార్యక్రమాలను ప్రారంభిస్తూ సంస్థ అధ్యక్షులు శ్రీ K.V.S. ఆంజనేయమూర్తి గారు విచ్చేసిన శ్రోతలకు ఆహ్వానం పలికారు .

28-11-2024, గురువారంనాడు మొదటి రోజు కార్యక్రమం: త్రిచూర్ సోదరులు...శ్రీ కృష్ణమోహన్, శ్రీ రామ్ కుమార్ మోహన్ ల గాత్ర కచేరి.

శ్రీ విశ్వేష్ చంద్రశేఖర్, చెన్నై- వయోలిన్, శ్రీ కిషోర్ రమేష్, చెన్నై – మృదంగం, శ్రీ సుశీల్ కుమార్, చెన్నై – కంజీర లపై సహకరించారు. ఈ కార్యక్రమాన్ని స్వర్గీయ శ్రీమతి నాగమణి, డా. ఐ. వి. జోగారావు దంపతుల సంస్మరణగా వారి కోడలు, కుమారుడు శ్రీమతి రాజ్యలక్ష్మి, డా. ఇవటూరి సన్యాసిరాజు దంపతులు ఏర్పాటు చేశారు. సంస్థ కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ కళాకారులను వేదిక మీదకు ఆహ్వానించారు. ముందుగా సంప్రదాయాన్ని అనుసరించి దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఆనాటి కళాకారులు, స్పాన్సర్ల తరపున కాకినాడలోని ప్రఖ్యాతవైద్యులు శ్రీ ఐ.వి. రావు, వారి సతీమణి శ్రీమతి మీరా మరియు సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

కళాకారులను కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ సభకు పరిచయం చేసిన తరువాత కచేరీ ప్రారంభమైంది.

మొదటిగా షణ్ముఖప్రియ రాగంలో "ఓంకార ప్రణవనాద " అనే శ్రీ బాలమురళీ కృష్ణ విరచిత పద వర్ణంతో కచేరీ ప్రారంభం చేశారు. తరువాత "మహా గణపతిం" అనే దీక్షితర్ వారు నాట రాగంలో రచించిన కీర్తనను మనోహరంగా ఆలపించారు. ఆ తరువాత ముత్తుస్వామి దీక్షితర్ వారిదే హుసేని రాగంలో కూర్చిన "శ్రీ కాళహస్తీశ" అనే పంచ భూతలింగ కృతులలోని నాల్గవదైన కృతిని వినిపించారు. ఆపైన, ఆహిరి రాగంలో శ్యామశాస్త్రివారి... "మాయమ్మ అని పిలిచితే" అనే కీర్తనను, త్యాగరాజ స్వామివారు అఠాణా రాగంలో కూర్చిన "అనుపమ గుణాంబుధే", అనే కీర్తనను వీనులవిందుగా గానం చేశారు

తరువాత ఆందోళిక రాగంలో త్యాగరాజుల వారి "రాగ సుధారస పానము జేసి" అనే కీర్తనను విస్తారంగా ఆలపించారు. ఈ కీర్తనకు వారు చేసిన స్వర కల్పన శ్రోతలను మైమరపింపచేసింది. ఆపై శివరంజని రాగంలో "గంగ జటాధర గిరిజా" అనే పల్లవితో వారు గానం చేసిన రాగం తానం పల్లవి శ్రోతలందరినీ ముగ్ధులను చేసింది కచేరీ ఆసాంతం వాయిద్య సహకారం అందించిన కళాకారుల





ప్రతిభ విలువకట్టలేనిది. చివరిగా ఆదిశంకరాచార్యుల వారి భజగోవింద శ్లోకాన్ని ఒకదాన్ని వినిపించి, అన్నమాచార్యుల వారి రేవతి రాగంలోని "నానాటి బ్రతుకు నాటకము" అనే కృతితో కచేరీని ముగించారు.

చక్కటి గాత్రధర్మం, సంప్రదాయ బద్ధమైన సంగీత నేపథ్యం కలిగిన త్రిచూర్ సోదరుల కచేరీ కాకినాడ శ్రోతలకు ఆనందాన్ని కలిగించిందనడంలో సందేహం లేదు.

**29-11-2024, శుక్రవారం (రెండవరోజు)**

సంగీత నృత్య నాటకాది కళారూపాల్లో సరికొత్త ప్రయోగాలను ప్రోత్సహించే సరస్వతీ గానసభ, రెండవరోజు కార్యక్రమంగా 132 సంవత్సరాల చరిత్ర కలిగి, తెలుగువారందరికీ నాటకం పేరు చెబితే చాలు.. జ్ఞాపకానికొచ్చే గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కం' నాటకంలోని పాత్రలన్నీ మహిళా మణులే పోషించిన కొన్ని అంకాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

నిజంగా ఇది కొత్త ప్రయోగం. దశాబ్దాలుగా తెలుగునాట ప్రజలహృదయాలలో పాతుకుపోయిన గిరీశం, రామప్పంతులు, అగ్నిహోత్రావధనులు, కరటక శాస్త్రి, సౌజన్యారావు పంతులు, వెంకటేశం వంటి పురుష పాత్రలను స్త్రీలు ధరించి మెప్పించడం ఆషామాషీ వ్యవహారం కాదు. అటువంటి సవాలును స్వీకరించి, 'విజయసూర్య ఆర్ట్స్ అసోసియేషన్', విజయనగరంవారు శ్రీ ఈపు విజయ్ కుమార్ గారి దర్శకత్వంలో నాటకానికి న్యాయం చేకూర్చారనే చెప్పాలి.

నాటకంలోని 'బొంకులదిబ్బ సీను', మధురవాణి ఇంటి సీను (పూట కూళ్ళమ్మ వచ్చేసరికి రామప్పంతులు, గిరీశం మంచం క్రింద దాక్కునే గొప్ప హాస్య సన్నివేశం), రామప్పంతుల ఇంట్లో సన్నివేశం ( గిరీశం, వెంకటేశంల ఇంగ్లీషు సంభాషణ), చివరిగా సౌజన్యారావు పంతులు ఇంట్లో మధురవాణి, సౌజన్యారావుల మధ్య నడిచిన సన్నివేశం... మొత్తం నాలుగు అంకాలు ప్రదర్శించారు (మధురవాణి నవ్వు(లొట్టిపిట్టల సీన్) లేదని ప్రేక్షకులు కొంచెం బాధపడ్డారు.)

ఈ కార్యక్రమాన్ని సంస్థ కార్యవర్గ సభ్యులలో ఒకరైన శ్రీ చోడే అనిల్ కుమార్ గారు, వారి తల్లిదండ్రులు శ్రీమతి చోడే అన్నపూర్ణమ్మ, శ్రీ చోడే పరశురామ్ గార్ల జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు.

**30-11-2024, శనివారం (మూడవ రోజు)**

కార్యక్రమం ఓ. ఎస్. అరుణ్, చెన్నై, వారి గాత్ర కచేరి అద్భుతంగా సాగింది.

గంభీర నాట రాగంలో బాలమురళీకృష్ణ గారి 'అమ్మ ఆనంద దాయిని' వర్ణంతో ప్రారంభించి, హంసధ్వని రాగంలో ముత్తుస్వామి దీక్షితుల వారి వాతాపి, సౌరాష్ట్ర రాగంలో రంగనాధుడే మొదలైన కృతులు గానం చేసి సంగీత ప్రియులకు వీనుల విందు చేసారు,

వీరికి వయోలిన్ పై మావుదూరి సత్యనారాయణ శర్మ, ఆముదాలవలస, మృదంగం పై పారుపల్లి ఫల్గుణ్, విజయవాడ, ఘటంపై హరిబాబు, గుంటూరు, చక్కటి సహకారాన్ని అందించారు.

**01-12-2024, ఆదివారం (నాల్గవ రోజు)**

కుమారి ఆర్.లక్ష్మీ ప్రియ(విశాఖ) గాత్రకచేరి జరిగింది. నాటకురంజి వర్ణం, ప్రణమామ్యహం, నిరవధి సుఖదా వంటి అంశాలువ ప్రదర్శించారు. కుమారి అంబటిపూడి కామాక్షి వైలన్ పై,శ్రీ ఎమ్.ఏడుకొండలు మృదంగం పై సమర్థమైన సహకారం అందించారు. ఈ గాయని భవిష్యత్తులో మరింత రాణించగలదనే నమ్మకం కలుగ జేసింది. కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ సభకు సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు.





# విజయవాడలో డిశంబరు 6 నుండి 8 వరకు కృష్ణవేణి సంగీత సమారోహం


కృష్ణవేణి సంగీత సమాహారం కచేరీల నేపథ్యంలో శ్రీ తాడేపల్లి లోకనాధశర్మ సంగీతకచేరి.


శ్రీమతి మాలాచంద్రశేఖరం – వేణుగానం


శ్రీ జొన్నలగడ్డ శ్రీరాం బృందం – నామ సంకీర్తనం


శ్రీ మోదుమూడి సుధాకర్ – గాత్ర సంగీత సభ


శ్రీమతి జయంతి సావిత్రి – హరికథ

# హైదరాబాద్ నగరంలో శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు మరియు నేతి లక్ష్మీనారాయణ భాగవతుల జయంతి హరికథా మహోత్సవములు





'హరికథా కేసరి' కీ. శే. నేతి లక్ష్మీనారాయణ భాగవతులు [1897-1979]

ఆదిభట్ల నారాయణదాస 160వ మరియు వారి ప్రియశిష్యులు నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 126వ జయంతి హరికథా మహోత్సవములు డిసెంబర్ 7వ తేదీ శనివారం నుండి 12వ తేదీ గురువారం వరకు 5 రోజులపాటు హైదరాబాద్ నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకరమఠం ప్రాంగణంలో ఘనంగా జరిగాయి.

మొదటిరోజు ఉత్సవములను అన్నమయ్య పరివారము వ్యవస్థాపకుడు శ్రీ యనమండ్ర వెంకట కృష్ణయ్య, నేతి కుటుంబము నుండి చావలి కామేశ్వరరావు, కోమల దంపతులు (కెనడా వాత్సవ్యులు), శ్రీ వి. శ్రీరామ్ భట్టార్ భాగవతలు మరియు శ్రీ బుర్రా పద్మనాభశర్మ భాగవతలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా యనమండ్ర వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నారాయణదాసు గారు తెలుగు సంస్కృతి చరిత్రలోనే కాదు భారత సంస్కృతి చరిత్రలోనే అపూర్వ వైశిష్ట్యం కలవారని, ఒక్కొక్క రంగంలో ప్రావీణ్యం ఉన్నవారు ఎందరో ఉండవచ్చు కానీ 'ఆటలో పాటలో మాటలో మేటి' అనిపించుకున్నవారు అరుదుగా ఉంటారని, దాసుకు పూర్వం హరికథా చాయలు ఉన్నా దానికి ఒక సమగ్రమైన స్వరూపము, ఉన్నతమైన పీఠం, విశాలమైన పరిధి సంతరించి పెట్టినవారు నారాయణదాసని, వారి పాండిత్యం అనేకమైన భాషలకు, శాస్త్రాలకు సంబంధించినదని, ప్రావీణ్యం బహు కళలకు విస్తృతమైనదని, వ్యక్తిత్వం విశిష్టమైనదని, జీవితం స్వతంత్రమైనదని తెలియచేశారు. దాసుగారు సంస్కృతాంధ్రాలలో మహాకవి, హరికథకు సృష్టికర్త, అచ్చతెలుగుకు

అశ్వత్థవృక్షం, మహానటుడు, గంధర్వ గాయకుడు, సకలశాస్త్ర పారంగతుడు, వీణావాదన విశారదుడు, అష్టభాషాకవి మరియు బహుభాషావేత్తయని, ఈ పరమ భక్తాగ్రేసరుడు హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో మన తెలుగు ప్రజలకు దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహోపాధ్యాయుడని కూడా కొనియాడారు. దాసుకి నేతి లక్ష్మీనారాయణ మీద పుత్రవాత్సల్యమని, శిక్షణ పూర్తికాలము నేతివారికి నారాయణదాసు గారు ఇంట్లోనే వసతి సదుపాయాలు కల్పించిన గొప్ప వ్యక్తియని గుర్తు చేశారు.

నేతివారి మనుమడు, గుంటూరులోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ దాసుగారు భారతావనిలో అవతరించిన అపర శారదావతారమనీ, 1923లో కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సమావేశములో దాసుగారి 'రుక్మిణీ కళ్యాణము' హరికథా గానము విన్న సరోజినీదేవి "మీ నృత్యం అద్భుతంగా ఉంది" అని శ్లాఘించినారని, అదే సంవత్సరం ఇంగ్లండులో జరిగిన ఎంపైర్ ఎక్సిబిషన్ నకు భారతీయ సంగీతమునకు ప్రతినిధిగా దాసుగారిని ఎంపిక చేసారని శ్రోతలకు తెలియచేశారు.

7వ తేదీన శ్రీమతి వై. శిఖామణి భాగతారిణి (రామచంద్రాపురం) 'భక్త ప్రహ్లాద', 8వ తేదీన శ్రీమతి జి. మునిలక్ష్మి భాగతారిణి (తిరుపతి) 'భక్త మార్కండేయ', 9వ తేదీన శ్రీ ఎస్. చిరంజీవాచార్యులు భాగవతులు (నిజామాబాద్) 'ద్రౌపదీ స్వయంవరం' , 10వ తేదీన శ్రీమతి సప్పా భారతి భాగతారిణి (ఏలూరు) 'భక్త అంబరీష' మరియు 12వ తేదీన శ్రీ బుర్రా పద్మనాభశర్మ భాగవతులు (విజయవాడ) 'శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం' హరికథాగానములు చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు. సర్వశ్రీ డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి (విజయవాడ), భాగవతుల సీతాపతిరావు (హైదరాబాద్) వయోలిన్ పైన; ఆర్. సుధాకర్ (ఖమ్మం), కే. చిదంబర నటరాజ్ కుమార్ (హైదరాబాద్) మృదంగం పైన మరియు జి. నటరాజ్ (తిరుపతి) తబలపైన చక్కని వాయిద్య సహకారం అందించారు.

ఉత్సవాలు ఆఖరి రోజు 12వ తేదీనాడు పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీమతి దాలిపర్తి ఉమామహేశ్వరి భాగతారిణికి నిర్వాహకులు ముఖ్య అతిధి శ్రీ ప్లాంజేరి శంకరనారాయణ (వ్యవస్థాపకులు – ప్లాంజేరి ఫౌండేషన్ , హైదరాబాద్) గారి చేతుల మీదుగా 'హరికథా సరస్వతి' బిరుదు, పారితోషికం మరియు పట్టు వస్త్రములతో ఘనంగా సత్కరించారు. శ్రీ శృంగేరి శంకరమఠం శాఖాధికారి శ్రీ కృష్ణారావు గారు అమ్మవారి పసుపు, కుంకుమ





మరియు వస్త్రములతో సన్మానగ్రహీత శ్రీమతి ఉమామాహేశ్వరిని సత్కరించారు. సన్మాన గ్రహీత శ్రీమతి ఉమామాహేశ్వరి భాగతారిణి మాట్లాడుతూ తనకు ఎన్నో బిరుదు సత్కారములు వచ్చినా నారాయణదాసు మరియు వారి ప్రియశిష్యులు నేతి లక్ష్మీనారాయణ భాగతుల పేరిట అందుకున్న పురస్కారం ఎంతో విలువైనదని, అందుకు తాను ధన్యురాలని పేర్కొన్నారు. ముఖ్య అతిధి శ్రీ ప్లాంజేరి శంకరనారాయణ మాట్లాడుతూ నేతివారు దాసుగారి వద్ద స్వయముగ 12 హరికథలు వరకు నేర్చుకొన్న ధన్యులని, వీరు గురువులకు 1951లో విజయవాడలో విగ్రహప్రతిష్ఠ చేసిన ప్రాంగణములో గత 74 సంవత్సరములుగా శిష్య ప్రశిష్య బృందము ప్రతీ సంవత్సరము దాసుగారి జయంతి మరియు వర్ధంతి ఉత్సవములు జరుపుట అభినందనీయమని; హరికథా సంప్రదాయాన్ని, పరంపరను దాసుగారి ప్రియశిష్యులు నేతి లక్ష్మీనారాయణ కొనసాగించినట్లు నేటి తరం హరిదాసులు కూడా కొత్త శిష్యులను తీర్చిదిద్ది సనాతనమైన ఈ హరికథలను భావితరాల వారికి అందచేయవలసిన భాద్యత తీసుకోవాలని తెలియచేశారు.

హరికథా రంగం నుండి సర్వశ్రీ బోడిగ లక్ష్మీనారాయణ భాగవతలు, జే. జయరాం భాగవతలు, వి. శ్రీరామ్ భట్టార్ భాగవతలు, మల్లంపల్లి సుబ్రహ్మణ్య శర్మ భాగవతలు, కాకర్ల హనుమంతరావు భాగవతలు, వి. నాగరాణి భాగతారిణి మరియు నేతి కుటుంబము నుండి సర్వశ్రీ పాండురంగశర్మ, విశ్వేశ్వరరావు, నటరాజ శర్మ దంపతులు; లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, హరినారాయణ, దినకర్, శారద, ఉమాదేవి, సుజాత, లహరి దంపతులు మున్నగువారు ఉత్సవములలో పాల్గొని జయప్రదం చేశారు.

ఈ హరికథా మహోత్సవములు అన్నమయ్య పరివారము, నేతి కుటుంబము మరియు ప్లాంజేరి ఫౌండేషన్, హైదరాబాద్ వారి సంయుక్త నిర్వాహణలో శోభాయమానంగా జరిగాయి.

**... గండూరి శారద**

**1.12.2024 విజయవాడలో... వైణికులు,విశ్రాంత ప్రిన్సిపల్ శ్రీ కె.ఎస్.గోవిందరాజన్ సమ్మాన మహోత్సవం.**




**ప్రభుత్వ నృత్యసంగీత కళాశాల ప్రిన్సిపల్ గా పదవీ విరమణ చేసిన వైణికులు శ్రీ కె.ఎస్. గోవిందరాజన్ సమ్మాన మహోత్సవ దృశ్యం. పద్మశ్రీ అన్నవరపు రామస్వామి "స్వర్ణకంకణ" ధారణ చేయగా, విద్వాన్ శ్రీ ఎన్.సిహెచ్. బుచ్చయాచార్యులు సభకు అధ్యక్షత వహించారు, సాంస్కృతికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఆం.ప్ర శ్రీ పెంచలయ్య ముఖ్య అతిథిగా విచ్చేసారు.**

# 'పద్మశ్రీ' ఎల్లా వారి సంగీత ప్రస్థాన ప్రయాణంలో జూబ్లి వేడుకలు





ప్రముఖ మృదంగ విద్వాంసులు పద్మశ్రీ పురష్కారితులు డా. ఎల్లా వెంకటేశ్వరరావు గారి సంగీత సేవను పురస్కరించుకొని డిసెంబర్ 14, 15 తేదీలలో హైద్రాబాద్ రవీంద్రభరాతీలో శిష్య ప్రశిష్యులు ఘనమైన సన్మానం చేసి గురుభక్తిని చాటుకొన్నారు. ఈ సందర్భంగా తేది 14.12.2024 మొదటిరోజున మొదటగా ''శ్రీమునిరత్నం'' మరియు లోకేశ్ బృందంచే నాదస్వర కచేరీతో ప్రారంభం, శ్రీ ఎన్. రామమూర్తి గారి కచేరి – గాత్రం, శ్రీ ఎల్లా అభిషేక్ – లయ విన్యాసం (మృదంగం), చి. గౌతం చే – మృదంగ లయవిన్యాసం, శ్రీమతి పద్మప్రియా – గాత్రం, శ్రీమతి డా. నీతా చంద్రశేఖర్ – గాత్రం, శ్రీ విశ్వనాథ్ పరశురామ్ – గాత్రం, శ్రీ జె.యస్. శ్రీరామ్ – గాత్రం, శ్రీమతి దుద్దు రాధిక – గాత్రం, శ్రీ కామేశ్వర శర్మ – మృదంగలయ విన్యాసం, డా. రాధా సారంగపాణి – గాత్రం, శ్రీ కె. నందకుమార్ – సితార్, శ్రీ పేరి త్యాగరాజు – వయోలిన్ – జుగల్ బంది, శ్రీ మల్లెల కాంతి స్వరూప్ – గానం, డా. శ్రీమతి యం.వి. కమలారమణి బృందంచే గాత్రం, డి.వి.కె. వాసుదేవన్ శిష్యబృందంచే గాత్రం మరియు వయోలిన్, శ్రీమతి. డా. శ్రీవిద్య – గాత్రం, డా. శేషులత బృందం – గాత్రం, శ్రీ బి. వైద్యనాధన్ – గాత్రం, శ్రీమతి అరుణ, పద్మ – యుగళ్ గాత్రం, శ్రీ ఎల్లా బాలమురళి – గాత్రం, శ్రీమతి ఇందిరా కామేశ్వరరావు, నేతి సరళ – గానము, డా. మండా అనంతకృష్ణ – వేణుగానం, శ్రీమతి బి. హరిప్రియ – గాత్రం, శ్రీద్వారం సత్యనారాయణరావు, పవన్ సింగ్ – వయొలిన్ సోలో, శ్రీ డి. రాఘవాచారి – గాత్రం,

పై కళాకారులకు వాద్య సహకారం అందించిన వారు

వయొలిన్ : శ్రీ బి.యస్. నారాయణన్, శ్రీ పెరవలి నందకుమార్, శ్రీ ఓ. రాజశేఖర్, శ్రీ బి. పవన్సింగ్, శ్రీ ఢిల్లీ ఆర్. శ్రీధర్.

డోలు : శ్రీ ఆర్. సత్యనారాయణ, శ్రీ ఈ. నాగరాజు అందించారు.

మృదంగం పై ఎల్లా వారి శిష్యులు, శ్రీ టి.ర్. సుందరేశన్, శ్రీ పెరవలి జయభాస్కర్, శ్రీ యన్. వాసుదేవ, శ్రీ డా. పి. శ్రీనివాస్ గోపాలన్, డా. బి.యస్.వి. ప్రసాదు, శ్రీ ధన్వాడ ధర్మారావు, శ్రీ నేతిరామకృష్ణ, శ్రీ విశ్వనాథ పరశరామ్, శ్రీ దూశి తారకరామ్, శ్రీమతి మెహర్ కళ్యాణి, శ్రీ నిరుపమ్, వారణాసి దుర్గానాథ్ లు సహకరించారు.

ఘటం – శ్రీరామ్ మంగడి, శ్రీవంశీకృష్ణ; కంజీరాపై శ్రీ డా. ఆర్. శ్రీకాంత్ సహకరించారు.

శ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు కళాకారులు అందరిని సత్కరించారు.

''కళాసాగరం'' సంస్థ వారు అందరికి భోజన సదుపాయాలు కల్పించారు.

తేది 15.12.2024 న పద్మశ్రీ ఎల్లా వేంకటేశ్వరావు

దంపతులను గుర్రపు బగ్గీపై, హైదరాబాదు పురవీధులలో తెలంగాణా ప్రభుత్వ, సెక్రటేరియేట్ నుండి నగరంలో ప్రసిద్ధిగాంచిన ''రవీంద్రభారతి'' హాలు వరకు శిష్యులందరూ కలసి వేదమంత్రాలలో ఘనంగా ఊరేగించారు.

తరువాత హాలు వద్దనుండి పూర్ణ కుంభ స్వాగతం పలికి శిష్యులందరు పల్లకి సేవ చేసి హాలులో తీసుకువచ్చారు.

ఆపై నేతి రామకృష్ణగారు గురువుగారి జీవిత గాథపై ఒక ఆడియో, వీడియో ప్రదర్శన రూపొందించి ప్రదర్శించారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకొన్నది.

తరువాత నలుమూలల నుంచి వచ్చిన శిష్యులందరు కలసి వేదమంత్రోచ్చారణ మధ్య సభాస్థలికి తీసుకువచ్చారు.

అనంతరం ముఖ్య అతిథులు అయిన శ్రీ జూల్లి కృష్ణారావు (మంత్రివర్యులు, సాంస్కృతిక శాఖ), శ్రీ మామిడి హరికృష్ణ (సంచాలకులు, సాంస్కృతిక శాఖ), శ్రీ ఆకెళ్ల విభీషణశర్మ, శ్రీ యల్.వి. సుబ్రహ్మణ్యం (Retd. Chief Secy. – A.P.) శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, శ్రీ అన్నవరపు రామస్వామి, మరియు ఇతరులను శ్రీమడిపల్లి దక్షిణామూర్తి ముఖ్య అతిథులగా సభాస్థలికి ఆహ్వానించారు. అందరూ కలసి జ్యోతి ప్రజ్వలన గావించారు.

శ్రీమతి సుబ్బలక్ష్మి గారి ప్రార్థనగీతంతో సభా కార్యక్రమము మొదలు కాగా అనంతరం శిష్యులందరు కలసి సాంప్రదాయ రీతిలో గురుదంపతులను అలంకరించి, పుష్పకిరీటం ధరింపజేసి పుష్పాభిషేకం చేశారు.

తరువాత శ్రీ అన్నవరపు రామస్వామి మరియు నేతి రామకృష్ణ ''ఎల్లా'' గారికి స్వర్ణకంకణ ప్రదానం చేశారు.

తరువాత శ్రీ యల్.వి. సుబ్రహ్మణ్యం ఇతర అతిథులు సన్మానపత్రం అందజేశారు.

ఎల్లావారికి ''ప్రణవనాద కళాతపస్వి'' అని బిరుదును ప్రదానం చేశారు. తరువాత శిష్యులందరు కలసి గురువుగారికి కనకాభిషేకం మరియు గజమాల సమర్పించారు.

తరువాత ముఖ్య అతిథులు ''ఎల్లా''వారు చేసిన సంగీత సేవపై విశేషంగా మాట్లాడారు.

ఇందులో ప్రత్యేకంగా ''జొన్నవిత్తుల'' వారు ''ఎల్లా''పై ఆశువుగా పద్యపఠన చేసి ప్రేక్షకులనీ, సభాసదులను. మంత్రముగ్ధులను చేశారు.

ఆపై జంట నగరాలలోని ఇతర గాన సభల, కార్యదర్శులు, అధ్యక్షులు, ''కళాసాగరం'', ''శిఖ'', ''శ్రీరామగానసభ'', విజ్ఞానసమితి మరియు ఇతరులు ''ఎల్లా''వారిని శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.

తరువాత అందరు ఎదురుచూస్తోన్న సంగీత కార్యక్రమము మొదలైంది. ఇందులో ప్రథమంగా త్యాగరాజ స్వామివారి కీర్తన ''ఎందరో మహానుభావులు'' గానం చేశారు.

తరువాత ఎల్లా వారి స్వీయరచన, జోగ్ రాగంలో మరియు రేవతి రాగంలో ''తిల్లాన'' ఆపై ''ఎల్లా''వారి తని ఆవృతం సభను ఆకట్టుకొంది.

ఇందులో పాల్గొన్న కళాకారులు గాత్రం–శ్రీమతి యం.వి. కమలారమణి, శ్రీమతి శేషులత, సుబ్బలక్ష్మి, శ్రీవిద్య, మల్లెల క్రాంతి స్వరూప్, మరియు ఎల్లా బాలమురళీ అందించారు. వయోలిన్ పై శ్రీ శ్రీధర్, శ్రీ పేరి త్యాగరాజు, సితార్ పై నందకామురీ. చివరిలో ''ఎల్లా'' వారు తన మనోభావాలు, అనుభూతి మరియు స్పందన వివరించిన పిమ్మట సభ ముగిసింది.

ఈ కార్యక్రమం ముఖ్యంగా శ్రీ నేతిరామకృష్ణ, పెరవలి జయభాస్కర్, సాంస్కృతి ఫౌండేషన్ శ్రీ వయొలిన్ వాసు వీరి ఆధ్వర్యంలో జయప్రదంగా ముగిసింది. Hoke TV వారు యూ–ట్యూబు లో కార్యక్రమాన్ని లైవ్ లో ప్రదర్శించారు.

**– గానకళ ప్రత్యేక ప్రతినిధి**

## రాజమహేంద్రవరం విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల వారి ఆధ్వర్యంలో



### "నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలు" నిర్వహణ

రాజమహేంద్రవరం, విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో ది:20-12-2024 శుక్రవారంనాడు సాయంత్రం 5.00 గం॥ల నుండి గం॥ 6.30 ని॥ల వరకు "నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలు" పేరిట పాఠశాలలో సంగీత కార్యక్రమము నిర్వహించడమైనది.

ఈ కార్యక్రమములో భాగంగా ముందుగా జ్యోతిప్రజ్వలన చేయడమైనది. అనంతరం పాఠశాల విద్యార్థి చి॥ వి.మణికంఠ సాయి నరేష్‌చే మృదంగ లయ విన్యాసం నిర్వహించడమైనది. ఈ మృదంగ లయ విన్యాసం శ్రీ జి.ఎల్.కృష్ణమూర్తి, మృదంగ సహోపన్యాసకుల నిర్వహణలో జరిగినది. తదుపరి పాఠశాల విద్యార్థులు శ్రీమతి వి. శ్రీదేవి మరియు కుమారి కె.సత్య శివ గౌరి వారిచే వీణ కచేరి నిర్వహించడమైనది. ఈ కచేరికి శ్రీ జి.ఎల్.కృష్ణమూర్తిగారు మృదంగ సహకారం అందించారు. ఈ వీణ కచేరి శ్రీ కె.ఎస్.సుబ్రహ్మణ్యం, వీణ అధ్యాపకుల నిర్వహణలో జరిగినది. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు ఇవ్వడమైనది.

స్థానిక కళాకారులు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులందరూ పాల్గొని కార్యక్రమమును జయప్రదంచేసినారని ప్రిన్సిపాల్, డా॥ ఎమ్. నాగలక్ష్మి, ఒక ప్రకటనలో చెప్పారు.








### సంగీత క్షీరసాగరం, హైదరాబాద్.

వారి నిర్వహణలో 6.12.2024న కుమారి వైజర్స్ ప్రణతి గాత్ర సంగీత సభ జరిగింది. చి॥ పన్నాల కౌండిన్య – వైలన్‌పై, చి॥ వీరంరాజు లక్ష్మీఅజయ్ – మృదంగంపై సహకరించారు. సీనియర్ విద్వాంసులు సభా నిర్వాహకులు శ్రీ ఓరుగంటి ఆనందమోహన్ కార్యక్రమ నిర్వాహకులు.

# శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘము- గుంటూరు.




లక్ష్మి పురము నందలి శ్రీ త్యాగరాజ కళావేదిక పై, నెలవారీ కార్యక్రమంగా డిసెంబర్ 22 ఆదివారం సాయంత్రం 6:30 లకు అమెరికానుండి విచ్చేసిన శ్రీమతి సవిత నాముదూరి గాత్ర కచేరి జరిగినది. యీ కార్యక్రమమునకు వాయులీన సహకారం వారి కుమార్తె కుమారి షాలిని నాముదూరి, USA. మృదంగసహకారం శ్రీ నేతి రామకృష్ణ, USA. గారలు అందించిరి. యీ కార్యక్రమాన్ని కీర్తి శేషులు DR. S. బ్రహ్మానందం గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సమర్పించిరి. కార్యక్రమం తొలుత నాటకురంజి పదవర్ణం తో ఆరంభించి, శక్తిగణపతిమ్, నాటరాగంలో కొనసాగించిరి. స్వరసాహిత్య ప్రస్తారసహితంగా రక్తివంతంగా గానం చేసారు. అనంతరం రామా భిరామ, ధన్యాసిలో త్యాగరాజకృతి "మనసు రంజిల్ల కీర్తించగా "అని స్వామివారే అన్నట్లు మనోరంజకంగా .గానం సలిపారు.తదుపరి హరికాంభోజి రాగంలో త్యాగయ్యగారి రచన, 'దినమణి వంశ' చక్కని సంప్రదాయ శుద్ధమైన శైలిలో వినిపించారు, అప్పై లతాంగి రాగంపాడి పట్నం సుబ్రహ్మణ్య అయ్యరు గారి కృతి 'మరివేరెదిక్కెవ్వరు' స్వరసంచారాలతో భావగర్భితంగా గానంచేశారు. తరువాత శ్యామశాస్త్రి వారి 'మరివేరే గతి ఎవ్వరమ్మా' ఆనంద భైరవి లోపాడి, వివాది మేళమైన రసికప్రియలో శ్రీ బాలమురళి గారి రచన పవనతనయ సమర్థవంతంగా గానం చేసారు. ఏరాగంపాడినా ఎత్తుగడ స్వరంలోనే రాగంయేదో శ్రోతకు తెలిసేలా, సాహిత్య స్పష్టతతో వినిపించారు. అలా పాడటం పూర్వసంప్రదాయం. విద్వాంసుల సత్కారం అనంతరం ప్రధానాంశంగా అభేరి రాగం లో శ్రీ మైసూరు వాసుదేవాచార్యుల వారి సుప్రసిద్ధ రచన భజరేరే!మానస! రాగస్వరసాహిత్యప్రస్తార సహితంగా,సర్వాంగశోభితంగా మనోజ్ఞంగా సాగింది. కచేరి ఆసాంతం సత్సంప్రదాయ శైలి లో సాగింది. దానికితోడు మంచి ఒదుగైనగాత్రం.వాయులీనం పై చిరంజీవి షాలిని తల్లిని మించిన తనయ అన్నట్లుగా సహకరించి పిట్టకొంచెం కూతఘనమని నిరూపించింది.రామకృష్ణ గారి మృదంగం సొగసైన మృదంగతాళయుతమై భాసించింది. గాత్రమొక్కింత యిబ్బంది పెట్టినా పాటలోని పాటవంతో అనుభవ జ్ఞానంతో కచేరి ఆపాతమధురంగా సాగించారు. ఒకటి రెండు లలితశాస్త్రీయ అంశాలు తదుపరి తిల్లాన, మంగళంతో సభ సుసంపన్న మైంది. యీ కార్యక్రమం సభ గౌరవ కార్యదర్శి శ్రీ. V.కృష్ణాకిషోర్ ఆధ్వర్యంలో మా 'అ'పూర్వ కార్యదర్శి శ్రీ నేతి విశ్వేశ్వర రావు మరియు శ్రీ. S. గిరిజాశంకర్ గార్ల నేతృత్వంలో మంగళప్రదంగా ముగిసింది.

# శ్రీ సద్గురు సన్నిధి - రాజమండ్రి

ద్వాదశ వార్షిక కార్యక్రమములు, 4-12-2024 నుండి 8-12-2024 వరకు,

4-12-2024 న శ్రీమతి వై.జి. శ్రీలత (బెంగళూరు) వీణ, పుత్తూరు టి. నిక్షిత్ మృదంగం, యస్. క్షుమంతరావు ఘటం, అనంతరం నటనాతరంగిణి సంస్థ నాట్యాచారిణి శ్రీమతి వై.జి. శ్రీలత శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన.





5-12-2024 న శ్రీమతి ఎనమండ్ర మణి 'సదాశివ బ్రహ్మేంద్రస్వామి' కీర్తనల గానం. పి. గణపతిరావు, కె. సూరిబాబు వాద్యసహకారాలు. అనంతరం బి. అదితి ప్రహ్లాద (బెంగళూరు) గాత్రం, హనుమంతరామ్ చరణ్ - వైలన్, ధన్వాడ ధర్మారావు - మృదంగం, బి. మారుతీ రఘురామ్ - ఘటం.





6-12-2024 న ఆచంట లక్ష్మీ శ్రీనివాస్, యస్. బ్రహ్మానందరావు నామ సంకీర్తనం. అనంతరం బుర్రా భాస్కర శర్మ ప్రవచనం.





7-12-2024న శ్రీ పి. దుర్గాప్రసాద్ సంకీర్తన గాణం, కె. సుబ్బరాయన్, వి. నరసింహాచార్యులు మృదంగం అనంతరం యం. సింహాచలశాస్త్రి భాగవతార్ హరికథాగానం, జె. సాయిబాబా, యస్. హనుమంతరావు సహకారాలు.





8-12-2024 న సర్వశ్రీ వి. సత్యనారాయణ, బృందం నర్తనశాల బుర్రకథ, యం. వెంకటేశ్వరరావు, బృందం శ్రీకృష్ణరాయబారం బుర్రకథ, కె. ప్రమానందం, బృందం పద్మవ్యూహం బుర్రకథ, యం. ప్రసాద్ బాబు కన్యకా పరమేశ్వరి చరిత్ర బుర్రకథ, విజ రాజ్ కుమార్, బృందం అల్లూరి సీతారామరాజు బుర్రకథ, శ్రీమతి ఎడవల్లి శ్రీలక్ష్మి శ్రీ సీతారామ కళ్యాణం బుర్రకథ. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు మృదంగ విద్వాన్ శ్రీ వరదరావు కమలాకర్ రావు సంస్మరణ సభ. అనంతరం శ్రీమతి నర్ల రత్నకుమారి చే కృతికదంబం, కె. సుబ్బరాయన్, కె. జ్ఞానప్రకాశరావు సహకారాలు.



భారతీయ శాస్త్రీయ నృత్య వైభవం శీర్షికన కుమారి నరుకుర్తి యశశ్రీకూచిపూడి నృత్య ప్రదర్శన. నాట్యాచార్యులు ఆచంట చంద్రశేఖర్ బృందం నవజనార్ధన పారిజాతం పేరిణి నృత్య ప్రదర్శన. కార్య నిర్వాహకులు శ్రీశిష్టు మధుసూదన్.

# నివాళి



A great Tabla Meastro Dr Zakir Hussain is no more.Great loss to the Indian Music. May the devine soul rest in peace. Om Shanti !

**పద్మవిభూషణ ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు**
**ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ 9-12-2024 సోమవారం కన్నుమూసారు.**
**వారికి గానకాళా లోకం నివాళులు అర్పిస్తున్నది.**



నాట్యాచారిణి కల్యాణిమాధవి గారికి సన్మానం.
14.12.24న ఏలూరు
'అభినయ నృత్య భారతి' సంస్థవారు
"నృత్య తపస్వి" అవార్డు ప్రదానం చేసారు.



20.12.24 న పార్థసారథి సభ, చెన్నైలో
శ్రీశ్రీ సోదరీమణుల గానం.
ఆర్.శ్రీకృతి–వైలన్;
పున్నూర్ అరవింద కౌశిక్–మృదంగం.

# నివాళి



ప్రముఖ ఇంజనీరు సంగీత ప్రియులు, సంగీత పోషకులు, రికార్డింగ్ నిపుణులు
**శ్రీ పెద్దాడ సత్యరామచంద్రారావు** (విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి గారి భర్త)
7.12.24 మధ్యాహ్నం స్వల్ప అస్వస్థత తో కాకినాడ లోని వారి గృహంలో కన్నుమూశారు. వీరు చేసిన సంగీత సేవ గణనీయమైనది. కాకినాడ లోని సంగీత కళాకారులు శ్రద్ధాంజలి ఘటించారు.



పద్మశ్రీ మృదంగ విద్వాన్ ప్రణవనాథ కళాతపస్వి శ్రీ ఎల్లా వెంకటేశ్వరరావుగారికి స్వర్ణ కంకణం ధరింపజేస్తున్న పద్మశ్రీ డా. అన్నవరపు రామస్వామి.



విజయవాడ గంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ విరమణ చేసిన వైణికులు శ్రీ కె.యస్. గోవిందరాజన్ వారికి స్వర్ణకంకణ ప్రదానం చేస్తున్న పద్మశ్రీ డా. అన్నవరపు రామస్వామి.



సంగీత సామ్రాట్ శ్రీ యం.యస్. బాలసుబ్రహ్మణ్య శర్మ స్మారక సంస్థ, సుమధుర గాన సుధాకర శ్రీ కె.వి. బ్రహ్మానందం కళా సంస్థ తెలుగు కళావాహిని కామ్రేడ్ జి.ఆర్.కె. పోలవరపు సాంస్కృతిక సమితి - శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో డా. మండపాక నాగలక్ష్మి గారికి "మృదంగమహారాణి" బిరుదుతో సన్మానించు దృశ్యం



గాయక సార్వభౌమ సంగీత పరిషత్ లో పద్మశ్రీ అన్నవరపు రామస్వామిగారి చేతుల మీదుగా సన్మానం పొందిన శ్రీ సుధీర్ శర్మ.



ఆంధ్రా కల్చరల్ & వెల్ఫేర్ సొసైటీ ఢిల్లీలో శ్రీశ్రీశ్రీ స్వాత్మానంద సరస్వతీ చేతుల మీదుగ సత్కారం అందుకుంటున్న ఆకాశవాణి లలిత సంగీత 'ఏ' గ్రేడ్ విద్వాంసులు శ్రీ అంగాడి శివప్రసాద్



డిసెంబర్ 7 న గాయత్రి మహిళా సంగీత సన్మండలి గుంటూరులో గాయక సార్వభౌమ శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు స్మారక అవార్డును అందుకుంటున్న శ్రీమతి పాటిబండ్ల జానకి.

**Editor & Publisher : Ganakala, M.Venkatarao**
**30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721**